# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 2 ఆగస్టు 2025 | సంపుటి: 9 | సంచిక: 215 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## రాష్ట్రవ్యాప్తంగా శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు



2

## ఫేక్ పెండ్లి పిల్ల అరెస్టు



తొమ్మిదో వివాహం చేసుకుంటుండగా పట్టుబడిపోయిన మోసగత్తె 9

## రష్యా నుంచి చమురు కొంటూనే ఉంటం

### ట్రంప్ వ్యాఖ్యలపై భారత్ స్పందన



ఢిల్లీ, ఆగస్టు 1: తమ వస్తువులపై అమెరికా 25 శాతం సుంకాలు విధించడంతో పాటు రష్యా నుంచి చమురు దిగుమతులపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత్ ఆచితూచి స్పందించింది. 'డెడ్ ఎకానమీ'పై చెప్పడానికి ఏమీ లేదంటూ అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలను తేలికగా తీసుకుంది. ఇరు దేశాల భాగస్వామ్యం అనేక మార్పులు, సవాళ్లను ...మిగతా 2లో

## ఉల్లాసంగా.. హుషారుగా జనహిత పాదయాత్ర

పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ్మ, పొన్నం ప్రభాకర్, వివేక్

మీనాక్షి నటరాజన్ వెంట కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు



3

## సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక

అదే రోజు రిజల్ట్ • షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం 2

సీఎంకు అందిన కాళేశ్వరం కమిషన్ నివేదిక

# అధ్యయనానికి ప్రత్యేక కమిటీ

### 4న క్యాబినెట్ ప్రత్యేక భేటీ.. చేపట్టవలసిన చర్యలపై చర్చ

హైదరాబాద్, ఆగస్టు 1, (మనం బ్యూరో): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక సీఎం రేవంత్ రెడ్డికి అందింది. ఈ నివేదికను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎంకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ రామకృష్ణారావు భేటీ అయి కాళేశ్వరంపై కమిషన్ ఇచ్చిన నివేదికపై చర్చించారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన ...మిగతా 2లో



## ఉత్తమ జాతీయ తెలుగు చిత్రంగా భగవంత్ కేసరి

### తెలుగు సినిమాలకు మూడు అవార్డులు

71వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రకటన





2

## నేడు ఢిల్లీలో ఏఐసీసీ లీగల్ సెల్ సదస్సు

### ప్రసంగించనున్న రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 1 ( మనం బ్యూరో): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ కాంగ్రెస్ శనివారం ఢిల్లీలో భారీ సదస్సు నిర్వహించనుంది. ఏఐసీసీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ...మిగతా 2లో

## రేవంత్‌కు భారీ ఊరట

### పరువు నష్టం కేసు కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్,ఆగస్టు 1, (మనం బ్యూరో): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి భారీ ఊరట లభించింది. గత ఏడాది మే 4న కొత్తగూడెంలో జరిగిన సభలో సీఎం ప్రసంగం కారణంగా బీజేపీ పరువుకు భంగం వాటిల్లిందంటూ ఆ పార్టీ నేత కాసం వెంకటేశ్వర్లు దాఖలు ...మిగతా 2లో





# కమ్యూనిస్టులు ఉప్పులాంటోళ్లు

- కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో వీరి సహకారముంది
- రెండు పార్టీలు కలిసి పనిచేస్తే ప్రజలకు ప్రయోజనం
- జర్నలిజంలో విశ్వసనీయత పెరగాల్సిన అవసరముంది
- సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 1, (మనం బ్యూరో): కమ్యూనిస్టులు ఉప్పు లాంటి వారనీ, ఉప్పు లేని వంట రుచి ఉండదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. అలాగే, ప్రజా సమస్యలపై పోరాటంలో ఎర్ర జెండా కనిపించినప్పుడే ఆ సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నవ తెలంగాణ దినపత్రిక 10వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గతంలో తమ భావజాలాన్ని ప్రజలకు వివరించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు పత్రికలను నడిపేవనీ, కానీ, ఈరోజుల్లో రాజకీయ పార్టీల పత్రికలు వింత పోకడలతో తమ సంపాదనను కప్పిపుచ్చుకోవడానికి పనిచేస్తున్నాయని వ్యాఖ్యానించారు. దీంతో జర్నలిస్టు అనే పదానికి విలువ లేకుండా పోతున్నదనీ, జర్నలిజం ముసుగులో ఉన్న కొన్ని రాజకీయ పార్టీల పత్రికల తీరును నిశితంగా గమనించాలని సూచించారు. నిజమైన జర్నలిస్టులు సెమినార్లు నిర్వహించి జర్నలిస్ట్ అనే పదానికి నిర్వచనం ఇవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. గతంలో మేం ప్రెస్ మీట్లు నిర్వహించినప్పుడు సబ్జెక్టుపై జర్నలిస్టులతో వివరాలు తీసుకునే వాళ్లం. కానీ, ఇవాళ వింత పోకడలు వచ్చాయి. ఈ వింత పోకడలకు రాజకీయ పార్టీలు తోడయ్యాయని సీఎం పేర్కొన్నారు. రాజకీయ నాయకుల మాదిరిగానే జర్నలిస్టుల విశ్వసనీయత కూడా వేగంగా సన్నగిల్లుతోందనీ, అందుకే నిజమైన జర్నలిస్టులు దీనికి ఒక లక్ష్మణ రేఖ గీయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నిజమైన జర్నలిస్టులు, జర్నలిస్టుల ముసుగు తొడుక్కున్న వారిని జర్నలిస్టులే వేరు చేయాల్సిన అవసరం ఉందనీ, లేదంటే దేశ భద్రతకే ప్రమాదకరంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య సహకారం ఇలాగే కొనసాగాలనీ, ఈ రెండు పార్టీలు కలిసి పని చేస్తే ప్రజలకు మరింత ప్రయోజనాలు దక్కుతాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## బీసీ రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు

### కాంగ్రెస్ నిర్లక్ష్యానికి నిరసనగా నేడు ధర్నా

### బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్, ఆగస్టు 1, (మనం బ్యూరో): బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసే అంశంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. శుక్రవారం ఆయన నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ రిజర్వేషన్లు అమలు చేసే అధికారం రాష్ట్రానికి ఉందన్నారు. కాంగ్రెస్‌కు రిజర్వేషన్లు అమలు చేతకాక ఆ నెపాన్ని కేంద్రంపై నెడుతున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం కాదనీ, అయితే, మత పరమైన రిజర్వేషన్లకు మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ పదేపదే గోబెల్స్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య తెలిపారు.

## ఐర్లాండ్‌లో భారతీయులపై దాడులు..

### కీలక అడ్వైజరీ జారీ చేసిన ఇండియన్ ఎంబసీ

లండన్, ఆగస్టు 1: ఐర్లాండ్‌లో భారత పౌరులపై ఇటీవల భౌతిక దాడులు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో పౌరుల భద్రతకు సంబంధించి అక్కడి భారత రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రతికూల సమయాల్లో నిర్జన ప్రదేశాలకు వెళ్లొద్దని, భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ''ఐర్లాండ్లోని భారతీయులపై ఇటీవల భౌతిక దాడుల కేసులు పెరుగుతున్నాయి. ఈ విషయంలో ఐర్లాండ్ అధికారులతో భారత రాయబార కార్యాలయం సంప్రదింపులు జరుపుతోంది. ఇదే సమయంలో పౌరులు కూడా వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా నిర్జన ...మిగతా 2లో

## రసాభాసగా రేషన్ కార్డుల పంపిణీ

బంజారాహిల్స్‌లో గందరగోళం • కేసీఆర్ పేరు ఎత్తిన పొన్నం ప్రభాకర్.. మంత్రి ప్రసంగాన్ని అడ్డుకున్న దాసోజు శ్రవణ్ 2

## అత్యాచార కేసులో ప్రజ్వల్ రేవణ్ణ దోషి

కోర్టులో ఏడ్చేసిన మాజీ ఎంపీ



2



## ఎడాపెడా సుంకాలు పెంచిన ట్రంప్

### 70 దేశాలపై 10 నుంచి 41 శాతం పెంపు

### పాకిస్తాన్‌కు మాత్రం తగ్గించాడు

న్యూయార్క్, ఆగస్టు 1: అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ మరోసారి సుంకాలతో విరుచుకుపడ్డారు. దాదాపు 70 దేశాలపై ఉన్న సుంకాలను పెంచారు. 10 శాతం నుంచి 41 శాతం వరకు పరస్పర సుంకాలను విధించే ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఇందులో సిరియాపై అత్యధికంగా 41శాతం టారిఫ్‌ను విధించినట్టు సమాచారం. కెనడా నుంచి వచ్చే దిగుమతులపై సుంకాన్ని 25 శాతం నుంచి 35 శాతానికి పెంచారు. బ్రెజిల్‌పై ఇప్పటికే ఉన్న 10 శాతం సుంకాలకు అదనంగా 40శాతం జత చేశారు. ...మిగతా 2లో

## శిశువుగా రూపాంతరం చెందిన 30 ఏండ్ల నాటి పిండం

### సైన్స్ ఫిక్షన్ మాదిరి అద్భుతమంటున్న శాస్త్రవేత్తలు



న్యూయార్క్, ఆగస్టు 1: దాదాపు 30 ఏండ్ల పాటు శీతలీకరించిన ఒక పిండం ఇప్పుడు శిశువుగా రూపుదిద్దుకుంది. ఇంత దీర్ఘకాలం పాటు భద్రపరిచిన పిండం శిశువుగా రూపాంతరం చెందడం సైన్సు అద్భుతమని.. సైన్స్ ఫిక్షన్ అని అభివర్ణిస్తున్న శాస్త్రవేత్తలు ఇదొక ప్రపంచ రికార్డు అని తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. అమెరికాలోని ఒహాయోకు చెందిన లిండ్సే, టిమ్ పియర్స్ జంటకు మగశిశువుగా ఈ పిండం జన్మించింది. వీరు సంతానం కోసం దాదాపు ఏడేండ్లు రకరకాలుగా ప్రయత్నించి చివరకు లిండా ఆర్చర్డ్ అనే మహిళకు సంబంధించిన పిండాన్ని స్వీకరించాలని నిర్ణయించారు. సహజసిద్ధంగా సంతానం కలగకపోవడంతో 1994లో లిండా ఆర్చర్డ్.. ఐవీఎఫ్ విధానం వైపు మొగ్గారు. ఇందుకోసం వైద్యులు.. ఆమె అండాలు, ఆమె భర్త వీర్యకణాలతో ఫలదీకరణ చేయించి నాలుగు పిండాలను వృద్ధి చేశారు. ఇందులో ఒక పిండం ద్వారా లిండా ఆర్చర్డ్ ఆడ ...మిగతా 2లో

## మేము చేస్తే తప్పు.. మీరు చేస్తే ఒప్పా?

### 'రష్యాతో వ్యాపారం'..పై అమెరికాను నిలదీసిన చైనా

న్యూయార్క్, ఆగస్టు 1: రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే దేశాలపై భారీగా సుంకాలు విధిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే హెచ్చరికలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ హెచ్చరికలపై చైనా మరోసారి తీవ్రంగా స్పందించింది. వాస్తవానికి రష్యాతో అమెరికానే వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తుందని ఐక్యరాజ్యసమితిలోని ...మిగతా 2లో

# అధ్యయనానికి ప్రత్యేక కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అన్ని రకాల వైఫల్యాలు చోటుచేసుకున్నాయనీ, దీనికి కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పలువురు కారణమని నివేదికలో జస్టిస్ ఘోష్ స్పష్టం చేసినట్లు తెలిసింది. వ్యవస్థలు కాకుండా వ్యక్తుల ఇష్ట ప్రకారమే పనులు జరిగాయనీ, ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిడులకు లొంగి నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నారని స్పష్టం చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా ఆర్థిక అవకతవకలు జరిగాయనీ, ఐఏఎస్లకు, ప్రాజెక్టులో పని చేసిన ఇంజినీర్లకు మధ్య సమన్వయం లోపించిందనీ, ఈ కారణంగా ప్రాజెక్టులో పలు లోపాలు చోటు చేసుకున్నట్లు కమిషన్ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు సంబంధించి డీపీఆర్ మొదలుకుని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, అన్నారం సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో ఎప్పుడు ఏం జరిగింది? రికార్డుల ఆధారంగా ఎక్కడ ఎవరు బాధ్యులన్నది వివరంగా జస్టిస్ ఘోష్ ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో పొందుపర్చినట్లు తెలిసింది.

**4న క్యాబినెట్ భేటీ..**

**కాళేశ్వరం నివేదికపై చర్చ**

4న క్యాబినెట్ ప్రత్యేక భేటీ జరుగనుంది. కాళేశ్వరం కమిషన్ సమర్పించిన నివేదికను ఈ భేటీలో చర్చించనున్నారు. నివేదికలో పేర్కొన్న మేరకు కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలకు కారణం ఎవరు? ప్రాజెక్టు వ్యయం అంచనాలకు మించి భారీగా ఎందుకు పెరిగింది? ఐఏఎస్లు, ఇంజినీర్ల మధ్య సమన్వయ లోపానికి కారణం ఏంటి? గత ప్రభుత్వంలోని పాలకుల పాత్ర ఎంత? ఎవరిపై చర్యలు తీసుకోవాలి? వంటి విషయాలపై ఈనెల 4న జరుగనున్న ప్రత్యేక క్యాబినెట్ భేటీలో చర్చించనున్నారు. కాళేశ్వరం కమిషన్ సమర్పించిన నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ కమిటీలో నీటి పారుదల శాఖ సెక్రటరీ, న్యాయశాఖ సెక్రటరీ, జీఏడీ సెక్రటరీ సభ్యులుగా ఉంటారు. ఈ నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని అధికారుల బృందం ఈనెల 4లోగా ప్రభుత్వానికి అందజేయనుంది.

# నేడు ఢిల్లీలో ఏఐసీసీ లీగల్ సెల్ సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

సదస్సులో బీజేపీ హయాంలో రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిరక్షణకు సంబంధించిన అంశాలపై చర్చ జరుగనుంది. ఈ సదస్సులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ సదస్సులో మొత్తం 41 అంశాలపై కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్ని రాష్ట్రాల ముఖ్య నేతలు పాల్గొంటారు.

# నేడు ఢిల్లీలో ఏఐసీసీ లీగల్ సెల్ సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

చేసిన పిటిషన్ను హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని సీఎం చేసిన వ్యాఖ్యలపై కాసం ఫిర్యాదు చేశారు. ప్రజా ప్రతినిధుల కోర్టు విచారణలో ఉన్న ఈ కేసును కొట్టి వేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన హైకోర్టు కేసును కొట్టివేస్తూ శుక్రవారం తీర్పు వెలువరించింది.

## ఆలయాల్లో శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు

హైదరాబాద్: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా రాష్ట్రంలోని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

# కీలక అడ్వైజరీ జారీ చేసిన ఇండియన్ ఎంబసీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రదేశాలకు వెళ్లొద్దు'' అని అడ్వైజరీలో పేర్కొంది. అత్యవసర పరిస్థితుల్లో ఎంబసీని సంప్రదించాలని సూచిస్తూ ఫోన్, మెయిల్ ఐడీ వివరాలను అందించింది. రాజధాని డబ్లిన్ శివారులోని తల్లాగ్ట్లో జులై 19న డాక్టర్ సంతోష్ యాదవ్ అనే భారత పౌరుడిపై కొందరు స్థానిక యువకులు జాత్యాహంకార దూషణలు చేస్తూ దాడికి పాల్పడ్డారు. ముఖం, ఛాతీ, కాళ్లు, చేతులపై పిడిగుద్దులతో రక్తస్రావం అయ్యేలా చితకబాదారు. చివరకు బాధితుడు మేల్కొని పోలీసులకు సమాచారం అందించడంతో అంబులెన్స్లో అతడిని ఆసుపత్రికి తరలించారు. తనకు ఎదురైన అనుభవాన్ని వివరిస్తూ సోషల్ మీడియా వేదికగా సంతోష్ యాదవ్ ఇటీవల పోస్టు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. స్థానికంగా బస్సులు, నివాస ప్రాంతాలు, వీధుల్లో (ఖుఛీజ్ఞీు ఛిజ్టీజ్ఞీుట జీ ఐట్ఛుజ్ఞూ్ఛుఛీ) ఇటువంటి జాత్యాహంకార దాడులు సాధారణంగా మారిపోయాయని వాపోయాడు.

ఈ దాడి ఘటనపై కేసు నమోదు చేసిన ఐర్లాండ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, ఈ ఘటన షాక్కు గురిచేసిందని ఐర్లాండ్లోని భారత రాయబారి అఖిలేశ్ మిశ్రా అప్పట్లో స్పందించారు. బాధిత కుటుంబ సభ్యులతో టచ్లో ఉన్నామని, అవసరమైన సాయాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఈ దాడిని ఖండిస్తూ స్థానికంగానూ నిరసనలు వెల్లువెత్తాయి.

# రసాభాసగా రేషన్ కార్డుల పంపిణీ

**హైదరాబాద్, మనం ప్రతినిధిః** హైదరాబాద్లో రేషన్ కార్డుల పంపిణి రసభసాగా మారింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... గత కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. దీనిపై దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారు మంత్రి ప్రసంగాన్ని అడ్డుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వెంటనే మీరిచ్చిన 420 హామీలు ఎమైనయ్? అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ను నీలదీశారు. దీంతో అక్కడ కొంత గందరగోళం నెలకొంది. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్లోని బంజారా భవన్లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. కేసీఆర్ పాలనలో 6 లక్షల రేషన్ కార్డులు జారీ చేశామని దాసోజు శ్రవణ్ తెలిపారు. సమస్యలు వివరిస్తామని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రయత్నించగా, మంత్రి పొన్నం, ఎమ్మెల్యే దానం నాగేందర్ వారిని వారించారు. కార్పొరేటర్లు తమాషా చేస్తున్నారా? అంటూ దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్కడ గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

## ఎడాపెడా సుంకాలు పెంచిన ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

భారత్పై 25శాతం టారిఫ్ విధించారు. అయితే, పాకిస్థాన్ దిగుమతులపై 29 శాతంగా ఉన్న టారిఫ్లను 19 శాతానికి తగ్గించడం గమనార్హం. ఇక జాబితాలో లేని దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై 10 శాతం సుంకం ఉంటుందని ట్రంప్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. పరస్పర సుంకాల నేపథ్యంలో వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి ఆగస్టు 1 వరకు ట్రంప్ గడువు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన సుంకాలను సవరించారు. ఈ సవరించిన టారిఫ్లు ఏడు రోజుల్లో అమల్లోకి రానున్నాయి. అయితే, భారత్, కెనడా దిగుమతులపై విధించిన టారిఫ్లు మాత్రం ఆగస్టు 1 నుంచే అమల్లోకి వస్తాయని అధ్యక్షుడు ఇప్పటికే చెప్పిన విషయం గమనార్హం.

# రష్యా నుంచి చమురు కొంటూనే ఉంటం

(మొదటి పేజీ తరువాయి)

ఎదుర్కొందని తెలిపింది. అయితే, రష్యాతో సంబంధాలకు కట్టుబడి ఉన్నామని, తమది స్థిరమైన, కాలం పరీక్షించిన భాగస్వామ్యం అని స్పష్టం చేసింది. పరిణామాలపై భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఏ దేశంతోనూ భారత్కు ఉన్న సంబంధాలను మూడో దేశం కోణంలో చూడొద్దని సూచించారు. రష్యా నుంచి చమురు కొనుగోలుకు కట్టుబడి ఉన్నామని, అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా తమ నిర్ణయాలు ఉంటాయన్నారు. దేశ ఇంధన ప్రయోజనాలను కాపాడుకోవడంలో భాగంగా అంతర్జాతీయ మార్కెట్లో అత్యుత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. పరస్పర ఆసక్తులు, ప్రజాస్వామ్య విలువలు, ప్రజల మధ్య బలమైన సంబంధాల విషయంలో భారత్, అమెరికా దేశాలు అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తాయి. ఇందులో ఇరు దేశాలు ఎన్నో మార్పులు, సవాళ్లను ఎదుర్కొన్నాయి. అందుకే ముఖ్యమైన ఎజెండాపైనే మేము దృష్టి సారించాం. ఈ భాగస్వామ్యం కొనసాగుతుందని విశ్వసిస్తున్నాం'' అని రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు. అమెరికాతో భారత్ రక్షణ సంబంధాలపై స్పందిస్తూ.. ఇరు దేశాలు బలమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇవి బలోపేతమయ్యాయన్న ఆయన.. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

**డెడ్ ఎకనమీలంటూ ట్రంప్ వ్యాఖ్య**

రష్యా నుంచి భారత్ చమురు కొనడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ట్రంప్.. ఆ రెండు దేశాలవి పతనమైన ఆర్థిక వ్యవస్థలని విమర్శించారు. మరోవైపు భారత్ చమురు కొనడంతోనే ఉక్రెయిన్ యుద్ధాన్ని రష్యా కొనసాగించగలుగుతోందని అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. ఆంక్షలవల్ల అక్కడ చమురు చౌకగా లభిస్తోందని, దురదృష్టవశాత్తూ అదే యుద్ధంలో రష్యా మనుగడకు ఉపయోగపడుతోందని అన్నారు.

## ఉత్తమ జాతీయ తెలుగు చిత్రంగా

# భగవంత్ కేసరి

**ఢిల్లీ, ఆగస్టు 1:** 2023 సంవత్సరానికి 71వ జాతీయ చలన చిత్ర అవార్డులను ప్రకటించారు. మొత్తం 15 విభాగాల్లో అవార్డులను జ్యూరీ ప్రకటించింది. జాతీయ ఉత్తమ చిత్రంగా 12 ఫెయిల్ సినిమాకు అవార్డు దక్కింది. జాతీయ ఉత్తమ నటుడి అవార్డును షారుక్ ఖాన్(జవాన్), విక్రాంత్ మస్సే(12 ఫెయిల్) పంచుకున్నారు. మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే (హిందీ)లో నటనకు గాను రాణీ ముఖర్జీని ఉత్తమ నటి అవార్డు వరించింది.

**తెలుగుకు మూడు అవార్డులు..**

ఉత్తమ తెలుగు చిత్రంగా ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి ఎంపికైంది. ఉత్తమ యాక్షన్ (స్టంట్ కొరియోగ్రఫీ)లో హనుమాన్ చిత్రం అవార్డు పొందింది. ఉత్తమ గేయ రచయితగా కాసర్ల శ్యామ్ (బలగం) అవార్డును సొంతం చేసుకున్నారు.

## శిశువుగా రూపాంతరం చెందిన 30 ఏండ్ల నాటి పిండం

(మొదటి పేజీ తరువాయి)

సంతానాన్ని పొందారు. మిగతా మూడు పిండాలను భద్రపరిచారు. ఆ తర్వాత భర్త నుంచి విడిపోయినప్పటికీ ఆ పిండాలను ఆర్చర్డ్ వదులుకోలేదు. వాటిని పరిశోధనకు లేదా గుర్తుతెలియని కుటుంబానికి దానమివ్వడం ఆమెకు ఇష్టంలేదు. దానితో ఆ పిండాలను ఏటా వేలాది డాలర్లను చెల్లించి భద్రపరిచారు. ఆ తరువాత అమెరికాలోనే ఉండే వివాహిత, శ్వేతజాతి క్రిస్టియన్ జంటకు ఆ పిండాలను ఇవ్వాలని ఆర్చర్డ్ నిర్దేశించారు. దీంతో రెండు పిండాలను లిండ్సే గర్భంలోకి ప్రవేశపెట్టారు. అందులో ఒకటి శిశువుగా వృద్ధి చెందింది. ఆర్చర్డ్కు ఇప్పుడు 62 ఏళ్లు. ఆమె కుమార్తెకు 30 ఏళ్లు. శిశువుగా మారిన తన పిండం ఫోటోను చూసి ఆర్చర్డ్ ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు.

# సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక

**ఢిల్లీ, ఆగస్టు 1:** ఉప రాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9న జరుగనుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ధన్ ఖడ్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. ఆగస్టు 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేస్తుంది. 21 వరకు నామినేషన్లు దాఖలుకు చివరితేదీగా నిర్ణయించింది. సెప్టెంబర్ 9న పోలింగ్ జరిపి, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని ఈసీ ప్రకటించింది. ఉభయ సభల్లో ఖాళీలతో కలిపి సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786గా ఉంది. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్ సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మరోవైపు విపక్ష కూటమికి లోక్ సభలో 234 మంది సభ్యులు, రాజ్యసభలో 79 మంది సభ్యుల బలముంది. మొత్తంగా ఎన్డీయేకు 422 మంది, విపక్ష కూటమికి 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఇలా ఉభయ సభల్లో మెజారిటీ లేనప్పటికీ ఉప రాష్ట్రపతి ఎన్నికలో పోటీ చేసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. తద్వారా తమ రాజకీయ లక్ష్యాలు సిద్ధిస్తాయని ఇండి కూటమి నాయకులు అంటున్నారు.

# బనకచర్లపై బరితెగింపు వారిది లోపాయికారీ ఒప్పందం

- బనకచర్ల కట్టి తీరుతామని లోకేశ్ చెబుతుండ్రు?
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని నిలదీత
- ఢిల్లీలో పీఠాన్ని కాపాడుకోవడం కోసమే బీజేపీ మౌనం
- మరి 'మా తెలంగాణ హక్కుల సంగతి ఏమిటి': నీలదీసిన హరీశ్రావు



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వంలో ఉన్నామనే ధైర్యం, తెలంగాణ కాంగ్రెస్ నేతల ధైర్యం చూసుకొని లోకేశ్ బనకచర్ల కట్టి తీరుతామని చెబుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతొన్న రాష్ట్ర ప్రభుత్వం బనకచర్లపై ఎందుకు మాట్లాడటం లేదు?.. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. మరి 'మా తెలంగాణ హక్కుల సంగతి ఏమిటి' అని ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి, కాంగ్రెస్ నాయకులు ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏదో లోపాయికారి ఒప్పందం చేసుకున్నందువల్ల మాట్లాడటం లేదని ఆయన ఆరోపించారు. నిలదీశారు. మేం బనకచర్ల కట్టి తీరుతామని లోకేశ్ చతో ఏపీ మంత్రి లోకేశ్ బనకచర్ల ప్రాజెక్టును కట్టి తీరుతామని చెబుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును కట్టి తీరుతామని లోకేశ్ మాట్లాడుతుంటే తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

'మా తెలంగాణ హక్కుల సంగతి ఏమిటి' అని ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి, కాంగ్రెస్ నాయకులు ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏదో లోపాయికారి ఒప్పందం చేసుకున్నందువల్ల మాట్లాడటం లేదని ఆయన ఆరోపించారు. గోదావరి-బనకచర్ల అజెండాలో ఉంటే తాము ఉమ్మడి రాష్ట్రాల సమావేశానికి రాబోమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేంద్రానికి లేఖ రాస్తే, ముఖ్యమంత్రి, అధికారులు మాత్రం ఇటీవల హాజరయ్యారని గుర్తుచేశారు. రాత్రికి రాత్రి ఢిల్లీకి వెళ్లి... మొదటి అంశమే బనకచర్ల ఉన్నప్పటికీ సమావేశంలో పాల్గొని, కమిటీ వేయడానికి అంగీకరించారని ఆరోపించారు.కాంగ్రెస్, బీజేపీ మౌనం కారణంగానే చంద్రబాబు బనకచర్లపై బుల్డోజింగ్ విధానంతో వెళుతున్నారని విమర్శించారు. మేం బనకచర్ల కట్టి తీరుతామని లోకేశ్ చెబుతుంటే, అసలు బనకచర్ల కడితే కదా అడ్డుకునేది అని రేవంత్ రెడ్డి చెబుతుండటం విడ్డూరంగా ఉందని అన్నారు. రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లించుకునే పనిలో ఉన్నట్లుగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. బనకచర్లపై లోకేశ్ బరితెగించి మాట్లాడుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. తన పదవిని కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి గురు దక్షిణ చెల్లించే పనిలో ఉండగా, ఢిల్లీలో పీఠాన్ని కాపాడుకోవడం కోసం బీజేపీ మౌనంగా ఉంటోందని ధ్వజమెత్తారు.

# మేము చేస్తే తప్పు మీరు చేస్తే ఒప్పా

(మొదటి పేజీ తరువాయి)

బీజింగ్ డిప్యూటీ శాశ్వత ప్రతినిధి గెంగ్ షువాంగ్ పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐరాస భద్రతా మండలిలో ఉక్రెయిన్కు ఆయుధ సరఫరాల అంశంపై చర్చ సమయంలో అమెరికా ప్రతినిధి చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. అనేక సందర్భాల్లో చెప్పినట్లే మేము(చైనా)రష్యాకు ఎలాంటి ఆయుధాలను అందించలేదని స్పష్టం చేశారు. రష్యాతో పాటు ఉక్రెయిన్ తో కూడా సాధారణ వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నామన్నారు. అవి అంతర్జాతీయ చట్టాలకు లోబడే ఉన్నాయని, ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదన్నారు. వాస్తవానికి అమెరికానే ఇప్పటివరకు రష్యాతో వాణిజ్యం కొనసాగించిందని విమర్శించారు. ఇతరులు వాణిజ్య సంబంధాలు కొనసాగించకూడదు కానీ.. మీరు చేయొచ్చా అని ఈసందర్భంగా ఆయన అమెరికాను నిలదీశారు. ఇతరులపై నిందలు వేసి బలిపశువులను చేయడం మాని.. చేతనైతే రష్యా- ఉక్రెయిన్ల మధ్య కాల్పుల విరమణ, శాంతితి నెలకొల్పడం అనే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు.మాస్కోతో వాణిజ్య సంబంధాలు కొనసాగించడాన్ని అమెరికా తీవ్రంగా తప్పుబడుతుంది. దీని కారణంగా ఉక్రెయిన్తో యుద్ధం సాగించేందుకు రష్యాకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతోంది. ఆ దేశం నుంచి ఇంధనం కొనుగోలు చేసే భారత్, చైనాలతో సహా ఇతర దేశాలపై పెద్దఎత్తున సుంకాలు విధిస్తానని పలుమార్లు హెచ్చరించింది. ఈక్రమంలోనే భారత్ పై 25శాతం సుంకంతో పాటు జరిమానాలు కూడా విధించిన విషయం విదితమే.

## కాంగ్రెస్‌ది ఆపన్న హస్తం కాదు? మొండి చెయ్యి..

- కేసీఆర్ పాలనలో ఇట్లెన్నడూ జరగలేదు?
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీది ఆపన్న హస్తం కాదు? మొండి చెయ్యి అని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నుండి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వరకు ఎందరో ఎస్సీ మంత్రులున్నా, స్పీకరున్నా ఎస్సీలకు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంలో మొండి 'చేయే' మిగులుతున్నది అని ఆర్ఎస్పీ ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో ఇట్లెన్నడూ జరగలేదు? అని ఆయన గుర్తు చేశారు.నేడు రేవంత్ ప్రభుత్వం ఎస్సీలకు ప్రత్యేక గైడ్ లైన్స్ తీసుకొచ్చింది. ఇంజనీరింగ్ కాలేజీలో చేరాలంటే ఫీజు విద్యార్థులే కట్టాలంట. ఇది కూడా కేవలం ఎస్సీలకు మాత్రమే ప్రత్యేక నిబంధన అంట. లక్ష రూపాయల ఫీజు ఎస్సీ విద్యార్థులు ఎలా కడుతారు? ఎందుకింత కోపం పేదల మీద రేవంత్ రెడ్డి..? అని ఆర్ఎస్పీ నిలదీశారు. గత ఏడాది వరకు ఇంజనీరింగ్ విద్యార్థులకు ట్యూషన్ ఫీజు, మెయింటనెన్స్ ఫీజు అన్నిటిని ప్రభుత్వం ఫీజు రియింబర్స్మెంట్ కింద కాలేజ్ అకౌంట్‌కి పంపేవారు. కానీ, ఈ ఏడాది నుండి కాలేజీకి చెల్లించే ఫీజు రియింబర్స్మెంట్ డబ్బులు, విద్యార్థుల అకౌంట్‌కి పంపిస్తామని చెబుతుంది. గత సంవత్సరం వరకు కాలేజీ యాజమాన్యాలు ఒక్క రూపాయి ఫీజు అడగకుండానే అడ్మిషన్ ఇచ్చేవారు. కానీ ఇపుడు మంచి ర్యాంకు తెచ్చుకుని కన్వీనర్ కోటాలో సీటు పొందినా, ఖచ్చితంగా కాలేజీ ఫీజు కడితేనే అడ్మిషన్ ఇస్తామని చెబుతున్నారు. ఏమన్నా అంటే చూడండి ప్రభుత్వమే గైడ్ లైన్స్ ఇచ్చింది అని యాజమాన్యాలు చెబుతున్నాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్లో మీరు విద్యాజ్యోతుల పథకం పెట్టింది ఇలా మోసం చేయడానికేనా అని ఖర్గేను ఆర్ఎస్పీ నిలదీశారు.

# అత్యాచార కేసులో ప్రజ్వల్ రేవణ్ణ దోషే

- కోర్టులో ఏడ్చేసిన మాజీ ఎంపీ

**బెంగళూరు, ఆగస్టు 1:** అత్యాచారం కేసులో జేడీఎస్ అధినేత దేవెగౌడ మనవడు, కర్ణాటక మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ దోషిగా తేలాడు. బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం ఈ తీర్పును వెలువరించింది. దీనిపై రేపు శిక్ష ఖరారు చేయనుంది. ఈ తీర్పు వినగానే ప్రజ్వల్ కోర్టు గదిలోనే కంటతడి పెట్టుకున్నాడు. ప్రజ్వల్ అత్యాచారానికి పాల్పడ్డాడని, ఆ దారుణాన్ని రికార్డు చేసి బెదిరించేవాడంటూ ఓ మహిళ సైబర్ క్రైమ్ స్టేషన్లో గతేడాది ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రత్యేక బృందం దర్యాప్తు చేసి 2వేల పేజీల ఛార్జిషీట్ దాఖలు చేసింది. విచారణలో భాగంగా 123 ఆధారాలను సేకరించింది. దీనిపై ప్రత్యేక న్యాయస్థానంలో డిసెంబర్ 31, 2024న విచారణ ప్రారంభమైంది. ఫోరెన్సిక్ ఆధారాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. కేసు నేపథ్యమిదీ.. గతేడాది లోక్సభ ఎన్నికల వేళ హాసన సెక్స్ కుంభకోణం కర్ణాటకలో ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఓ మహిళ షాకింగ్ విషయాలు వెల్లడించింది. తన తల్లిపై కొన్నేళ్ల క్రితం బెంగళూరులోని నివాసంలో ప్రజ్వల్ రేవణ్ణ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించింది. దీనికి సంబంధించి సిట్ అధికారుల ఎదుట వాంగ్మూలాన్ని ఇచ్చింది. అంతే కాకుండా ప్రజ్వల్ వీడియో కాల్లో బెదిరించి తన దుస్తులు విప్పించినట్లు తెలిపింది. ''ఆయన మా అమ్మ ఫోన్కు కాల్ చేసి.. వీడియో కాల్లో మాట్లాడాలని నన్ను బలవంతం చేసేవాడు. నా దుస్తులు విప్పాలని అడిగేవాడు. నేను అందుకు నిరాకరిస్తే.. నాకు, మా అమ్మకు హాని తలపెడతానని బెదిరించేవాడు'' అని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తాము ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగానే.. తన తండ్రిని ఉద్యోగం నుంచి తొలగించారని పేర్కొంది. తన నివాసంలో పనిచేసే మహిళలను ప్రజ్వల్ వేధింపులకు గురిచేశాడని తెలిపింది. ప్రజ్వల్ బాధితుల్లో ఎంతో మంది మహిళలు ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

# అబద్ధపు హామీలు.. చట్టాల ఉల్లంఘన

- అంతరించి పోయాయ్ అనుకున్న రాబందులు.. మళ్లీ కాంగ్రెస్ నేతల రూపంలో ప్రజలను పీక్కుతింటున్నయ్ప
- కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేటీఆర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, నయవంచన, నిజం... ఫార్మా సిటీ భూముల వ్యవహారంతో మరోసారి తెలిసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అధికారంలోకి వస్తే ఫార్మా సిటీని రద్దుచేసి భూములను తిరిగి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇతర అవసరాలకు వాటిని మళ్లించడం అత్యంత నీచమైన చర్య అని మండిపడ్డారు. అధికారం ఉందన్న అహంకారంతో ప్రజల అనుమతి లేకుండా భూముల సర్వే జరపాలనుకోవడం ఫాసిస్టు చర్య అన్నారు. మా భూములు మాగ్గావాలె అని మర్లవడ్డ రైతులపై అక్రమ కేసులు పెడుతున్న రేవంత్ రాక్షసత్వాన్ని అడ్డుకుంటామన్నారు. ఫార్మా రైతులను నిలువునా ముంచి అనుముల అన్నదమ్ముల కోసమే ఫ్యూచర్ సిటీని రేవంత్ రెడ్డి నిర్మిస్తున్నాడని కేటీఆర్ విమర్శించారు. అడుగడుగునా అన్నదాతలు మర్లవడుతున్నా, ఏకంగా ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బుద్ధి రావడం లేదన్నారు. చట్టప్రకారం భూములను తిరిగి పొందే హక్కు ఉన్న రైతులతో ప్రభుత్వం ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. ఓవైపు ఫార్మా సిటీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించి, మరోవైపు కొనసాగిస్తామని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన రేవంత్ ప్రభుత్వం, అటు ప్రజలను, ఇటు న్యాయస్థానాలను మోసం చేసిందన్నారు. ఫార్మా సిటీ రద్దైతే తమ భూములు తిరిగి వస్తాయని ఆశపడ్డ రైతుల నోట్లో మట్టికొడుతున్న రేవంత్ రెడ్డికి కర్రుగాల్చి వాతపెట్టేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ హెచ్చరించారు.

లగచర్ల గిరిజన రైతుల భూములు, కంచె గచ్చిబౌలి అటవీ భూములు, అనుముల బ్రదర్స్ కోసం ఇప్పుడు ఫార్మాసిటీ అన్నదాతల భూములను చెరబట్టే పన్నాగాల దాకా.. రేవంత్ పాపాల పుట్ట రోజురోజుకూ పెరిగిపోతూనే ఉందని కేటీఆర్ అన్నారు. అబద్ధపు హామీలి ఇవ్వడం, యథేచ్ఛగా చట్టాలను ఉల్లంఘించడం, ప్రశ్నించిన వారిని వేధించడం, సిగ్గులేకుండా భూ కబ్జాలు చేయడమే మూల స్తంభాలుగా రేవంత్ ప్రభుత్వ పాలన నడుస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. అంతరించి పోయాయని అనుకున్న రాబందులు కాంగ్రెస్ నేతల రూపంలో తెలంగాణ ప్రజలను పీక్కుతింటున్నాయని కేటీఆర్ నిప్పులు చెరిగారు. దోస్తులకు దోచిపెట్టేందుకు చీకటి ఒప్పందాలతో తెరపైకి తెచ్చిన ఫ్యూచర్ సిటీకి అక్రమంగా భూములు కేటాయిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# కాంగ్రెస్ జనహిత పాదయాత్ర





**సంగారెడ్డి**

**2వ రోజు**

రాష్ట్రంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత పాదయాత్ర ఉల్లాసంగా...ఉత్సాహంగా సాగుతోంది. షెడ్యూల్ ప్రకారం గురువారం పరిగిలో ప్రారంభమైన పాదయాత్రలో మీనాక్షి నటరాజన్ వెంట పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రి శ్రీధర్‌బాబు ముందుకు సాగారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ఉపన్యాసాలతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ సాధించిన ఘన విజయమని ఆ క్రెడిట్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని పేర్కొంటూ మరోవైపు, బీసీల రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ఆర్డినెన్స్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటున్నదని ఆరోపిస్తూ ప్రజలను బీజేపీని విలన్‌గా చూపించే ప్రయత్నం చేస్తుండటం పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులను ఉత్సాహ పరుస్తోంది.

## అభివృద్ధే లక్ష్యంగా జనహిత

- బీసీల సంక్షేమానికే.. 42 శాతం రిజర్వేషన్
- అబద్ధాల కేసీఆర్ ఫామ్ హౌస్‌కు అంకితమయ్యారు
- పాదయాత్రలో రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్
- పాదయాత్రతో పార్టీకి బలం: మంత్రి దామోదర
- విజయవంతంగా కొనసాగుతున్న జనహిత పాదయాత్ర





**సంగారెడ్డి ప్రతినిధి/ జోగిపేట: ఆగస్టు 1(మనం న్యూస్) :** దేశంలో తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా రాహుల్ గాంధీ మాట్లాడతారని రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సంగుపేట గ్రామ శివారులో శుక్రవారం పతాకావిష్కరణ చేశారు. జనహిత పాదయాత్ర రెండో రోజులో భాగంగా జోగిపేట వరకు కొనసాగిన పాదయాత్ర అనంతరం, జరిగిన బహిరంగ సమావేశంలో మీనాక్షి మాట్లాడారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దేశంలో పలువురి ఓట్లు తొలగిస్తున్నారని, సమాజంలో వెనుకబడి ఉన్నది మన తెలంగాణ రాష్ట్రమేనని, తెలంగాణ అభివృద్ధిని కాంక్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ లక్ష్యం పేదల అభివృద్ధేనని అన్నారు. అందోల్ నియోజకవర్గం అభివృద్ధి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రోద్బలంతో ఎన్నో సంక్షేమ పథకాల అమలుతో అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు రాహుల్ గాంధీ మార్గదర్శలతో ముందుకు అడుగు వేస్తున్నారని అన్నారు. రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్యశాలలో అభివృద్ధి చెందకపోగా, అప్పటి మంత్రులు ప్రైవేటు వైద్యశాలలకు ప్రాధాన్యత ఇచ్చి తెలంగాణను నీట ముంచారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనలో కేసీఆర్ పాపం వల్ల ప్రభుత్వం 6,500 కోట్ల వడ్డీ చెల్లిస్తుందని, అబద్ధాల కేసీఆర్ ఫామ్ హౌస్‌కు అంకితమయ్యారని అన్నారు. బీసీల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ ప్రకటిస్తే, ఎమ్మెల్సీ కవిత తానే తెచ్చానని ప్రజల వద్ద తప్పుడు ప్రచారం చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ప్రధాని మోడీ 2014లో కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి ప్రజలను మోసగించారని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని అన్నారు. రూ.178 వేల కోట్లతో విదేశాల పెట్టుబడులు వచ్చాయని, ఈ నేపథ్యంలో లక్షల ఉద్యోగాలు నిరుద్యోగులకు వస్తున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం కుల మతాలతో ముందుకు వెళ్లకుండా సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీ సోనియా గాంధీ అది నియోజకవర్గాల ఎంపిక వల్ల ఎంతో అభివృద్ధి జరిగిందని అందోల్ అడ్డా దామోదర్ రాజనర్సింహ గడ్డగా మారిందని అన్నారు. మహిళ నాయకత్వం కొరకు త్రిష ముందుకు వస్తుందని, ప్రియాంక గాంధీ మీనాక్షి నటరాజన్ వారి అడుగుజాడల్లో నడుస్తుందని అన్నారు.

కాంగ్రెస్‌కి బలం చేకూరుతుంది: మంత్రి దామోదర

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, అందులో నియోజకవర్గంలో తొలి ఆంధ్ర మా సభ జోగిపేటలో జరిగిందని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రాహుల్ గాంధీ పాదయాత్ర వల్ల అందోల్ నియోజక వర్గం ఎంతో అభివృద్ధి జరిగిందని ఇప్పుడు ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర వల్ల గెలిచిన ఓడిన కాంగ్రెస్‌కి బలం నియోజవర్గంలో ఏర్పడుతుందని అన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం 312 కోట్ల రుణమాఫీ చేసిందని 36 కోట్లు గురజాతి పత్రం కింద కేటాయించిందని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు కనీసం వడ్డీలు కూడా చెల్లించలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 11 కోట్ల వడ్డీలేని రుణాలు నియోజకవర్గంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. 2013లో సింగూర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిందని, ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు పంటలు పండించుకోవడానికి నీటి కాలువలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందోల్ నియోజకవర్గంలో శివంపేట గ్రామ ప్రాంతంలో పాలిటెక్నిక్ కళాశాల, సుల్తాన్పూర్ గ్రామం వద్ద జేఎన్టీయూ కళాశాల కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంగారెడ్డి సమీపంలో ఐఐటీ ఏర్పాటు చేయడం జరిగిందని, అందువల్లే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, రాహుల్ గాంధీ మద్దతుతోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి వివేక్ వెంకట స్వామి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షట్కర్, శాసన సభ్యులు సంజీవరెడ్డి, ఇన్‌చార్జి మంత్రి వివేక్, జిల్లాలోని పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### జన సంద్రమైన అందోల్

మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపుతో జిల్లా ప్రజలు వేలాదిగా తరలివచ్చి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పెద్ద ఎత్తున బలం చేకూర్చారు. సంగుపేట చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. సంగుపేట చౌరస్తా నుంచి జోగిపేట పార్టీ కార్యాలయం వరకు జనహిత పాదయాత్ర జయ జయ ధ్వానాల మధ్య హోరెత్తించింది. పాదయాత్రలో యువకులు, మహిళా కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఉత్సహంగా పాల్గొన్నారు. జోగిపేట చౌరస్తాలో జనహిత పాదయాత్రలో పాల్గొన్న వేలాది మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, వివేక్, సురేష్ షెట్కార్, డా. సంజీవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, యువ నాయకురాలు త్రిష రాజనర్సింహ ప్రసంగించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర్ రాజనర్సింహ కలిసి పరిశీలించారు. శుక్రవారం అందోల్‌లో జనహిత పాదయాత్ర విజయవంతంగా ముగిసింది.



## అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డు అందిస్తాం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**రంగారెడ్డి, ఆగస్టు 1(మనం న్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డులు అందిస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో మంజూరైన తెల్ల రేషన్ కార్డులను లింగోజిగూడ డివిజన్ యాదవ రెడ్డి గార్డెన్ లో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా మంత్రి శ్రీధర్ బాబు హాజరై ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, బుగ్గారపు దయానంద్ గుప్తా ,రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మధుయాష్కి గౌడ్, కార్పొరేటర్ లు ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, సుజాత నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో 16 వేల కుటుంబాలకు నూతనంగా తెల్ల రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పది సంవత్సరాలు పాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఆయన ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒక్కొక్కటి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం ,500 సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ,రెండు లక్షల రుణమాఫీ అమలు చేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారుల ప్రతి ఒక్కరికి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో మధు యాష్కీ కి గౌడ్ సూచనల మేరకు 200 కోట్లతో సీసీ రోడ్లు వరద కాలువ నిర్మాణ పనులు డ్రైనేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాదు నగరంలో నలుమూలల మెట్రో రైలు విస్తరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ,డిఎస్ఓ వనిజాతా రెడ్డి, సరూర్నగర్ తహసిల్దార్ వేణుగోపాల్ , ఏ ఎస్ ఓ పుల్లయ్య, హనుమాన్ దేవాలయం చైర్మన్ సత్యనారాయణరెడ్డి ,గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , శ్రీధర్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, బద్రీనాథ్ గుప్తా ,గణేష్, కిరణ్ ,శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## గులాబీ పటిష్టత కోసం అంకితభావంతో పని చేయాలి



- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి.

**చేవెళ్ల, ఆగస్టు 1(మనం న్యూస్) :** గులాబీ పటిష్టత కోసం అంకితభావంతో పని చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. చేవెళ్లకు చెందిన ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం సబితారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి పట్లొళ్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో నగరంలోని వారి నివాసంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్ పాలనలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నాడు కేసీఆర్ హయాంలో జరిగిన మంచిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం సూచనల మేరకు కష్టపడిన ప్రతి నాయకుడిని కంటికి రెప్పలా కాపాడు కుంటామన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ హరితసేన ఇన్చార్జి, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పూలపల్లి పృథ్వీరాజ్, మండల నాయకులు ఎండీ.ఆసిఫ్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎండీ. సమీర్, బ్యాగరి తేజ, ఎం.చందు, లడ్డూ, రేవంత్, విజయ్, రాహుల్, అభి, ఎం.విజయ్, శివ, ఊరెళ్ల చరణ్ తదితరులు ఉన్నారు.

## ఆదిభట్ల సీఐగా రవి కుమార్ బాధ్యతల స్వీకరణ

- మర్యాద పూర్వకంగా కలిసిన మున్సిపాలిటీ బీజేపీ నాయకులు

**తుర్క యంజాల్, ఆగస్టు 1(మనం న్యూస్) :** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ కు నూతనంగా నియమితులైన ఇన్స్పెక్టర్ రవికుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సిమోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ళ రమేష్, తర్కయంజాల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు గంట ప్రభాకర్ రెడ్డి, మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి నందగిరి సురేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





## అరవయ్యేళ్ల కుర్రాడి ఫిట్ నెస్ ఛాలెంజ్

**హైదరాబాద్, ఆగస్టు 01(మనం న్యూస్):** అద్భుతమైన వెల్ నెస్, చెక్కు చెదరని ఫిట్ నెస్ కు నిలువెత్తు నిదర్శనంలాంటి లైఫ్ గురు గోనె రాజేంద్ర ప్రసాద్, తనను ఓడించగలరా అని కుర్రాళ్లను సవాల్ చేయబోతున్నారు. వెల్ నెస్, ఫిట్ నెస్ లో తనను ఓడించిన వారికి నగదు బహుమతి ప్రకటించబోతున్నారు. ఆయన ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ధ్యానం, అంటే మెడిటేషన్ ద్వారా సంకల్ప బలాన్ని పెంచుకోవడమే తన విజయ రహస్యం



అని ఆయన చెప్పున్నారు. 61 ఏళ్ల వయసులోనూ, 10 ఫ్లోర్లు కూడా అలవోకగా మెట్లు ఎక్కే ఫిట్ నెస్ కు, బీపీ షుగర్ వంటి సమస్యలేమీ లేని అద్భుతమైన ఆరోగ్యానికి అదే కారణమని వివరించారు. తాను సూచించిన విధంగా సాధన చేస్తే ఎవరైనా అద్భుతమైన వెల్ నెస్, ఫిట్ నెస్ సొంతం చేసుకోవచ్చని భరోసా ఇస్తున్నారు. తన ఛాలెంజ్ వివరాలను త్వరలోనే మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రకటిస్తానని లైఫ్ గురు ప్రకటనలో తెలిపారు.

మనం Manam Editorial సంపాదకీయం

## మైదాకు

రెండు చేతులకు పెట్టుకునేందుకు
కాసింత సిగ్గయ్యింది
ఇంట్లో అందరి అరచేతుల్లో
ఎర్రగా పూసిన మైదాకు
నా ఎడమ చేతిన పూసిన మందారమైంది...
మా ఆవిడ, పిల్లలు ఒకరికి మరొకరు తోడు
ఒకరి చేతులకి మరొకరు మైదాకు దిద్దుతా ఉంటే
ఇల్లంతా నవ్వులై రాలిన మల్లెపువ్వులు
ఊరంతా పరచుకున్న ఆషాఢపు సంబురం
ఇల్లంతా తొలిఏకాదశి పండుగై నిండింది...

నిజానికి ఇంటి పెరట్లో ఆ మొక్క
నే కళ్ళు తెరిచినప్పటి నుండీ వుంది
నాన్నమ్మ నాటిన మొక్క అమ్మ పోసిన నీరు
మా ఆవిడ పోసిన పేడ కలిపిన నీళ్ళు
ఆ మొక్క మరింత ఏపుగా ఎదిగింది
మొక్కంతా నిండైన ఆకుల ఆకుపచ్చదనం
లోపల దాగిపోయిన చిన్నని కంటకాలు...

ఆషాఢం వచ్చింది,
ఆ మొక్క చుట్టూత వాడకట్టు
అక్కచెల్లెళ్ల కోలాహలం
కంటకాల నుండి కాపాడుకుంటూ
పోటీపడుతూ అందరూ ఆకులు
తెంపుతున్న సందడి
ముచ్చట్లు వింటూ ఆ మొక్క
సహకారపు సంతోషం !

ఆషాఢం తొలిఏకాదశి వచ్చిందని
ఇల్లంతా పండుగ సంబురం
తీరైన అప్పాలు పాత్రల నిండుతుంటే
చేతికి నోటికి ఒకటే పని...

కొంచెం తెరిపిన పడ్డాక అసలైన మైదాకు
సంబురం
తెంపిన ఆకులన్నీ రోటిలో దంచిన తీరు
కాసువక్క ఇంకేవో వేసి మెత్తగ నూరిన పేరు
వేళ్ళకు ముద్దలుగా పెట్టుకుని అరచేతుల
అలంకారం దిద్దుకుని
తెల్లారి ఎర్రగా పండిన చేతుల చూసుకుని
ఇంట్లో పక్కింట్లో ఎదురింట్లో
వాడకట్టు అంతా ఒకే ముచ్చట
ఎవరి చేతులు ఎక్కువ ఎర్రగా పండినవి?

**- అశోక్ గుంటుక**
9908144099

# దేశంలో ఎరువుల సంక్షోభం - పరిష్కారాలు



వ్యవసాయ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలని భారతదేశం ప్రయత్నిస్తున్న ఈ తరుణంలో ఎరువుల కోసం, ముఖ్యంగా యూరియా, డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ) వంటి వాటి కోసం విదేశాలపై ఆధారపడటం ఒక పెద్ద సవాలుగా మారింది. దేశీయంగా ఎరువుల ఉత్పత్తిని పెంచడంలో మనం పురోగతి సాధించినప్పటికీ మన అవసరాలకు, మన ఉత్పత్తికి మధ్య ఇంకా పెద్ద అగాధం ఉంది. ఈ పరిస్థితి మన రైతులను, మన ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ మార్కెట్ల ఒడిదొడుకులకు, రాజకీయ ఉద్రిక్తతలకు గురిచేస్తోంది. దీని వెనుక ముడిసరుకుల కొరత నుండి ప్రభుత్వ విధానాల వరకు అనేక కారణాలు ఉన్నాయి. అయితే, ఈ సమస్యను అధిగమించి, స్వావలంబన సాధించడానికి మార్గాలు కూడా ఉన్నాయి.

**యూరియా: మన వ్యవసాయానికి ప్రాణం, కానీ ఎంతకాలం?**

భారతదేశంలో అత్యధికంగా ఉపయోగించే ఎరువు యూరియా. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, మన దేశంలో ఏకంగా 35.8 మిలియన్ టన్నుల యూరియా వాడకం జరిగింది. హరిత విప్లవం తర్వాత పంట దిగుబడులను పెంచడానికి నత్రజని సంబంధిత ఎరువులను ఎక్కువగా ప్రోత్సహించడం వల్ల యూరియా వాడకం పెరిగింది. అయితే, దీనివల్ల భూమిలో పోషకాల అసమతుల్యత ఏర్పడి, దీర్ఘకాలంలో నేల ఆరోగ్యం దెబ్బతిని, ఉత్పాదకత తగ్గే ప్రమాదం ఉంది.

**స్వావలంబన ఒక ఎండమావి:**

భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఎరువుల వినియోగదారు అయితే, మూడవ అతిపెద్ద ఉత్పత్తిదారు కూడా. 2024 నాటికి, మన దేశంలో 32 పెద్ద యూరియా కర్మాగారాలు, 19 డీఏపీ ఇతర సంక్లిష్ట ఎరువుల కర్మాగారాలు ఉన్నాయి. 2023-24లో మన మొత్తం ఎరువుల ఉత్పత్తి సుమారు 50.34 మిలియన్ టన్నులు. ఇంత పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, మన అవసరాలకు తగినంతగా మనం తయారు చేసుకోలేకపోతున్నాం. ముఖ్యంగా యూరియా కాకుండా ఇతర ఎరువుల విషయంలో ఈ కొరత ఎక్కువగా ఉంది. మన దేశంలో పొటాష్ నిల్వలు దాదాపుగా లేనందున, మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ) కోసం మనం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడతాము. ఇక డీఏపీ విషయానికొస్తే, దేశీయ ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ, అవసరమైన దానిలో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటున్నాము.

**దిగుమతుల భారం: విదేశీ మారకద్రవ్యం, రాజకీయ అనిశ్చితి**

ఈ దిగుమతుల కోసం మనం భారీగా విదేశీ మారకద్రవ్యాన్ని



ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది మన ఆర్థిక వ్యవస్థపై పెద్ద భారం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన ఎరువుల దిగుమతి బిల్లు చాలా ఎక్కువగా ఉంది. మనం ప్రధానంగా కొన్ని దేశాల నుండే ఎరువులను కొనుగోలు చేస్తున్నాము. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి, ఎందుకంటే ఆ దేశాల్లో ఏవైనా సమస్యలు వస్తేన్మనకు ఎరువుల సరఫరా ఆగిపోతుంది.

యూరియా కోసం ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల మీద, డీఏపీ కోసం చైనా, సౌదీ అరేబియా, మొరాకో, రష్యా పైన, ఎంఓపీ కోసం కెనడా, రష్యా, బెలారస్, జోర్డాన్, ఇజ్రాయెల్.

ఇటీవల ఉక్రెయిన్లో జరిగిన యుద్ధం వంటి అంతర్జాతీయ సంఘటనల వల్ల ఈ సరఫరా గొలుసులు ఎంత బలహీనంగా ఉన్నాయో మనకు తెలిసొచ్చింది. దీనివల్ల ధరలు విపరీతంగా పెరిగి, రైతులకు ఎరువులు దొరకడం కష్టంగా మారింది. ఈ దిగుమతుల కోసం అవసరమైన విదేశీ మారకద్రవ్యాన్ని మన దేశం చేసే ఎగుమతుల ద్వారా, విదేశీ నిల్వల ద్వారా సమకూర్చుకుంటుంది.

**దేశీయ ఉత్పత్తికి అడ్డంకులు:**

ఎరువుల రంగంలో స్వావలంబన సాధించడానికి మన ముందు అనేక అడ్డంకులు ఉన్నాయి. ప్రధానమైనది ముడిసరుకుల కొరత. డీఏపీ వంటి ఫాస్ఫేటిక్ ఎరువుల తయారీకి అవసరమైన రాక్ ఫాస్ఫేట్, ఫాస్ఫారిక్ యాసిడ్ కోసం మనం దిగుమతులపైనే ఆధారపడతాము. అలాగే, పొటాష్ ఎరువుల కోసం అవసరమైన ముడిసరుకు మన దగ్గర లేదు. వీటితో పాటు, మన దేశీయ పరిశ్రమ మరికొన్ని సమస్యలను కూడా ఎదుర్కొంటోంది:

కొత్త ఎరువుల కర్మాగారాలు పెట్టాలంటే చాలా డబ్బు అవసరం. యూరియా తయారీకి కీలకమైన సహజ వాయువు లభ్యత, దాని ధర ఎప్పుడూ ఒక పెద్ద సమస్యే. ఈ రంగంలో పెట్టుబడులు రావాలంటే, ప్రభుత్వం స్థిరమైన, స్పష్టమైన విధానాలను అనుసరించాలి.

**ప్రభుత్వ ప్రయత్నాలు -సరైన దిశగా అడుగులు**

దేశీయంగా ఎరువుల ఉత్పత్తిని పెంచి, స్వావలంబన సాధించడానికి భారత ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. 2015లో తెచ్చిన 'కొత్త యూరియా పాలసీ' దేశీయ ఉత్పత్తిని పెంచడానికి ఉద్దేశించింది. మూతపడిన ఐదు ఎరువుల కర్మాగారాలను (రామగుండం, తాల్చేర్, గోరఖ్పూర్, సింద్రీ, బరౌనీ) తిరిగి ప్రారంభించడం ద్వారా యూరియా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నం జరుగుతోంది. అంతేకాకుండా ప్రభుత్వం నానో యూరియా, నానో డీఏపీ వంటి నానో ఎరువుల ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. ఇవి తక్కువ వాడకంతో ఎక్కువ ప్రయో జనాన్ని ఇస్తాయి. రసాయనిక ఎరువులపై ఆధారప డటాన్ని తగ్గించడానికి ప్రత్యామ్నాయ ఎరువులను, సేంద్రియ వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహిస్తున్నారు.

**సుస్థిర భవిష్యత్తుకై మార్గం - శాశ్వత పరిష్కారాలు:**

భారతదేశ ఎరువుల సమస్యను పరిష్కరించాలంటే, మనం తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై కూడా దృష్టి పెట్టాలి.

**తక్షణ పరిష్కారాలు:**

కొన్ని దేశాలపైనే ఆధారపడకుండా, మరిన్ని కొత్త దేశాల నుండి ఎరువులను దిగుమతి చేసుకోవాలి.అంతర్జాతీయంగా సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా ఇబ్బంది లేకుండా, తగినంత ఎరువులను ముందుగానే నిల్వ చేసుకోవాలి. ముడిసరుకులు ఉన్న దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా నిరంతర సరఫరాను నిర్ధారించుకోవాలి.

**శాశ్వత పరిష్కారాలు:**

మన దేశంలోనే రాక్ ఫాస్ఫేట్, పొటాష్ వంటి ముడిసరుకుల నిల్వలను కనుగొనడానికి అన్వేషణను ముమ్మరం చేయాలి. తక్కువ ఖర్చుతో ఎరువులను తయారు చేసే కొత్త సాంకేతికతలపై పరిశోధనలను ప్రోత్సహించాలి. 'భూసార ఆరోగ్య కార్డు' పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి, రైతులు యూరియానే కాకుండా అన్ని రకాల పోషకాలను (నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్) సమపాళ్లలో వాడేలా చైతన్యపరచాలి. రసాయనిక ఎరువులకు బదులుగా జీవన ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి. మురుగునీరు, వ్యవసాయ వ్యర్థాల నుండి పోషకాలను తిరిగి సేకరించి, ఎరువులుగా మార్చే పద్ధతులను ప్రోత్సహించాలి. ఎరువుల రంగంలో స్వావలంబన సాధించడం కేవలం ఆర్థిక అవసరమే కాదు, మన దేశ ఆహార భద్రతకు, రైతుల సంక్షేమానికి అత్యంత వ్యూహాత్మకమైన అవసరం. సవాళ్లు పెద్దవే అయినప్పటికీ, ప్రభుత్వం, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు కలిసికట్టుగా కృషి చేస్తే, సుస్థిరమైన, స్వావలంబన కలిగిన వ్యవసాయ భవిష్యత్తును మనం తప్పక నిర్మించుకోగలం.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

# చాప కింద నీరులా కృత్రిమ మేధ



ఒకప్పుడు టెకీల గురించి,వారి సంపాదన గురించి చాలా గొప్పగా చెప్పుకునే వాళ్ళం. టెక్ నగరాలంటే ఎంతో మక్కువ ప్రదర్శించే రోజులవి. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో, కుటుంబ బాధ్యతలను నెట్టుకురావడం కష్టసాధ్యమైన సందర్భంలో యువత కొంతమంది మధ్యవర్తుల సాయంతో అమెరికా పయనమై, కొంతకాలం పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేసి, తర్వాత సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా పనిచేసి ఎంతో కష్టపడి ఆర్థికంగా నిలదొక్కుకుని, తల్లి దండ్రులకు డబ్బు పంపిస్తూ, వారు ఆర్థికంగా పరిపుష్టి కావడానికి దోహదం చేసేవారు. అప్పట్లో సాఫ్ట్ వేర్ రంగం స్వర్ణ యుగాన్ని చవి చూసింది. బెంగుళూరు,హైదరాబాద్, చెన్నై,పూనే వంటి నగరాల్లో టెక్ కంపెనీలు దేదీప్యమానంగా ప్రకాశించాయి. అయితే ఇదంతా ఒక గతం. ప్రస్తుత పరిస్థితులు మారిపోయాయి. సాఫ్ట్ వేర్ రంగం సంక్షోభాన్ని చవిచూస్తున్నది. ఒకప్పుడు వందలాది మంది సాఫ్ట్ రంగం వైపు పరుగెడితే, నేడు భారత్ లో కూడా లక్షలాది మంది సాఫ్ట్ వేర్ రంగం పట్ల మక్కువ చూపుతున్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను నిర్లక్ష్యం చేస్తున్నాం. కంప్యూటర్ల వైపు యువత ఇంకా పరుగులు తీస్తున్నది. సాంకేతిక రంగంలో అనేక మార్పులు సంభవించాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ 'ఏఐ' చాప క్రింద నీరులా చొచ్చుకు వచ్చింది. కృత్రిమ మేధను అందిపుచ్చుకుని, అందులో ప్రావీణ్యత సంపాదించ గలిగితేనే సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు నిలబడ తాయి. ఇప్పటికే అనేక టెక్ దిగ్గజ కంపెనీలు కృత్రిమ మేధను ప్రవేశపెట్టాయి. మరి కొద్ది సంవత్సరాల్లో కృత్రిమ మేధ సాంకేతిక రంగాన్ని శాసించబోతున్నది. ఇప్పటికే ఏఐ సాఫ్ట్ వేర్ రంగం పై తన ప్రభావాన్ని,ప్రతాపాన్ని చూపించడం మొదలు పెట్టింది.అమెరికాలోని టెక్ కంపెనీలు భారతీయులను ఉద్యోగాల్లో తీసుకోవద్దని ఇప్పటికే ట్రంప్ హుకుం జారీ చేయడం జరిగింది. ఇదే సందర్భంలో ఏఐ వలన ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారింది.గూగుల్,మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, అమెజాన్ వంటి సంస్థలు వేలాది మందిని ఉద్యోగాల నుండి తొలగిస్తున్నట్టు వార్తా కథనాలు వెలువడుతున్నాయి. అయినప్పటికీ యువతలో ఇంకా సాఫ్ట్ వేర్ పట్ల మక్కువ పోకపోవడం వాస్తవాన్ని గ్రహించక చేస్తున్న తీవ్రమైన తప్పిదం. నకిలీ సర్టిఫికెట్లతో,ఫేక్ ఎక్స్ పీరియన్స్ తో సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు సంపాదించడం ఇక సాధ్యపడదు. రోబో శకం ప్రారంభమైనది. మానవ శక్తి స్థానంలో యాంత్రిక శక్తి అత్యంత ఖచ్చితత్వంతో,వేగవంతంగా పనులు చేస్తూ సత్ఫలితాలు సాధించే పరిస్థితులు ఏర్పడ్డాయి. పది మంది చేసే పనిని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సహాయంతో కేవలం ఒక్కరితో సుసాధ్యం చేసే విప్లవాత్మక మార్పులు చోటు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఉన్నతమైన, నాణ్యమైన విద్యా ప్రమాణాలతో, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి. వివిధ రంగాల్లో నెలకొన్న సంక్లిష్ట సాంకేతిక సమస్యలను పరిష్కరించడం, అధిక ఖర్చులకు కళ్లెం వేయడం, సమయాన్ని ఆదా చేయడం, ఉత్పాదకత పెంచడం, అలసట ఎరుగని రోబోలతో 24 గంటలు పని చేయించడం కృత్రిమ




మేధ వలన సుసాధ్యం కాగలదు.కృత్రిమ మేధ వేగవంతమైన ప్రపంచంలో ఉత్తమమైన సేవలను అందిస్తుంది. ఏఐ ప్రపంచం లోకి ఇప్పటికే అడుగులు పడ్డాయి. ఇక అఐ వలన ఒనగూరే లాభ నష్టాలను గూర్చి విశ్లేషిద్దాం.ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఆటోమేషన్ ప్రక్రియల వలన సాంకేతికత కు సంబంధించి సత్వర నిర్ణయాలు తీసుకోవడం సాధ్యపడుతుంది. కమ్యునికేషన్,రవాణా,వైద్య తదితర రంగాల్లో గణనీయమైన మార్పులు సంభవించి ఆర్థిక ఎదుగుదల,నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడతాయి. సాంకేతికత సామర్థ్యంతో వ్యాపారం మెరుగు పడుతుంది, రోగులను ఖచ్చితమైన ప్రమాణాలతో డయాగ్నోసిస్ చేయడం,సత్వర చికిత్సలు, శస్త్రచికిత్సలు చేయడం, ఇంటి వద్ద నుండే వైద్య పరీక్షలు చేసి మానిటరింగ్ చేయడం జరుగుతుంది. కృత్రిమ మేధ ప్రభావంతో రాగల రోజుల్లో ప్రతిభావం తులైన యువత ఉపాధికి ఏ విధమైన నష్టం జరగదనే అభిప్రాయ ముంది. కృత్రిమ మేధ వలన ఉద్యోగావకాశాలు తగ్గి, రోబోల ఆధిపత్యం మొదలయ్యే అవకాశం ఉంది. మానవ భద్రతకు, వివిధ దేశాల రక్షణ వ్యవహారాలకు కృత్రిమ మేధ వలన ఒక విధంగా లాభం,మరొక విధంగా నష్టం జరిగే అవకాశ ముందనే వార్తల్లో నిజమెంతో తెలియాలి. భవిష్యత్తులో మనం ఉపయోగిస్తున్న కార్లు, ద్విచక్ర వాహనాలు,ఇతర రవాణా వ్యవస్థలు ఏ.ఐ సహకారంతో నడిచే అవకాశాల వలన భారీ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారముంది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, ఆటోమేషన్ ప్రక్రియలు మానవ నిర్మిత అత్యంత ఆధునిక సాంకేతిక వ్యవస్థలు. ఏ.ఐ తో రాగల ముప్పును క్షణాల్లో నిలువరించ గల సామర్థ్యం లేక పోతే భారీ నష్టం వాటిల్లే ప్రమాదముంది. ప్రపంచ వ్యాప్తంగా మొబైల్స్ మరియు కంప్యూటర్ల లోకి వైరస్లు ప్రవేశించి, డేటాను విచ్ఛిన్నం చేయడం,వివిధ వ్యవస్థలు స్తంభించి పోవడం చూస్తున్నాం. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధతో నడిచే కంప్యూటర్ల వలన, యంత్రాల వలన భారీ విపత్కర పరిణామాలు సంభవించగలవని ఆందోళన నెలకొని ఉంది. మనిషి మాయమై మరబొమ్మలే ప్రాణం పోసుకుని, మనిషి జీవితాన్ని చక్రబంధంలో ఇరికించే ముప్పు పొంచి ఉంది. కీలక వ్యవస్థలు కృత్రిమ మేధతో పని చేస్తే, కంప్యూటర్ ప్రోగామింగ్ లో లోపాలున్నా, సాంకేతిక సమస్యలు తలెత్తినా సంభవించే పరిణామాలు ఊహాతీతం. రాబోయే దశాబ్ద కాలంలో కృత్రిమ మేధ వలన ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగాలు కోల్పోయే అవకాశముందనే నిపుణుల వాదనలో నిజం లేక పోలేదు.కృత్రిమమేధ ప్రవేశంతో టెక్నాలజీ రూపు రేఖలు పూర్తిగా మారిపోయే అవకాశముంది. ప్రపంచ మానవ జీవన క్రమంలో అనేక విప్లవాత్మక మార్పులు సంభవించే అవకాశాలున్నాయి. కాబట్టి కృత్రిమ మేధ వలన తలెత్తే పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. కృత్రిమ మేధ మానవ జీవితాలను మరింత సౌకర్యవంతంగా మార్చాలి. ఉద్యోగ అవకాశాలను పోగొట్టకుండా, పెరుగుతున్న విద్యావంతుల ఉపాధికి నష్టం లేకుండా చూడాలి. ఎంతవరకు కృత్రిమ మేధ అవసరముందో, అంతవరకే వినియోగించాలి. ఏఐ ప్రవేశం కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా మారకూడదు. మానవ శక్తికి వీలు కుదరని చోట్ల, ప్రమాదకరమైన పనుల్లోను, ఇతర సంక్లిష్టమైన కార్యకలాపాల్లోను కృత్రిమ మేధను వినియోగించి, అభివృద్ధిని సాధించవచ్చు. ఈ దిశగా కంప్యూటర్ రంగంలోని నిష్ణాతులు, ఏ. ఐ నిపుణులు తమ ఆలోచనా పరిధిని విస్తృతం చేయాలి.

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

# విద్యకు ప్రాణం ఉపాధ్యాయులే!



ఆధునిక యుగంలో ఎటు చూసినా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఆరోగ్య సంరక్షణ నుంచి రవాణా రంగం వరకు-ప్రతి విభాగంలోనూ ఈ సాంకేతిక పరిజ్ఞానం అంతర్లీన మార్పులను తెస్తోంది. విద్యావ్యవస్థ కూడా ఈ ప్రభావానికి అతీతం కాదు. వ్యక్తిగత అవసరాలకు తగిన అభ్యాసం అందిం చగల ట్యూటర్ల రూపంలో, విద్యార్థుల నేర్చుకునే శైలులకు అనుగుణంగా మద్దతునిచ్చే లెర్నింగ్ యాప్స్ రూపంలో-AI అనేక మార్గాల్లో విద్యా రంగానికి తోడ్పాటు అందిస్తోంది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు పిల్లలకు ఉపాధ్యాయుల అవసరం ఏ ముంది? అనే ప్రశ్న కొంతమందిలో కలగటం సహ జమే. కానీ ఇది ఒక అపోహ మాత్రమే. వాస్తవానికి, సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ, ఉపాధ్యా యుల పాత్ర మరింత కీలకంగా మారుతోంది. విద్య అనేది కేవలం సమాచారం అందించే ప్రక్రియ మా త్రమే కాదు- అది హృద యాన్ని తాకే అనుభవం, మనిషిలో మార్పు తీసు కొచ్చే శక్తి. ఇది విలువలు నేర్పుతుంది, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది, జీవన దిశను నిర్దేశిస్తుంది. ఇలాంటి మార్పు మాత్రం యంత్రాలతో సాధ్యం కాదు.దీనికి అవసరం-మానవీయ అనుబంధం కలిగిన, స్పర్శను మించిన సానుభూతి గల బోధకుని పాత్ర.

అఐ విద్యార్థి చదువును గమనించగలదు. కానీ అతని మానసిక స్థితిని అర్థం చేసుకునే సామర్థ్యం దానికి లేదు. మౌనంగా కూర్చున్నవారి హృదయంలోని బాధను గుర్తించలేకపోతుంది. కళ్లలోకనిపించే సందిగ్ధతను పరిశీలించి, భరోసా కలి గించే సున్నితమైన స్పర్శను అందించలేక పోతుంది.

గణిత సూత్రాలు చెప్పడం, వ్యాకరణ దోషాలను సూచించడం వంటి పనులు యంత్రాలకు సాధ్యమే. కానీ విద్యార్థిలో ఆత్మవిశ్వాసాన్ని కల్పించడం, జీవనపట్ల ఆసక్తి పెంచడం, మానవీయ విలువలతో కూడిన వ్యక్తిత్వంగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల పాత్రదే. ఎన్నో సందర్భాల్లో ఒక ఉపాధ్యాయుడి వల్ల నా జీవితం మారింది' అనే మాటలు మనం వింటుంటాం. కానీ 'ఒక యంత్రం నన్ను నిజమైన మనిషిగా తీర్చిదిద్దింది' అనే మాటలు మాత్రం ఎవరూ అనరు, అనలేరు.

పిల్లలు కేవలం సంఖ్యలు కాదు - వారు భావోద్వేగాలతో స్పందించే జీవులు. వారికి ప్రేమ, మార్గదర్శనం, అంగీకారం, కొన్నిసార్లు మందలింపూ అవసరం. ఇవన్నీ ఉపాధ్యాయుని నుంచి మాత్రమే లభిస్తాయి. ఈ డిజిటల్ యుగంలో, ఎక్కువ సమయం తెరల ముందే గడిపే పిల్లలకు మానవీయ స్పర్శ మరింత అవసరం. ఉదాత్త భావనలు, ఆత్మవిశ్వాసం, విలువల పట్ల ఆసక్తి వంటి లక్షణాలను ఉపాధ్యాయులే మెరుగు పరచగలరు. ఇది యంత్రాలకు సాధ్యపడదు.

అఐ ఉపకరణాలను ఉపయోగించడంలో తప్పే లేదు. నిజానికి, అవి ఉపాధ్యాయుల పని భారాన్ని తగ్గిస్తూ, విద్యార్థులతో అర్థవంతమైన పరస్పర చర్యలకు మరింత సమయాన్ని కేటాయించే అవకాశాన్ని కల్పిస్తాయి. అయితే, వాటిపై ఆధారపడటం మానవీయతను నెమ్మదిగా హరించగలదు. అదే ప్రమాదకరం. అఐ అనేది కేవలం ఒక సాధనం - విద్యను మరింత సులభంగా, సమర్థంగా అందించేందుకు ఉపయోగపడే ఉపకరణం మాత్రమే. కానీ విద్యకు ప్రాణం పోసేది ఉపాధ్యాయులే. వారు ఆశను నింప గలరు, ఆత్మవిశ్వాసాన్ని కలిగించగలరు, అవసర మైన దిశ చూపగలరు. కష్టకాలంలో అంధకారాన్ని తొలగించే దీపస్తంభంలా మారగలరు.

కాబట్టి, సాంకేతికతను ఉపయోగించడంలో తప్పు లేదు. కానీ ఉపాధ్యాయుల పాత్రను తగ్గించడం కాదు - వారిని మరింత గౌరవించడం మన బాధ్యత. ఎందుకంటే, భావోద్వేగాలు అర్థం చేసుకుని, మానవత్వాన్ని ముందుకు నడిపించగల శక్తి యంత్రాలకు కాదు - ఉపాధ్యాయులకే ఉంది.

ఈ మారుతున్న ప్రపంచంలో, ఉపాధ్యాయుని పాత్రను తగ్గించటం కాదు - మరింతగా గౌరవించటం అవసరం.

**- డా. కృష్ణ కుమార్ వేపకొమ్మ**

# ఆత్మహత్యల రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మనిషి 'జీవితంలో 'అనుకున్న లక్ష్యాన్ని చేరుకోక పోవడం వల్ల తీవ్రఒత్తిడికి లోనై' ఆత్మహత్యలకు' పాల్పడటం ప్రపంచ మానవాళికి జటిల సామాజిక ప్రజారోగ్య సమస్యగా పరిణమించింది . 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సగటున 7లక్షల మంది 'ఆత్మహత్యలు' చేసుకుంటున్నారు. ఇందులో 15 నుండి 29 ఏళ్ల మధ్య వయసు వారు ఉన్నట్లు తేలింది. వారి మరణాలకు రోడ్డు ప్రమాదాల తర్వాత రెండో ప్రధాన కారణం ఆత్మహత్యలే అని అనేక అధ్యయనాల్లో తేలింది. చనిపోయే ముందు ఒక క్షణం వాళ్ళ కుటుంబ సభ్యుల గురించి ఆలోచిస్తే పరిస్థితి మరో రకంగా వుండేది అని అంచనాలు తెలుపుతున్నాయి. ఆత్మహత్యల వల్లపెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలు తీవ్ర ఆర్థిక సామాజిక సమస్యలతో కూరుకు పోయి ఆర్థికంగా కునారిల్లుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. చిన్న కారణాలకే తమ ఉసురు తీసుకుంటున్నారు. 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా యేటా 7 లక్షల మంది కి పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇందులో 77 శాతం కేసులు తక్కువ మధ్యఆదాయ దేశాలలో నమోదు అవుతున్నాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం.వ్యవసాయ రంగములో సంభవిస్తున్న అతివృష్టి అనావృష్టి పంటలకు పురుగు తగలడం ముఖ్యంగా పత్తి రైతులు ఆశించిన దిగుబడి రాక పంట నష్టము భరించలేక తాము పండించిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధరలు లభించక పోవడం వల్ల పురుగు మందులు తాగి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇలాంటి ఆత్మహత్యలు నియంత్రించవచ్చని 'డబ్ల్యూటీవో' చెబుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏట సెప్టెంబర్ 10 తేదీన ఆత్మహత్యలనివారణ మీద అవగాహన చైతన్య సదస్సులు సమావేశాలు నిర్వహించి ఆత్మహత్య రహిత సమాజ స్థాపనకు ప్రపంచ వ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థలు సామాజిక సంస్థలు పౌరసమాజం వైద్యులు ఆరోగ్య శాఖ సమిష్టిగా ఆత్మహత్యాల నివారణకు పలు అవగాహన చైతన్య సదస్సులు నిర్వహిస్తుంది.

యువతలో పేరుకుపోయిన నిరాశనిస్పృహలు, నిరుద్యోగం, ఒత్తిడి వల్ల మానసిక ఆరోగ్యం క్షీణించి అనారోగ్య సమస్యలను తట్టుకోలేక, ఆత్మహత్యలకు పాల్పడే శాతం ఎక్కువైంది.

రైతులు, చేనేత కార్మికులు, నిరుద్యోగులు,పరిశ్రమలు మూతపడడం వల్ల ఉపాధి కోల్పోయిన కార్మికులు, పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఆత్మహత్యలు చేసుకునేవాల్లలో యువకులే ఎక్కువ శాతం ఉంటున్నారు 15 నుండి 29 సంవత్సరాల వయసుగల వారు ఎక్కువ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీనికి కారణం ప్రేమవిఫలం కావడం. పెద్దలు మందలించారని, ఈ పని చేస్తుంటే మరికొందరు పని భారం పెరిగిందని, ఉద్యోగం రాలేదని, పరీక్షల్లో ఫేలయ్యామని పరువు పోయిందని ఇలా రకరకాల కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. 'డిప్రెషన్ మెంటల్' బ్యాలెన్స్ కోల్పోవడం, ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు పిల్లలశక్తి సామర్థ్యాలు గుర్తించకుండా వారిని తీవ్ర ఒత్తిడికి గురి చేయడం, టీవీ సోషల్ మీడియా ప్రభావం సమస్య వచ్చినప్పుడు ఎదుర్కోలేని బలహీన మనస్తత్వం, అత్తింటి వేధింపులు గృహహింస, వరకట్నం, ఒత్తిడులు, చదువుల భారం, ర్యాంకుల కోసంఒత్తిడి, అనుమానాలు, ఈర్ష్యాద్వేషాలు, అహం,అవమానాలు, బంధుత్వంలో వస్తున్న విభేదాలు. అప్పుల బాధలు సమాజములో సూటి పోటి మాటలు వెకిలి చేష్టలు భరించలేకపోవడం. ఆత్మీయులు దూరం కావడం. వారిని కోల్పోవడం ఇలాంటి పరిస్థితులు పలువురిని ఆత్మహత్యలకు పురికొలుపు తున్నాయి. అన్ని వయసుల వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.ప్రపంచ వ్యాప్తంగాపురుషులలోనే ఆత్మహత్యలు రేటు ఎక్కువుంది

**జీవితం పై' ఆశ'పునరుద్ధరణ**

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆత్మహత్యలు నివారించడానికి అంతర్జాతీయ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రివెన్షన్ సంస్థ వరల్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ తో కలిసి పనిచేస్తుంది. కోవిడ్ మహమ్మారి కారణంగాఏర్పడిన ఆర్థిక సామాజిక పరిస్థితులు మానసిక అనారోగ్యం ఒత్తిడి మానవాళినిపీడిస్తోంది. మానసిక అనారోగ్యం వల్ల కలిగే ఇబ్బందులను అధిగమించడానికి కనెక్ట్ కమ్యూనికేట్ మరియు సంరక్షణద్వారా జీవితము పై ఆశను పునరుద్ధరించడం అనే ఆశయంతో పనిచేస్తుంది.గత రెండు సంవత్సరాలుగా WHOతో కలిసి, ఆత్మహత్యలను నివారించడానికి కలిసి పనిచేడం, కోవిడ్' కారణంగా పెరుగుతున్న ఆత్మహత్యల నివారణ ఆవశ్యకతపెరిగింది. ప్రభుత్వం 'అందరికీ ఆరోగ్యం' కార్యాచరణతో ఆత్మహత్య లను నివారణకు ఉద్యమించి ఆత్మహత్యల రహిత సమాజ స్థాపనకు పునరంకితం కావాలి

**- నేదునూరి కనకయ్య**
944024577

# "ఎటు చూసినా మురుగు" మనం కథనానికి స్పందన



## ఎటు చూసినా మురుగు

- ఎస్సీ కాలనీలో పడకేసిన పారిశుధ్యం

**ఎలిగేడు, జూలై 23 (మనం న్యూస్):** ఎలిగేడు మండలం దూళికట్ట గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎక్కడ చూసినా రోడ్లపై మురుగు నీరు పేరుకుపోతుంది డ్రైనేజీ లేకపోవడంతో ఇళ్లల్లో నుంచి వెలువడుతున్న వ్యర్థాలు జలాలు వర్షపు నీరు ఇళ్ల మధ్యలో నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. వర్షకాలం కావడంతో మురుకు నీరు వర్షపు నీరు చేరిన గుంతల్లో దోమలు, ఈగలు, పందులు సర్వ విహారం చేస్తున్నాయి. ఇలాగే కొనసాగితే దోమల వ్యాపించి జ్వరాల బారిన పడే ప్రమాదం ఉన్నందున. ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీలో కాలి స్థలాల లో దోమలు నిలయాలుగా మారడంతో విష జ్వరాలు ప్రభలుతున్నాయి. ఈ పరిస్థితి ఏర్పడింది. నిలిచిన నీరు ఇండ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు నిలిచిన నీరును తరలించేందుకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మనం https://www.manamepaper.com/clip/107348 Karimnagar (24-7-2025)



**ఎలిగేడు ఆగస్టు 01,(మనం న్యూస్):** ''ఎటు చూసినా మురుగు''మనం వార్తాపత్రికలో వచ్చిన కథనానికి స్పందన వచ్చింది.పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం దూలికట్ట గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇండ్ల నుంచి వస్తున్న వ్యర్ధాలు,వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో మురుగు నీరు ఏర్పడి దోమలకు,ఈగలకు,పందులకు నిలియాలుగా మారాయి.దీనిపై మనం దిన పత్రికలో జూలై 23న ప్రచురితమైంది.ఈ వార్తకు స్పందనగా స్థానిక అధికారులు నీరు నిలవకుండా చేసి పిచ్చి మొక్కలు తొలగించి బ్లీచింగ్ చేశారు. మనం వార్త కథనానికి అధికారులు స్పందించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మనం తెలుగు దిన పత్రికకు కతజ్ఞతలు తెలిపారు.

# నగర వ్యాప్తంగా పారిశుధ్య పనులపై కమీషనర్ నజర్

- ప్రజల ఆరోగ్య రక్షణ పై ప్రత్యేక దష్టి పెట్టాలని పారిశుధ్య అధికారులకు ఆదేశాలు....
- నీటి గుంటలో గంబూజియా చేపలను వదిలిన కమీషనర్ ప్రఫుల్ దేశాయ్. ...







**కరీంనగర్, ఆగస్టు 1 (మనం బ్యూరో):** ఇటీవల కురిసిన వర్షాలతో దోమలు పుట్టకుండా కుట్ట కుండా పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పారిశుధ్యంలో భాగంగా శుక్రవారం లక్ష్మీనగర్ ప్రాంతంలో అధికారులు, సిబ్బంది తో పర్యటించారు. సఫాయి అప్నా భీమారి బాగో కార్యక్రమం నేపథ్యంలో పలు కాలనీలను సందర్శించి పారిశుధ్య పనులను తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం నీటి గుంటలో అధికారులతో కలిసి గంబూజియా చేపలను వదిలారు. సీజనల్ వ్యాదులు రాకుండ పారిశుధ్య పరంగా చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాల పై అధికారులకు సలహాలు సూచనలు చేసి ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్బంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ కురిసిన వర్షాలతో నగర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో నీరు నిలిచి లార్వాలు వద్దిచెంది దోమలు పెరుగుతాయి కాబట్టి పారిశుధ్య విభాగం అధికారులు సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను డివిజన్ వారిగా చేపట్టాలన్నారు. ప్రధానంగా ఇటీవల విలీన చెందిన గ్రామాల డివిజ్లతో పాటు నగరం మొత్తం మెరుగైన పారిశుధ్యం చేయాలన్నారు. వర్షపు నీరు నిలిచిన చోట వాటిని డ్రైనేజీల్లోకి మల్లించడంతో పాటు ఆ ప్రదేశాలను పరిశుభ్ర పరచాలని అన్నారు. పెద్ద నీటి గుంటల ఉన్న ప్రదేశాల్లో గంబూజియా చేపలను వదిలి... చుట్ట పరిసరాలను పరిశుభ్రం చేసి... బ్లీచింగ్ వేయాలన్నారు. డివిజన్ వారిగా డ్రైనేజీలను, ఖాళీ స్థలాలను శుభ్రపరిచి... దోమల నివారణకు స్ప్రే, ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. డ్రైజీలను గార్బేజ్ పాయింట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కోరారు. నివాస గహాల ప్రజలకు సీజనల్ వ్యాదుల పై అవగాహన పర్చాలని... వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రపరుచుకునేలా చర్యలు తీస్కోవాలని అన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్త చెదారం లేకుండ శుభ్రపరుచుకోవడంతో పాటు కూలర్లు, కొబ్బరి చిప్పలను, డబ్బాలు, టైర్లు, పూల కుండీలలో నీరు నిలవకుండ చూస్కునేలా ప్రజలకు తెలుపాలని అన్నారు. ముఖ్యంగా నగరపాలక సంస్థ పరిదిలోని పబ్లిక్ టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచేలా పారిశుధ్య అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సైలు, జవానులు మీ డివిజన్లలో పరిసరాలను పరిశుభ్ర పరిచి... డ్రైనేజీలను క్లీన్ చేయాలని కోరారు. డెంగ్యూ, మలేరియా లాంటి సీజనల్ వ్యాదులు రాకుండ దోమల నివారణ చర్యలు తప్పక చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా విలీన గ్రామాల డివిజన్ల పై ప్రత్యేక దష్టి పెట్టాలని... సంబంధిత డివిజన్లలో పారిశుధ్యం చాలా మెరుగ్గా ఉండాలన్నారు. అంతే కాకుండా శివారు ప్రాంతాల( స్లంబ్) పై కూడ ప్రత్యేక దష్టి పెట్టి పారిశుధ్యం తో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు ఎలాంటి సీజనల్ వ్యాదులు రాకుండ చర్యలు తీస్కోవాలని... విషజ్వరాల సమస్యతో బాధపడే వారి వివరాలను జవానులు, ఎస్సైలు సేకరించి ఆరోగ్య శాఖ వైద్యులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలు కూడ విషజ్వరాల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని మీ ఇంటి పరిసరాల్లో దోమలు పెరగకుండా... కుట్ట కుండ జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. మీ ఇంటి పరిసరాలను మీరే పరిశుభ్రంగా చూస్కోవాలని చెత్తను పరిసరాలు, ఖాళీ స్థలాల్లో వేయకుండ నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మీకులకు మాత్రమే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ వేణు మాదవ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్లు, నగరపాలక సంస్థ మెడికల్ హెల్త్ ఆఫీసర్, సానిటేషన్ సూపర్ వైజర్లు, ఇన్ స్పెక్టర్ లు, జవానులు పాల్గొన్నారు.

# సబ్ జూనియర్ బాల, బాలికల సాఫ్ట్ బాల్ పోటీలు



**గోదావరిఖని, ఆగస్ట్ 01 (మనం న్యూస్):** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో ఆగస్ట్ 03 ఆదివారం సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాల, బాలికల సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి భాషబోయిన వాసు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని, క్రీడాకారులు 2013 జనవరి 01 నుండి 2015 డిసెంబర్ 31 మధ్య జన్మించిన వారై ఉండాలని అన్నారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఆగస్ట్ 9వ నుంచి 11వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

# భక్తులతో కిటకిటలాడిన శ్రీ మహాశక్తి దేవాలయం...

- ఘనంగా కుంకుమ పూజలు ...
- అమ్మవార్లకు ఓడి బియ్యం సమర్పించిన మహిళలు..





**కరీంనగర్ ,ఆగస్టు 1(మనం బ్యూరో):** శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా కరీంనగర్ పట్టణం చైతన్యపురి లోని మహిమాన్విత దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు అశేష సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవార్లకు ఓడి బియ్యం సమర్పించారు. శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాలకు ఎంతో విశిష్టత ఉండడంతో, ముఖ్యంగా అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో పూజించే వారంగా శ్రీ మహాశక్తి దేవాలయంలోని ఆ అమ్మవార్లను పూజించడం వల్ల ఐశ్వర్యం, సౌభాగ్యం సిద్ధిస్తాయని మహిళలు ప్రగాఢంగా విశ్వసిస్తుంటారు. దేవాలయంలోని ముగ్గురు శక్తివంతమైన అమ్మవార్లను పూజిస్తే తమ కుటుంబసభ్యులు సుఖ సంతోషాలతో ఉంటారని శ్రీ మహాశక్తి దేవాలయానికి వచ్చే భక్తుల విశ్వాసం.సాయంత్రం దేవాలయంలో సామూహిక కుంకుమ పూజలు కూడా ఘనంగా జరిగాయి. మహిళలు లక్ష్మి దేవి పూజలో పాల్గొని, వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

# పదవి విరమణ ఉద్యోగానికే కాని జీవితానికి కాదు





**మంచిర్యాల, 1, ఆగస్ట్, ( మనం న్యూస్):** సింగరేణి సంస్థలో సుదీర్ఘ కాలం ఉద్యోగం ద్వారా సేవలు అందించి చేస్తున్న పదవి విరమణ ఉద్యోగానికే కాని జీవితానికి కాదని సింగరేణి కాలారీస్ క్లరికల్ అసోషిఏషన్ (సిక్కా ) నాయకులు అన్నారు . శ్రీరాంపూర్ ఏరియాలోని సెక్యూరిటీ డిపార్టుమెంటు ఎస్ అండ్ పిసి లో పదవి విరమణ చేసిన డిప్యూటీ సుపెరిండిెంట్ పల్లికొండ శంకరయ్యా దంపతులను డిపార్టుమెంటు శుక్రవారం ఆవరణలో బోకే , షాలు వాలతో సిక్క తరపున ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో నాయకులు, తోటి క్లర్క్ లు కన్నం సాంబయ్యా, కోతి శ్రీధర్, గోసిక మల్లేష్,బద్రి బుచ్చయ్యా, గొల్లపల్లి రాంచందర్, ఉప్పు ప్రసాద్, అలాగే జనరల్ మేనేజర్ కార్యాలయం మిస్టేరియల్ స్టాఫ్ కూడా పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ సందర్శించిన రబీవరర్ డైరెక్టర్ అభిలాష్ బిస్తు ఐపీఎస్



**నస్పూర్,1ఆగస్టు,2025,మనం న్యూస్:** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిది శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ ఆర్ బి వి ఆర్ ఆర్ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ అడిషనల్ డీజీ గారు సందర్శించడం జరిగింది. మొదటగా పోలీస్ స్టేషన్ చేరుకొన్న మేడమ్ ని జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు శ్రీరాంపూర్ సిఐ వేణు చందర్ ఎస్సై సంతోష్ లు మేడం కి మొక్కలు అందజేసి స్వాగతం పలకడం జరిగింది. అనంతరం ఏఆర్ మహిళా సాయిధ దళ సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించి అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి రిసెప్షన్ సెంటర్ ను సందర్శించి రిసెప్షన్ డ్యూటీలు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందితో మాట్లాడి బాధితులు వచ్చినప్పుడు ఏ విధంగా వారిని రిసీవ్ చేసుకుంటున్నారు వారి సమస్యలు ఏ విధంగా తెలుసుకుంటున్నారు అని అడిగి తెలుసుకోవడం జరిగింది. పోలీస్ స్టేషన్ లోని రూమ్స్, లాకప్, విమెన్, మెన్ బ్యారక్ పరిసరాలను, వాష్ రూమ్స్ పరిశీలించారు, టెక్నికల్ రూం, సిసి కెమెరాలను పని తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ఎల్లవేళలా ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదు పై సత్వరం స్పందించి సేవలు అందించాలని చెప్పారు. మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ ఐపీఎస్., జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి శ్రీరాంపూర్ సిఐ వేణు చందర్, ఆర్ ఐ సంపత్ శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్, లక్ష్మి ప్రసన్న, ఉన్నారు.

# మద్యం దుకాణాల పెంపు ఆలోచనను వెంటనే వెనక్కి తీసుకోవాలి

- మద్యం దుకాణాల పెంపుతో గ్రామాల్లో పెరుగనున్న అరాచకాలు
- ఏఐఎఫ్డిడబ్ల్యూ జిల్లా కార్యదర్శి దుర్గం లక్ష్మి



**మంచిర్యాల, 1, ఆగస్ట్, ( మనం న్యూస్):** రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న మద్యం దుకాణాల పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య ( ఏ ఎఫ్ డి డబ్ల్యూ) జిల్లా కార్యదర్శి దుర్గం లక్ష్మి డిమాండ్ చేశారు . ఏంసిపిఐయు పార్టీ కార్యాల యంలో ఆమె మాట్లాడుతూ, ఇటీవల రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో గ్రామాల్లో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనందని ఆందోళన వ్యక్తం చేశారు . ఒకవైపు మద్యం, ఉచ్చులో పడి యువత తమ జీవితాలను నాశనం చేసు కుంటుంటే, వారి భవిష్యత్తును మరింత అంధకారంగా చేసేందుకు ఎన్నికల ముందు గత మాజీ సిఎం కెసిఆర్ తీసుకొచ్చిన మద్యం దుకాణాలను మొత్తం ఎత్తి వేస్తామని రేవంత్ రెడ్డి బూటకపు హామీలు ఇచ్చి నేడు వాటిని విస్మరిస్తూ రెండు వేల మద్యం షాపులు 5 వందల బార్లకు కొత్త అనుమతులు ఇవ్వడానికి సిద్ధపడడం చాలా సిగ్గుచేటన్నారు. గ్రామాల్లో మద్యం షాపులు పెట్టడం మూలంగా కుటుంబాల్లో కలహాలు మొదలై బంధాలు విచ్ఛిన్నమవుతాయని, ముఖ్యంగా మహిళల పైన దాడులు , హింస పెరిగే అవకాశం ఉందని, విద్యార్థులు, యువత ఆరోగ్యాలు నాశనం అవుతాయని అన్నారు . వీరి ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సింది పోయి, తాగుబోతులుగా చేయాలనుకోవడం విడ్డూరంగా ఉందని, మద్యం దుకాణాలు వద్దని, ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని మహిళలకు భద్రత కల్పించాలని ''మా ఊర్లో నువ్వు మధ్యమనే మాయా లోకంలోకి లాగొద్దని'' విజ్ఞప్తి చేస్తున్నామన్నారు . రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మద్యం పాలసీ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున మహిళలను సేకరించి ఆందోళనలకు సిద్ధమవు తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలియపరుస్తున్నామని అన్నారు.

# ఇందుర్తి మహమ్మదీయ మస్జిద్ నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడుగా మహమ్మద్ రఫీ..కార్యదర్శిగా ఉస్మాన్ పాషా ఏకగ్రీవంగా ఎన్నిక**



**చిగురుమామిడి :ఆగస్టు 01:-(మనం న్యూస్):** మండలంలోని మేజర్ గ్రామమైన ఇందుర్తి మహమ్మదీయ మస్జిద్ కు, ముస్లిం మైనారిటీ కమ్యూనిటీకి నూతనంగా ఎన్నికైన కమిటీనీ శుక్రవారం (జుమా) నమాజ్ అనంతరం అధికారికంగా ప్రకటించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా (సదర్ సాబ్) మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షుడుగా షేక్ ఎక్బాల్ జానీ, కార్యదర్శిగా మహమ్మద్ ఉస్మాన్ పాషా, సహాయ కార్యదర్శి గా మహమ్మద్ షంషీర్ అలీ, కోశాధికారిగా మహమ్మద్ చాంద్ పాషా ఖురేషి, కార్యవర్గ సభ్యులుగా ఎండి అశ్ఫాక్, షేక్ సిరాజ్, ఎండి. ఖాసీం, ఎండి. రాజ్ మహమ్మద్, ఎండి సాధిక్, షేక్ ఉమర్, ఎండి అబ్దుల్ కరీం పాషాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. మస్జిద్ అభివద్ధికి తోడ్పాటునందిస్తామని, మస్జిద్, ఖబ్రస్థాన్, ఈద్గాకు సంబంధించిన పెండింగ్లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు శాయ శక్తుల కషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామానికి సంబంధించి నటువంటి ముస్లిం సోదరులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను పరిష్కారం చేసే దిశగా కషి చేస్తామన్నారు. నూతన కమిటీని ఎన్నుకున్న గ్రామ ముస్లిం సోదరులందరికీ కతజ్ఞతలు తెలిపారు.

# లలితామాత ఆలయంలో ఘనంగా కుంకుమ పూజలు

- అమ్మ వారికి ఓడిబియ్యం సమర్పించిన మహిళలు



**జగిత్యాల, ఆగస్టు 01( మనం న్యూస్):** శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని పొలాస గ్రామంలో నెలకొన్న లలితామాత ఆలయంలో శుక్రవారం మహిళలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకోగా ఆలయాలు శ్రావణ శుక్రవారం శోభను సంతరించుకుని 108 శ్రీ చక్ర సహిత లలితామాత ఆలయంలో పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి పూజలు చేసి ఓడిబియ్యం సమర్పించారు. అనంతరం శ్రీ లలితామాత ఆలయంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య ఆధ్వర్యంలో సుహాసినిలు లలితసాహస్ర నామ పారాయణం గావించి శ్రీ చక్రాలకు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా జగిత్యాల పట్టణం చింతకుంట వద్ద శ్రీ సూర్య ధన్వాంతరి దేవాలయంలో ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో మాతలు అమ్మవారికి కుంకుమ పూజలు చేసి, పంచామతాలతో అభిషేకం చేసి, లలితాసహస్ర నామ పారాయణం చేశారు. పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం, చీరను ఆలయ పూజారి ఆశీర్వచనములతో సత్కరించారు. అష్టలక్ష్మి దేవాలయం, శివాలయం, సహస్రలింగాల దేవాలయం, తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, చెల్లం స్వరూప, ఉటూరి కళ్యాణి, అర్చన, పాంపట్టి సులోచన,రంగ ప్రసన్న, ఆడెపు వనజ, అపర్ణ, ఆనంతుల అంజలి, పెద్ది అశ్విని,గట్టు భాగ్యలక్ష్మి, మహేందర్, రాజేష్, వడ్లగట్ల రాజన్న, వోడ్నాల శ్రీనివాస్, అర్చకులు అజయ్ శర్మ,చిలుకముక్కు నాగరాజు, మహిళా సమితి సభ్యులు స్వాతి, గీత, సంధ్య, జయ శ్రీ, అన్నపూర్ణ, తార, సుజాత, రమాదేవి, పుష్ప లత, లక్ష్మి, దితదితరులు పాల్గొన్నారు.

# ముల్కలపేట గ్రామంలో బీజేపీ పార్టీలో చేరికలు

**మంచిర్యాల, 1, ఆగస్ట్, ( మనం న్యూస్):** మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం, ముల్కలపేట గ్రామంలో భారతీయ జనతా పార్టీ వేమనపల్లి మండల అధ్యక్షులు ఏట మధుకర్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాపర్తి వెంకటేశ్వర్లు,జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు కోడి రమేష్ ల సమక్షంలో చేరికలు జరిగాయి. ముల్కలపేట గ్రామానికి చెందిన రంగు శంకర్ గౌడ్, రంగు బాపు గౌడ్, ఎల్కరి రవి లు బీజేపీ పార్టీలో చేరారు, వీరికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాపర్తి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు కోడి రమేష్ లు పార్టీ కండువా కప్పి పార్టీ లోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు ఎనుముల వెంకటేష్, కొప్పుల చరణ్ రాజ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మడే శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షులు ముల్కల సత్యనారాయణ, నౌనూరి రమేష్ గౌడ్, నగోష పోచన్న, బిజెవైఎం అధ్యక్షులు కంపెల అజయ్ కుమార్, జుమ్మిడే వెంకటేష్, బీజేపీ నాయకులు కొప్పుల మధునయ్యా, సీపెల్లి కిషోర్, కోయిల స్వామి, కుబిడే అంజన్న, గొండే రాజన్న, కొత్తూరి పోచయ్యా, మడే సమ్మయ్యా, ఎల్కరి శేఖర్, ఎల్కరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.





# బాబోయ్ రాకపోకలు సాగించేది ఎలా 'మనం' కథనానికి స్పందన

- వాహనదారులకు చుక్కలు చూపించిన మంచిర్యాల హమాలివాడ రైల్వే అండర్ బ్రిడ్జి రహదారి గుంతలను పూడ్చారు
- ''మనం'' కు ధన్యవాదాలు తెలిపిన వాహనదారులు



**మంచిర్యాల, 1, ఆగస్ట్, ( మనం న్యూస్):** మంచిర్యాల హమాలివాడ రైల్వే అండర్ బ్రిడ్జి రహదారి పై '' మనం '' లో ప్రచురితమైన బాబోయ్ రాకపోకలు సాగించేది ఎలా ''మనం '' కథనానికి స్పందన వచ్చింది. నీటితో నిండిన ఈ గుంతల దారి లో వాహనదారులకు చుక్కలు చూపించి వాహన దారులను, ప్రజలను హడలి పోతున్నట్లు చేసిన ఈ గుంతలను సంబధిత అధికారులు కంకరతో నింపి గుంతలను పూడ్చారు.గత నెల 23 న '' బాబోయ్ రాకపోకలు సాగించేది ఎలా'' అనే ప్రత్యేక కథనాన్ని పత్రికలో తీసుకురావడం జరిగింది.మంచిర్యాల పట్టణం లో ప్రతి రోజు వందలాది వాహనాల ద్వారా మంచిర్యాల హమాలి వాడ రైల్వే అండర్ బ్రిడ్జి దారి వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు.ఈ హమాలి వాడ రైల్వే అండర్ బ్రిడ్జి వాహనదారులకు పాదచారులకు ఉపయోగకరంగా ఉన్నా కూడా వర్షాకాలం భారీ వానల కారణంగా అండర్ బ్రిడ్జి లోపల, రాకపోకలు సాగించే ఇరువైపుల పెద్ద పెద్ద గుంతల మీద పడుతూ, లేస్తూ ప్రయాణం సాగించారు. ఇక్కడ భారీ వర్షాల రాక తగ్గిపోవడం తో సంబధిత అధికారులు గుంతలను పూడిపించారు. వాహనాదారులు తమ వాహన మీద సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. అయితే కంకర పరవా లేదు అనిపిస్తున్నా తారు, కంకరతో కూడిన పెర్మేనేంట్ రోడ్డు నిర్మించా లని అందరు కోరారు .ఏది ఏమైనా తమ ఇబ్బందులను బాధ్యతగా గుర్తించి వార్తా కథనం ద్వారా వెలుగులోకి తెచ్చి సంబది అధికారుల దష్టికి వెళ్ళే లాగ చేసి సమస్య కు పరిష్కారం చూపిన '' మనం'' కు ప్రజలు వాహన దారులు ధన్యవాదాలు తెలిపారు.

# రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలి

- నేషనల్ కిసాన్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి
- మహారాష్ట్రలో నేషనల్ కిసాన్ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**తొగుట, ఆగస్టు 01(మనం న్యూస్):** మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలంటే ఆ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని నేషనల్ కిసాన్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి కిసాన్ కాంగ్రెస్ నాయకులకు సూచించారు. శుక్రవారం ముంబైలోని తిలక్ భవన్ లో మహారాష్ట్ర పిసిసి అధ్యక్షుడు హర్షవర్ధన్ తో నేషనల్ కిసాన్ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్ర లో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, దేశంలో రైతు ఆత్మహత్యలు సగటున మహారాష్ట్రలోనే ఎక్కువగా జరుగుతున్నాయని, రైతులకు ఉన్న ఇబ్బందులను గ్రహించి వారి సమస్యల పరిష్కారానికి తగిన సలహాలు సూచనలు చేసి వారిని వృద్ధిలోకి తీసుకొని రావడానికి ప్రణాళికా బద్దంగా ముందుకు వెళ్లాలని కిసాన్ కాంగ్రెస్ ఇన్చార్జిలుగా ఎన్నిక చేసే ముందు వారికి రైతుల సమస్యల పట్ల అవగాహన కలిగి ఉన్న వారిని సూచించినట్లయితే వారి సేవలను సరైన విధంగా ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను మహారాష్ట్ర ప్రజలకు తెలియజేస్తూ మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే రైతులకు ఎలా మేలు జరుగుతుందో వారికి అవగాహన కల్పించినప్పుడు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పట్ల నమ్మకం ఏర్పడి మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం సులువవుతుందన్నారు. రాబోయే రోజుల్లో కిసాన్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ లతో మరిన్ని సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు సూచనలు తీసుకుంటామన్నారు.

**బాలగంగాధర్ తిలక్‌కు చెరుకు శ్రీనివాస్ రెడ్డి నివాళులు**





శుక్రవారం బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ముంబైలోని తిలక్ భవనంలో నేషనల్ కిసాన్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం నా జన్మహక్కు అని చాటిన జాతీయోద్యమ పిత బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తి భారతీయులందరిలో ప్రతినిత్యం సజీవంగా ఉందన్నారు. వ్యక్తి స్వాతంత్ర్యం, భావ స్వాతంత్ర్యం కోసం తిలక్ పరితపించారని, ఆలాంటి దేశభక్తుడు అందించిన స్ఫూర్తితో ప్రాథమిక హక్కుల పరిరక్షణ, పౌరహక్కుల సాధనే మనందరి లక్ష్యం కావాలని, అదే లోకమాన్యుడికి మనం అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర పిసిసి అధ్యక్షుడు హర్షవర్ధన్, ప్రకాష్ గాలే, ప్రధాన కార్యదర్శి అనంత్ మొహద్, జాతీయ కోఆర్డినేటర్ జీవన్ దత్త, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# భూ భారతి రెవెన్యూ సదస్సుల అర్జీలను పరిష్కరించాలి

- అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు
- ఇందిరమ్మ ఇండ్ల పురోగతి సాధించాలి
- కట్టలేని వారిని గుర్తించి వేరే వారికి అవకాశం ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ హైమావతి

**కొండపాక, ఆగస్టు 01(మనం న్యూస్):** భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా ఆయా గ్రామాల్లో స్వీకరించిన అప్లికేషన్ లను భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అన్నారు. శుక్రవారం కొండపాక మండల కేంద్రంలోని సమీకృత మండల కార్యాలయ సముదాయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో భూ భారతి రెవిన్యూ సదస్సుల పెండింగ్ అప్లికేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్లు 273 శాంక్షన్ లో ఉండగా 237 మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయని 100% గ్రౌండింగ్ కావాలని ఆదేశించారు.

కట్టుకోడానికి సుముఖంగా లేనివారికి నోటీస్ ఇచ్చి పేరు తొలగించి మరొక లబ్ధిదారులకు మంజూరు చెయ్యాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇల్లు వేగంగా పూర్తి అయ్యేలా రోజు పర్యవేక్షణ చెయ్యాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ శ్యామ్, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయ శాఖ ఉద్యోగులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి



- ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి
- దేవదాయ శాఖ కమిషనర్‌కు వినతి

**రామచంద్రాపురం, ఆగస్టు 1(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర దేవదాయ శాఖ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ బేసిక్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు అన్ని రకాల ఇన్సూరెన్స్ లు కల్పించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి కోరారు. దేవదాయ శాఖ ఉద్యోగులకు ఇన్సూరెన్స్ కల్పించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ వెంకటేశ్వరరావును ఎమ్మెల్సీ అంజిరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు, పూజారులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, ఎస్బిఐ లైఫ్ లాంటి ఇన్సూరెన్స్ వారి రక్షణ కోసం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే హిందూ దేవాలయాల్లో టికెట్ ధరల్లోనే దేవాదాయ పరిసరాల్లో ఉన్న భక్తులకు ఇన్సూరెన్స్ కల్పించాలని ఎమ్మెల్సీ రెడ్డి తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచాలి

- అవగాహనతోనే సీజనల్ వ్యాధులు దూరం
- సిబ్బంది సమయపాలన పాటించాలి
- డీ.ఎం.హెచ్.ఓ. డాక్టర్ ధనరాజ్



**నంగునూరు, ఆగస్టు 01(మనం న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ అన్నారు. శుక్రవారం నంగునూరు మండలం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మంచి వైద్యం అందేలా చూడాలని అన్నారు. గర్భవతులకు, పిల్లలకు అందించాల్సిన వ్యాధినిరోధక టీకాలను సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ప్రస్తుత వర్షాకాలం సీజన్లో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచాలని సూచించారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగేలా ప్రత్యేక కార్యచరణ చేపట్టాలన్నారు. అన్ని పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో లభిస్తున్నాయన్న విషయం ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని మెడికల్ స్టోర్, ల్యాబ్, ఓపి, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. సీజన్ లో వచ్చే వ్యాధులను అరికట్టడంలో ముందు జాగ్రత్త చర్యలు ఏం తీసుకుంటున్నారని సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ సరిత, హెచ్.ఇఓ స్వామి, మహిళా సూపర్వైజర్ అనురాధ వైద్య సిబ్బంది ఉన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

- ఆపరేషన్ ముస్కాన్ సక్సెస్
- 94 మంది చిన్నారులకు రక్షణ
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ డా. బి. అనురాధ



**సిద్దిపేట, ఆగస్టు 01, మనం న్యూస్ ప్రతినిధి:** సిద్దిపేట జిల్లాలో బాల కార్మిక వ్యవస్త నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పాటుపడాలని సిద్దిపే లట పోలీస్ కమీషనర్ డా. బి. అనురాధ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లాలో విజయవంతంగా నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఇందులో భాగంగా జూలై 01 నుండి 31వ తేదీ వరకు ఆపరేషన్ ముస్కాన్ - 11 ద్వారా పోలీస్ అధికారులు, బాలల సంరక్షణ శాఖతోపాటు ఇతర శాఖల అధికారుల సమన్వయంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి 94 మంది ఆంధ్రప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్ ఘడ్, బీహార్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మేఘాలయ రాష్ట్రాలకు చెందిన చిన్నారులకు విధుల నుండి ఉపశమనం కల్పించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు.

బాల కార్మికులుగా పని చేయించుకుంటున్న యజమానులపై జిల్లాలో 27 కేసులు నమోదు చేశామని, వీరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేసిన నోడల్ అధికారి సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఏసిపి రవిందర్ తోపాటు ఆయా శాఖల అధికారులను సీపీ అభినందించారు. ఎక్కడైనా బాల కార్మికులతో పని చేయించినట్లుగా గుర్తించినట్లయితే బాధ్యతాయుతమైన పౌరులుగా విధిగా డయల్ 100 లేదా పోలీస్ కమీషనరేట్ కంట్రోల్ రూమ్ 8712667100 నెంబర్ కు సమాచారం అందించాలని సూచించారు.

# పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పని చేయాలి



- ప్రతి రోజు చెత్త సేకరించాలి
- రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్

**రామచంద్రపురం, ఆగస్టు 1(మనం న్యూస్):** పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పని చేయాలని, ప్రతి రోజు కచ్చితంగా ఇండ్ల నుంచి చెత్తను సేకరించాలని రామచంద్రపురం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్ప నగేష్ అన్నారు. మార్నింగ్ వాక్ విత్ అఫీషియల్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డివిజన్ పరిధిలోని కనుకుంటలో ఉదయం 06:00 గంటలకు జీహెచ్ఎంసి డిప్యూటీ కమీషనర్ సురేష్, ఎఎంఒహెచ్ విజయ్ మోహన్, ఎస్ఎస్ కేశవులు, జవాన్ పవన్, ఎస్ఆర్పి మల్లికార్జున్, రాంకీ ఇంచార్జ్ విజయభాస్కర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ ఎసిపి రాణి, ఎంటమాలజీ ఏఈ తిరుపతయ్య, జిహెచ్ఎంసి శానిటేషన్, రాంకీ విభాగ అధికారులు, సిబ్బందితో కలిసి బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సానిటేషన్ సిబ్బంది నిత్యం రావడం లేదని, దీంతో చెత్త రోజు రోజుకు పెరిగిపోయి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని బస్తీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి రోజు సానిటేషన్ సిబ్బంది చెత్త సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ ను కార్పొరేటర్ కోరారు. అనంతరం కనుకుంట పోలీస్ క్వాటర్స్ ముందు ఉన్న బస్తీలో కార్పొరేటర్ పర్యటించారు. ఖాళీగా ఉన్న పాత ఇళ్లలో చెత్త నింపుతున్నారని తెలుసుకున్న కార్పొరేటర్ వెంటనే చెత్తను తొలగించాలని చెప్పారు. కొన్ని ప్రాంతాలలో నీరు నిలిచి దోమల బెడద పెరుగుతుందని ప్రజలు తెలపడంతో స్ప్రే చేయించి, నీరు వదులుతున్న ఇండ్లకు నోటీసులు జారీ చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రాజు, సత్యనారాయణ రెడ్డి, పాషా, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

- అన్ని వార్డులను సమానంగా అభివద్ది చేస్తాం
- కాంగ్రెస్ వచ్చిన తర్వాత రూ.20 కోట్ల పనులు ఆపింది
- జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి
- సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు



**సిద్దిపేట, ఆగస్టు 01(మనం న్యూస్ ప్రతినిధి):** కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దిపేటపై కక్ష సాధింపు చర్యలు మానుకొని నిధులు కేటాయించి అభివద్ధికి సహకరించాలని సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ బి.ఆర్.ఎస్. హయాంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆధ్వర్యంలో సిద్దిపేట అన్ని రంగాలలో అభివద్ధి చెంది తెలంగాణకే తలమానికంగా నిలిచిందన్నారు. 90 శాతం పనులు బి.ఆర్.ఎస్. హయాంలో పూర్తయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో 10 శాతం కూడా అభివద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే తప్ప చేతలకు పనికి రాదన్నారు. బి.ఆర్ఎస్. హయాంలో నూతన రేషన్ కార్డులను ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం చేర్పులు చేసి తమ ప్రభుత్వమే ఇచ్చిందని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.20 కోట్ల మేర అభివద్ధి పనులకు నిధులు ఆపిందన్నారు. సిద్దిపేట జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహలు సిద్దిపేట మున్సిపల్ ను సందర్శించి అభివద్ధికి సహకరించాలన్నారు. జిల్లా కలెక్టర్ హైమాపతి దష్టి సారించి అన్ని వార్డులకు నిధులు కేటాయించాలన్నారు. 01వ వార్డుకు కాకుండా అన్ని వార్డులకు నిధులు తీసుకువస్తే స్వాగతిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# తల్లి పాలను మించిన ఔషధం లేదు

- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ
- అదనపు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**సిద్దిపేట రూరల్, ఆగస్టు 01(మనం న్యూస్):** ఈ లోకంలో తల్లిపాలను మించిన ఔషధం మరొకటి లేదని, పుట్టిన శిశువుకు వెంటనే తల్లిపాలు అందించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవం - 2025 పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాలకు ప్రాధాన్యతనివ్వండి-స్థిరమైన మద్దతు వ్యవస్థలను సృష్టించండి అనే థీమ్ ద్వారా తల్లిపాల విశిష్టతను తెలియజేయడం జరుగుతుందన్నారు. దీని ద్వారా ప్రసూతి సెలవులపై సరైన విధానం, తల్లులకు మద్దతు ఇచ్చే ఆరోగ్య సిబ్బందికి శిక్షణ, తల్లులకు పని ప్రదేశాల్లో సరైన మద్దతు వాతావరణం వంటి వాటి పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి సిడిపిఓలు, పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రాజెక్టు అసిస్టెంట్, ఐటి కో ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

# జి ప్లస్ త్రీ మోడల్ ఇండ్ల నిర్మాణానికి స్థలసేకరణ పనులు వేగవంతం చేయాలి

- పి ప్రావిణ్య, జిల్లా కలెక్టర్.






**సంగారెడ్డి ఆగస్టు 1 మనం న్యూస్ ప్రతినిధి:** జిల్లాలో 3 మోడల్ గహ నిర్మాణానికి భూదాన్ భూముల గుర్తింపు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తో కలిసి జిహెచ్ఎంసి పరిధిలోని మండలాలకు చెందిన రెవెన్యూ , గహ నిర్మాణ శాఖ, జిహెచ్ఎంసి అధికారులతో శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయము లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో జిహెచ్ఎంసి పరిధిలోని మండలాలలో %+%౦3 మోడల్ గహ నిర్మాణాల కోసం తాసిల్దార్ లు, తమ పరిధిలో భూదాన్ భూములను గుర్తించే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిహెచ్ఎంసి, మున్సిపల్ పరిపాలనా పరిధిలో ఉన్న స్లమ్ ప్రాంతాలను గుర్తించి, అక్కడ నివాసిస్తున్న ప్రజలకు సురక్షితమైన 2%దీఖు% గహాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిహెచ్ఎంసి పరిధిలో మొత్తం 5956 గహాలు మంజూరైనట్లు తెలిపారు. జిల్లాలోని పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో 2%దీఖు% గహాల కోసం ఇప్పటికే 592 మందికి గహాలు లబ్ధిదారులకు కేటాయించబడినప్పటికీ, కొన్ని కారణాల వల్లన మంజూరు అయిన ఇండ్లను వారు స్వాధీన పరుచుకోలేకపోయిన నేపథ్యంలో వారికి మరోసారి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అంతేకాక, గహాలను ఇప్పటికీరంతో టూ బిహెచ్కె గహ ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. 2%దీఖు% గహ సముదాయాల నిర్వహణ బాధ్యత రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (%=ఔ%) లకు ఉండేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. అయితే ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఆ సంఘాలను ఏర్పాటు చేయాలనీ జిల్లా సహకార శాఖ అధికారులను ఆదేశించారు . ఈ కార్యక్రమంలో జిల్లా గహ నిర్మాణ శాఖ అధికారి చలపతి రావు , పటాన్చెరువు నియోజకవర్గ తహసీల్దార్లు ,మునిసిపల్ కమిషనర్లు ,జి హెచ్ ఏం సి అధికారులు జిహెచ్ఎంసి అధికారుల సిబ్బంది పాల్గొన్నారు .

# ఏజెన్సీ వైద్యానికి మంచి రోజులొచ్చాయ్...

- పట్టణ ప్రాంతాలను తలదన్నేలా ప్రభుత్వ వైద్యం
- ఆధునిక వసతులతో రోగులను ఆకట్టుకుంటున్న సిహెచ్‌సి
- కలెక్టర్, డిసిహెచ్‌ల చొరవతో సిహెచ్‌సికి మహర్దశ







చర్ల, ఆగస్టు 1 (మనం న్యూస్) : ఏజెన్సీ వైద్యానికి మంచి రోజులొచ్చాయ్...మూడేళ్ల క్రితం వరకు చర్లలో ప్రభుత్వ వైద్యమనేది పేదవాడికి అందని ద్రాక్షగా ఉండేది. అప్పటి వరకు సేవలందించిన ప్రాదమిక ఆరోగ్య కేంద్రం కొయ్యూరుకు తరలివెళ్లింది. దీంతో వేలాది మందికి ప్రభుత్వ వైద్యం దూరమయింది. రోగులు గ్రామీణ వైద్యశాలలకు క్యూ కట్టారు. ఇదే అదునుగా భావించిన గ్రామీణ వైద్యులు రోగులను జలగల్లా పీడించి ఆర్థికంగా, శారీరకంగా పీల్చిపిప్పిచేసారు. పేదల కష్టాలను గమనించిన రాజకీయ పార్టీలు ఉద్యమబాటపట్టాయి. మండల కేంద్రంలో ఎట్టిపరిస్థితులలో ప్రభుత్వ వైద్యశాల పెట్టి తీరాల్సిందే అని పట్టుబట్టాయి. ఈ నేపథ్యంలో పేద రోగుల దుస్థితి ప్రభుత్వం దృష్టికి వెల్లింది. అప్పటి జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అదికారి డాక్టర్ రవిబాబుల చొరవతో సీమాంగ్ సెంటర్ లో ఇద్దరు దంత వైద్యులు డాక్టర్ గీతానంద కాంత్, డాక్టర్ జగన్ లతో పాటు ముగ్గురు సిబ్బందితో సామాజిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేసి వైద్యశాలను ప్రారంబించారు. అందరూ డెంటల్ వైద్యులతో ఆసుపత్రిని నిర్వహిస్తారా అంటూ అదికారుల తీరును తప్పుపట్టారు. ఈలోగా కలెక్టర్ అనుదీప్ చొరవతో రూ. కోటి వ్యయంతో అధునాతన భవనం నిర్మించారు. ఏడాది గడిచిన అనంతరం చర్ల పట్టణానికి చెందిన డాక్టర్ బూరుగడ్డ సాయివర్దన్ ను ఆసుపత్రి వైద్యునిగా నియమించారు. ఆయన నేతృత్వంలో మొత్తం ముగ్గురు వైద్యులు సేవలందించడం ప్రారంబించారు. అనతికాలంలోనే వీరి వైద్య సేవలకు రోగులు ఆకర్షితులయ్యారు. రోగులు క్రమంగా గ్రామీణ వైద్యశాలలను వీడి ప్రభుత్వ వైద్యశాల బాట పట్టారు. రోగులను ప్రభుత్వ వైద్యశాలవైపు మళ్లించడంలో డాక్టర్లు సాయివర్దన్, గీతానంద్ కాంత్, జగన్ కృషి మరువలేనిది.

ఇంతలో జిల్లా కలెక్టర్ గా జితేష్ వి పాటిల్ బాద్యతలు చేపట్టడంతో సి హెచ్ సి కు మహర్దశ పట్టిందనే చెప్పాలి. డి సి హెచ్ రవిబాబు చొరవతో కలెక్టర్ వైద్యశాలకు కావాల్సిన ఆదునిక పరికరాలను ఒకొక్కటిగా సమకూరుస్తున్నారు. మొదటగా కిడ్ని సంబంధిత వ్యాదులతో బాదపడుతున్న వ్యాధిగ్రస్తుల సౌకర్యం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసి సేవలను అందచేస్తున్నారు. ఇందుకు గాను శిక్షణ పొందిన సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో వ్యాధిగ్రస్తులు ఆర్దికంగా, శారీరకంగా ఎంతో ఉపసమనం పొందుతున్నారు. గతంలో ప్రభుత్వ వైద్యశాలలో కేవలం మలేరియా జ్వరానికి సంబంధించిన రక్త పరీక్షలే నిర్వహించే వారు. ప్రస్తుతం ఆదునిక ల్యాబ్ ఏర్పాటు చేసారు. సెల్ కౌంటింగ్ మిషన్, అనలైజర్ వంటి వసతులు కల్పించడంతో డెంగ్యూ, మలేరియా, రక్తకణాల లెక్కింపు, టైఫాయిడ్, షుగర్, ప్రెగ్నెన్సి పరీక్ష, హెచ్ ఐ వి, బ్లడ్ గ్రూపింగ్, కామెర్లు, కిడ్ని సంబంధిత తదితర వ్యాదులకు వైద్యశాలలోనే పరీక్షలు చేస్తుండటం విశేషం. సి హెచ్ సి ఏర్పాటుకు ముందు ఈ పరీక్షలను పేదలు ప్రైవేటు రక్త పరీక్షా కేంద్రాలలో వేల రూపాయల ఖర్చుపెట్టి చేయించుకునేవారు. నేడు ఆ పరిస్దితికి చెల్లుచీటి పలకడంతో పేదలు ఆర్దికంగా ఉపశమనం పొందుతున్నారు. ఇటీవల వైద్యశాలలోనే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించేందుకు ఆదునిక ఆపరేషన్ ధియేటర్ ప్రారంబించారు. దీనిని మరింత అభివృద్ధి పరిచి ఇతర ఆపరేషన్ లు సైతం నిర్వహించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏజెన్సీ వాసులకు పంటి సమస్య ఉంటే భద్రాచలం, పాల్వంచ వంటి పట్టణ ప్రాంతాలకు వెల్లాల్సివచ్చేది. ఎలాగూ వైద్యశాలలో ముగ్గురు దంత వైద్యులు ఉండటంతో ఇక్కడి పంటి రోగులకు స్దానికంగానే వైద్యం అందించాలని, ఇందుకు గాను డెంటల్ చైర్ ఏర్పాటు చేయాలని సీనియర్ పాత్రికేయులు కలెక్టర్ ఆసుపత్రి సందర్శన సందర్భంగా సందర్భంగా విజ్ఞప్తి చేయడంతో స్పందించిన కలెక్టర్ సి హెచ్ సిలో డెంటల్ వైద్యం అందచేసేందుకు డెంటల్ చైర్ మంజూరు చేసారు. ప్రస్తుతం చైర్ ఏర్పాటు చేయగా ఒకటి, రెండు రోజులలో డెంటల్ వైద్యం ప్రారంబించేందుకు వైద్యులు సమాయత్తం అవుతున్నారు. మరోవైపు మృతిచెందిన శవాలను భద్రపరిచేందుకు రెండు ఫ్రీజర్లు సైతం వచ్చాయి. వివాదాస్పద మరణాల సందర్భంలో శవపరీక్ష ఆలస్యమయితే ఫ్రీజర్ లో శవాన్ని భద్రపరచవచ్చు. గతంలో ఫ్రీజర్ సౌకర్యం లేకపోచడంతో శవాన్ని రోజుల కొలది ఆరుబయటే ఉంచాల్సి వచ్చేది. లేదా భద్రాచలం ఏరియా వైద్యశాలకు పంపాల్సి వచ్చేది. శవం ఎక్కువ రోజులు ఉంచడంతో దుర్వాసనతో రోగులు, స్దానికులు ఇబ్బంది పడేవారు. ఇదిలా ఉండగా వైద్యశాలలో అన్ని రకాల మందులు, యాంటిబయోటిక్స్, కుక్కకాటు, పాముకాటు, పాయిజన్ కేసులకు కావాల్సిన మందులు పూర్తిస్దాయిలో ఉన్నాయి. ప్రస్తుతం వైద్యశాలలో పిజీ వైద్యుడు, ఎంబిబిఎస్ వైద్యుడితో పాటు ముగ్గురు దంత వైద్యులు సేవలందచేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ లో సిబ్బంది నియామకం చేపట్టడంతో వైద్యశాల సిబ్బందితో సందడిగా మారింది. రోగులకు కావాల్సినంత ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉండటంతో నీరసంగా ఉన్న రోగులకు, జ్వరపీడితులకు సెలైన్స్ పెడుతున్నారు. అత్యవసర సమయంలో రోగికి కృత్రిమ శ్వాస అందించి ప్రాణాలను కాపాడేందుకు ఆక్సిజన్ సిలెండర్లు సైతం ఉన్నాయి. వైద్యశాలలోని ఇన్ ఫేషెంట్స్ కు రుచికరమైన భోజనం ఉచితంగా అందచేస్తున్నారు. ప్రతిరోజూ రోగులకు ఉదయం టిఫిన్, మద్యాహ్నం, రాత్రివేళ కోడి గుడ్డు, అరటి పండుతో ఆహారం అందచేస్తున్నారు. ఇలా ఒకొక్కటిగా వసతి కల్పించి సేవలను మెరుగుపరచడంతో రోజురోజుకు వైద్యశాలకు జనం తాకిడి పెరుగుతోంది. రోజుకు 200 నుండి 250 వరకు వైద్యశాలకు వస్తుండగా వారికి వైద్యులు విసుగు చెందకుండా ఓర్పుతో వైద్యం అందించి పేదల మన్ననలను పొందితున్నారు. ఒకప్పుడు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఆదునిక వైద్యం తమ చెంతకు చేరడంతో స్దానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సిపిఎం పోరాట ఫలితమే.. : కొలగాని బ్రహ్మాచారి**

చర్లలోని పి హెచ్ సి ను కొయ్యూరు కు తరలించిన తర్వాత మండల కేంద్రంలోని ప్రజలు ప్రభుత్వ వైద్యానికి దూరమయ్యారు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆద్వర్యంలో 2022 లో అనేక దశలవారీ పోరాటాలను నిర్వహించాము. మూడు పర్యాయాలు మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టాము. కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాము. మంత్రులు, ఎంపి, ఎం ఎల్ ఏ లకు వినతిపత్రాలు అందచేసాము. ఈ పోరాట ఫలితంగా 2023 లో సి హెచ్ సి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అనంతరం వైద్యులను నియమించమని ఉద్యమించాము. తమ పోరాట ఫలితంగా వైద్యశాలను ఏర్పచేయడమే కాకుండా అర్హతగల వైద్యులను నియమించి, ఒకొక్కటిగా ఆదునిక వసతి కల్పించి పేదలకు వైద్యసేవలు మెరుగు పరచడం శుభపరినామం. ప్రభుత్వం ఎండి, ఎం ఎస్, సర్జన్లను నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

## కొమ్ముగూడెం గ్రామపంచాయతీలో పర్యటించిన ఎమ్మెల్యే జారె





దమ్మపేట, ఆగస్టు 1 (మనం న్యూస్): దమ్మపేట మండలం కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలో గురువారం రాత్రి శాసనసభ్యులు జారె ఆదినారాయణ పర్యటించారు. నూతనంగా మంజూరైన సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన అనంతరం పనులు పూర్తయిన రెండు హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు అదేవిధంగా గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామంలో ఉన్న సమస్యలు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చించారు. అనంతరం అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలను పరామర్శించి మెరుగైన వైద్యం అవసరం ఉంటే తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్ ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాకా రమేష్ ,మన్నెం అప్పారావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గండుగులపల్లిలో. నిర్వహించిన. వనమహోత్సవంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణపాల్గొన్నారు. అశ్వారావుపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు కాంగ్రెస్ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటి ముందు ఒక్క మొక్క నాటి సంరక్షించి పెద్ద చెట్టుగా పెంచితే పచ్చదనం పెరుగు తుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలన్నారు. భవిష్యత్ తరాలకు శుభ్రమైన వాతావరణం అందించాలని వాతావరణ మార్పులు ఎదుర్కొనాలంటే ప్రకృతిని సంరక్షించాల్సిన అవసరం మనందరి మీద ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అటవీ శాఖ,వివిధ శాఖల అధికారులు కాంగ్రెస్ ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు,పాల్గొన్నారు.

## జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ -11వ విడుతలో 54 మంది బాలకార్మికులకు విముక్తి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 01 (మనంప్రతినిధి): బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ -11వ విడతలో జిల్లా వ్యాప్తంగా 54 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి, జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించినట్లు ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ 11 విజయవంతం కోసం జిల్లాలో 05 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జూలై 1 నుండి 31 వరకు నెల రోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్ - 11 కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించామని, ఇందులో 54 మంది బాలకార్మికులను గుర్తించామని తెలిపారు. ఇందులో 44 మంది మగ పిల్లలు, 10 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. ఈ 53 మందిని వారి తల్లిదండ్రులకు, ఒకరిని హోమ్ కి అప్పగించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లలను పనిలో పెట్టుకున్న 39 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేశామని, 13 మందికి నోటీసులు ఇచ్చామని తెలిపారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100/112 కి ఫోన్ చేసి పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. ఆపరేషన్ ముస్కాన్ - 11 లో భాగంగా బాలకార్మికులను వారి తల్లిదండ్రులకు అప్పగించిన ప్రత్యేక బృందాల సభ్యులను ఎస్పీ అభినందించారు.

## ఖిల్లా రోప్ వే తో పర్యాటక అభివృది



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- రోప్ వే ప్రాజెక్టు భూ నిర్వాసితులకు పట్టాలు పంపిణీ

ఖమ్మం, ఆగస్ట్ 01(మనం బ్యూరో): ఖమ్మం ఖిల్లా కు రోప్ వే నిర్మించడంతో పర్యాటకంగా జిల్లా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఖమ్మం ఖిల్లా రోప్ వే ప్రాజెక్టు భూ నిర్వాసితులకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి శుక్రవారం పట్టాలు పంపిణీ చేసారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లా కు రోప్ వే ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఖిల్లా రోప్ వే ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోతున్న నిర్వాసితులకు బల్లేపల్లి వద్ద మంచి విలువైన భూమి పట్టాలను పరిహారంగా అందిస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, అధికారులు, తదితరులు ఉన్నారు.

# జిల్లాలో యూరియా కొరత లేదు

- యూరియా పక్కదారి పట్టకుండా చూడాలి....
- కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- సరైన ఆధారాలు లేకుండా యూరియా సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం



భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 01 (మనం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో వ్యవసాయ, సహకార శాఖ మరియు సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో యూరియా నిల్వలు, సరఫరా, వినియోగ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని, పంటల సాగుకు అవసరమైనంత సరఫరా చేయడానికి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేయడం వల్ల కృత్రిమంగా డిమాండ్ పెరిగినట్టు కనిపిస్తోందని, దీని వల్ల అయోమయ పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. యూరియాను పంటల సాగుకు కాకుండా ఇతర అవసరాల కోసం మళ్లించరాదని, అలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ఏ ఒక్కరు కూడా దుర్వినియోగానికి పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. యూరియా పంపిణీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి సప్లై ఆధార్ నెంబర్ ఆధారంగా నమోదు కావాలని కలెక్టర్ సూచించారు. ఆధారాలు లేకుండా యూరియా సరఫరా చేసిన అధికారులపై తగిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు అవసరమైనంత మేరకు మాత్రమే యూరియా ఇవ్వాలని, నిల్వలు నిరంతరం తనిఖీ చేస్తూ సంబంధిత నివేదికలు సమర్పించాలని సూచించారు. రైతులు యూరియాకు బదులుగా నానో యూరియా ఉపయోగించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు . నానో యూరియా వినియోగం వల్ల ఖర్చు తగ్గుతుందని, నేల ఫలవంతత పెరుగుతుందని, పర్యావరణానికి హానికరం కలగదని చెప్పారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో రైతు వేదికలు, ఫీల్ డెమోల్లో నానో యూరియా ప్రయోజనాలను వివరించాలని, నానో యూరియా వినియోగాన్ని పెంపొందించాలన్నారు. ఈ సీజన్లో 1000 ఎకరాల మునగ సాగు లక్ష్యంగా పెట్టుకోవాలని, ఈ పంట ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం లభిస్తుందన్నారు. మునగ సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టాలన్నారు. అజోల్ల పెంపకం, బయోచార్ తయారీ వంటి పర్యావరణహిత చర్యలు రైతులకు విస్తృతంగా పరిచయం చేయాలని, ఇవి పంటల ఉత్పాదకత పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ తెలిపారు. అజోల్ల వల్ల పశుగ్రాస సమస్యకు పరిష్కారం దొరకడమే కాకుండా, మట్టిలో మైక్రోబయాలజికల్ జీవ క్రియలు మెరుగవుతాయని వివరించారు. బయోచార్ వాడకం వల్ల నేలలో తేమ నిల్వ పెరిగి, దిగుబడి పెరుగుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, డీఎస్ఓ అవధాని శ్రీనివాసరావు, డిపిడి ఆత్మ బి. సరిత, మార్కెఫెడ్ డిఎం సునీత, సొసైటీ సీఈఓలు, వ్యవసాయ శాఖ ఏ డి ఏ లు, ఏవోలు, పాల్గొన్నారు.

## కొత్తపేట ఓల్డ్ కోర్టు స్థలాన్ని బీసీల ఆర్థిక అభివృద్ధికి వినియోగించాలి

- కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి



రంగారెడ్డి, ఆగస్టు 1(మనం న్యూస్): సరూర్ నగర్ డివిజన్ కొత్తపేట చౌరస్తాలోని ఓల్ రంగారెడ్డి కోర్టు స్థలాన్ని బి సి ల సామాజిక గౌరవానికి, ఆర్థిక అభివృద్ధికి బీసీ కమ్యూనిటీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరుతూ హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ కి శుక్రవారం సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు ఎకరం స్థలం ఉన్నదని, ఆ స్థలాన్ని బీసీ సోదరులకు స్వయం ఉపాధికి మార్గం చూయించాలని కోరడం జరిగిందని తెలిపారు.

# ఆర్టిఐ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సమాజంలోని ప్రతి వ్యక్తికి సమాచారం తెలుసుకునే హక్కు ఉంది
- ప్రజా సమాచార అధికారి ఆర్టిఐపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి
- కలెక్టరేట్ లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం



ఖమ్మం, ఆగస్టు 01(మనం బ్యూరో): జిల్లాలో ఆర్టిఐ చట్టాన్ని అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సమాచార హక్కు చట్టం కమిషనర్లు పీ.వీ. శ్రీనివాసరావు, భూపాల్, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కమిషనర్లు ఖమ్మం జిల్లాలో పర్యటించి పెండింగ్ ఆర్టిఐ దరఖాస్తులపై సమీక్షించి, చట్టంపై అవగాహన కల్పించారని కలెక్టర్ తెలిపారు. ఆర్టిఐచట్టంపై అధికారులందరికి సమగ్రమైన అవగాహన కల్పించి పటిష్టంగా అమలు జరగాలని ఆర్టిఐ కమీషన్ లక్ష్యంగా పెట్టుకుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి అధికారి తన హక్కులు, బాధ్యతలు చట్ట పరంగా పాటించాల్సిన మార్గదర్శకాలను తెలుసుకొని సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్టిఐ చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో పూర్తి స్థాయిలో అమలు చేయాలని అన్నారు. ఆర్టిఐ కమీషనర్లు అందించిన సూచనలు, సలహాలను ఖమ్మం జిల్లాలోని ప్రజా సమాచార అధికారులు తూచా తప్పకుండా పాటించాలని, చిన్న చిన్న కారణాల వల్ల సమాచారం ఇవ్వని కేసులను త్వరగా డిస్పోజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయడం ద్వారా పాలనలో పారదర్శకత ఉంటుందని కలెక్టర్ తెలిపారు. సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు పైగా ఆర్టిఐ కమీషన్ లేని కారణంగా 15 వేలకు పైగా కేసులు పెండింగ్ పడ్డాయని అన్నారు. ప్రస్తుతం పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో ఆర్టిఐ కమీషన్ చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఆర్టిఐ చట్టం అమలులో నిర్లక్ష్యం వహిస్తే అనవసరపు అనుమానాలకు తావు ఉంటుందని అన్నారు. ఆర్టిఐ దరఖాస్తులను సకాలంలో డిస్పోజ్ చేయడం ద్వారా ప్రజలలో ఉన్న అనుమానాలు తీరి పోతాయని అన్నారు. ప్రపంచంలో భారత దేశం సమాచార హక్కు చట్టం అమలులో 8వ స్థానంలో ఉందని అన్నారు. మన దగ్గర ఉన్న సమాచారాన్ని నిబంధనల ప్రకారం అందించాలని అన్నారు. మన అధికారులు అనవసరంగా భయాందోళనలకు గురై సమాచారాన్ని దాచి పెట్టాల్సిన అవసరం లేదని అన్నారు. ఆర్టిఐ చట్టం అమలులో ప్రపంచంలో భారతదేశం మొదటి స్థానానికి చేరుకోవాలని మన దేశంలో తెలంగాణ రాష్ట్రం ప్రథమంగా సమాచార హక్కు చట్టం అమలు చేసే దిశగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సమాచార హక్కు చట్టం కమీషనర్ భూపాల్ మాట్లాడుతూ ఆర్టిఐ చట్టం ప్రజల్లోకి తీసుకుని వెళ్ళేందుకు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పని చేయాలని అన్నారు. సమాజంలోని ప్రతి వ్యక్తికి సమాచారం అడిగే హక్కు కల్పించిన వజ్రాయుధం ఆర్టిఐ చట్టం అని అన్నారు. ప్రతి ప్రజా సమాచార అధికారి ఆర్.టి.ఐ. చట్టంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 2005లో భారత ప్రభుత్వం సమాచార హక్కు చట్టం మన దేశంలో తీసుకొని వచ్చిందని అన్నారు. ప్రజా సమాచార అధికారి తప్పుడు సమాచారం అందించినా, ఆలస్యం చేసినా ఆర్టిఐ చట్టం ప్రకారం ఆర్టిఐ కమీషన్ వారిపై చర్యలు తీసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆర్టిఐ చట్టం నిబంధనలు తెలుసుకొని ప్రతి అధికారి పాటించాలని అన్నారు. అనంతరం ప్రజా సమాచార అధికారులకు ఆర్టిఐ చట్టం అమలులో ఉన్న సందేహాలను అడిగి నివృత్తి చేసారు. అనంతరం ఆర్టిఐ కమిషనర్లు వివిధ శాఖలలో ఉన్న పెండింగ్ కేసులపై శాఖ అధికారుల నుండి అప్పీలను స్వీకరించారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డి.ఎఫ్.ఓ. సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డిఆర్ఓ పద్మశ్రీ, జిల్లా అధికారులు, పౌర సమాచార అధికారులు, పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ జైదాస్ కథకు ముల్కనూరు సాహితీ పీఠం అవార్డ్



మధిర,ఆగస్టు1(మనం న్యూస్) : తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి చెందిన 'ముల్కనూరు సాహితీ పీఠం' వారి జాతీయ స్థాయి కథలపోటీలో ఈ ఏడాది మధిరకు చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జైదాస్ రాసిన 'మరో గాలివాన' అనే కథ ఎంపికయిం ది. ముల్కనూరు సాహితీ పీఠం వారి కథల పోటీకి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక అమెరికా, ఆఫ్రికా దేశాల నుండి కూడా వచ్చిన 417 కథల్లో 70 కథలు ఎంపికకాగా అందులో జైదాస్ కథ బహుమతికి ఎన్నిక యింది. జులై 27 న జరిగిన సభలో ములకనూ రు సాహితీ పీఠం అధిపతి వేముల శ్రీనివాసులు చే నగదు బాహుమతి అందజేసి ప్రశంసా పత్రంతో సత్కరించా రు. ఇప్పటికే కార్టూనిస్టుగా మంచి గుర్తింపు పొందిన జైదాస్ ఇటీవలనే తన కార్టూన్లను 'జైదాస్ జాయ్ టూన్స్' అనే పుస్తకరూపంలో తీసుకొచ్చారు. దానిని తెలుగు కార్టూనిస్టుల దినోత్స వం రోజున హైదరాబాద్ రవీంద్రభారతిలో హాస్యానం దం పత్రిక ఎడిటర్ రాము కార్టూనిస్ట్ బాచి ఆధ్వర్యం లో ప్రముఖ సినీన టులు రాజేంద్రప్రసాద్ తనికెళ్ళ భరణి ఆవిష్కరించారు.

# దోపిడీదారులకు ఎర్రజెండా అంటే వణుకు..

- త్యాగాలు పోరాటాలతో పుట్టిందే సీపీఐ పార్టీ...
- ప్రశ్నించే వారందరూ కమ్యూనిస్టులే...
- సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు..
- కల్వకుర్తిలో అట్టహాసంగా సీపీఐ పార్టీ జిల్లా మహాసభలు..




**కల్వకుర్తి ఆగస్టు 01(మనం న్యూస్):** దోపిడిదారులకు ఎర్రజెండా అంటే వణుకు అని,ప్రశ్నించే వారందరూ కమ్యూనిస్టులేనని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో సీపీఐ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా మహాసభలు అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని గచ్చుబావి నుండి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణం వరకు సీపీఐ పార్టీ నాయకులు భారీ ప్రదర్శన ర్యాలీతో చేరుకున్నారు.ఈ కార్యక్రమానికి సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహ, లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.అనంతరం సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ త్యాగాలతో ఎర్రజెండ పుట్టిందని,ఎర్రజెండాను అంతం చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని ఇప్పటికే 100 ఏళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ పార్టీ 100 ఏళ్లు కాదు మానవ సమాజ ఉన్నంతవరకు ఎర్రజెండా ఉంటుందన్నారు. దేశంలో ఫ్యాక్షనిస్టుల మాదిరి పాలన కొనసాగుతుందని ఆయన విమర్శించారు.ప్రశ్నించే ప్రతి గొంతులోనూ కమ్యూనిస్టు ఉన్నాడని ప్రశ్నించే వారందరూ కమ్యూనిస్టులేనని,ఎర్ర జెండాకు తల్లిపార్టీ సీపీఐ యేనని ఆశాభావం వ్యక్తం చేశారు.పోరాటాలు త్యాగాలు ప్రజల కోసం కొట్లాడి కేసులలో ఉన్న నాయకులు సీపీఐ పార్టీ నాయకులేనని కమ్యూనిస్టు పార్టీ అంటే దేశ ప్రజల కోసం పనిచేస్తుందన్నారు.దేశంలో మహిళా సంఘాలు దళితుల సంక్షేమం సబండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పోరాడింది సీపీఐ పార్టీ అని అన్నారు.కమ్యూనిస్టుల ప్రతిపాదనలతోనే రాజ్యాంగంలో అనేక చట్టాలు పొందుపరిచారని కమ్యూనిస్టులు లేకపోతే పేదలకు ఏ చట్టం లేదని ఆయన గుర్తు చేశారు. సమాజానికి మార్గం చూపించే ఏకైక పార్టీ సీపీఐ అని ప్రపంచవ్యాప్తంగా కనిపించే జెండా ఎర్రజెండానని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ సీపీఐ పార్టీ అని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాల్లో పోటీ చేసి గెలుపొందాలన్నారు. ఎర్రజెండాలు ఒకే తాటిపై పోరాటం చేస్తే అధికారంలో పైచేయి మనదేనని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రానికే కాదు దేశానికి బీజేపీ అత్యంత ప్రమాదకర పార్టీ అని విమర్శించారు.

**సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి....**

పేదోడి ఆనందమే కమ్యూనిస్టు పార్టీకి అధికారమని సీపీఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు.వందేళ్ల పాలనలో సీపీఐ పార్టీ అనేక పోరాటాలు చేసిందని బ్రిటిష్ పాలన కాలంలోనే 550 సంస్థానాలలో పోరాటం చేసిందని, దున్నేవాడిదే భూమి అనే నినాదంతో పేదలకు విద్య వైద్యం కూడు గూడు సాధించిన ఘనత ఎర్రజెండాదేనన్నారు.బీజేపీ పాలనలో ఆదాని, అంబానీ ఆస్తులు పెరిగాయని దొంగలకు కార్పొరేట్ సంస్థలకు అండగా బీజేపీ ప్రభుత్వం ఉందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వాలు ఈజీఎస్ పథకంలో కూడా పేదలకు గండి కొడుతున్నారని విమర్శించారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేసి ఉప కాలువలను పూర్తిచేయాలని లేని పక్షంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గం కార్యదర్శి పులిజాల పరుశురాము లు, నాయకులు ఆనంద్,వార్ల వెంకటయ్య, భరత్, విజయుడు, విజయ రామారావు, కేశవులు, ఫయాజ్, ఏసయ్య, హుస్సేనయ్య ఇందిరమ్మ, శ్రీనివాసులు,శివశంకర్, దార దాసు,ఆయా మండలాల కార్యదర్శులు, అనుబంధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

## ముడా నిధులతో పార్కు నిర్మాణ పనుల కోసం శంకుస్థాపన..



- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్, ఆగస్టు 01(మనం న్యూస్):** పట్టణంలో ఊహించని రీతిలో అభివృద్ధి జరుగుతుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని భగీరథ కాలనీ లో 20 లక్షల రూపాయల ముడా నిధులతో నూతనంగా నిర్మించనున్న పార్క్ నిర్మాణపు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ గా ఉన్న మహబూబ్ నగర్ ను మున్సిపల్ కార్పొరేషన్ గా అభివృద్ధి చేసుకోవడం జరిగిందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అత్యధిక సంఖ్యలో నిధులు తెచ్చి మహబూబ్ నగర్ ను అద్భుతంగా అభివృద్ధి చేస్తామని, మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రతి డివిజన్ లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, అజ్మత్ అలి, నాయకులు కృష్ణకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ప్రశాంత్ , తిరుమల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

- ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి..
- సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..
- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్ నగర్, 01 ఆగస్టు, (మనం బ్యూరో):** డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు.శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ పట్టణంలోని సుభాష్ నగర్ వార్డ్ నెంబర్ 47 లో డ్రై డే సందర్భంగా ఇంటింటా పరిసరాలను పరిశీలించారు. డెంగ్యూ సోకిన ఇంటిని, పరిశీలించి డెంగ్యూ సోకిన బాలిక తో కలెక్టర్ మాట్లాడారు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స చికిత్స తీసుకున్నట్లు,ఇప్పుడు బాగానే ఉందని బాలిక కలెక్టర్ కు తెలియ చేశారు.డెంగ్యూ వచ్చిన ఇంటి పరిసరాలు సందర్శించి తగు సూచనలు చేశారు. .ఇంటి వెనుక వినియోగించని వాష్ రూం లు అందులో చెత్త,నీరు నిల్వ ఉండడం గమనించి వాటిని తొలగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ను ఆదేశించారు.ఇంటిలో వాటర్ సంపును పరిశీలించారు.స్థానిక ప్రజలతో మాట్లాడుతూ ప్రజలు డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. వైద్య ఆరోగ్య , శానిటేషన్ సిబ్బంది అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ శానిటేషన్, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహించరాదు..




- జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు
- జిల్లా ఎస్పీ డి. జానకి

**మహబూబ్ నగర్, ఆగష్టు 01 (మనం బ్యూరో):** జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతత ను పెంపొందించేందుకు 01-08-2025 నుండి 31-08-2025 వరకు, జిల్లా అంతటా 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.జానకి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ 30 పోలీస్ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్ లను మరియు జనసమూహం ప్రోగు అవుట వంటివి నిషేధం. రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం. లౌడ్ స్పీకర్ లు, డీజే లు వంటివి కూడా ఈ సమయంలో నిషేధము. నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ ఆక్ట్ 1861 కింద శిక్షార్హులు అగుదురని ఎస్పి పేర్కొన్నారు.

## ప్రతి డివిజన్‌లో సమాంతరంగా అభివృద్ధి..

- ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి..



**మహబూబ్ నగర్, ఆగస్టు 01 (మనం న్యూస్)**నగర పురపాలక సంస్థ పరిధిలోని ప్రతి డివిజన్ లో సమాంతరంగా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ లో 10 లక్షల రూపాయల ముడా నిధులతో పార్కు పునరుద్ధరణ పనులకోసం మరియు 12 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న మహిళా జిమ్ నిర్మాణపు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా జరగని అభివృద్ధి పనులు కేవలం ఈ 16 నెలల్లోనే శరవేగంగా జరుగుతున్నాయని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, అజ్మత్ అలి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు రామాంజనేయులు, ఖాజా పాషా, రాషెద్ ఖాన్, అచ్చుగట్ల అంజయ్య, నాయకులు రమేష్ యాదవ్, రాములు బచ్చన్న, చర్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి సిబ్బంది కృషి అవశ్యం

### మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ సంధ్య....

### కల్వకుర్తి మున్సిపాలిటీ 100 రోజుల ప్రణాళిక పనుల పరిశీలన....







**కల్వకుర్తి ఆగస్టు 01(మనం న్యూస్):** మున్సిపాలిటీ అభివృద్ధికి సిబ్బంది శక్తి వంచన లేకుండా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ సంధ్య సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 100 రోజుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా శుక్రవారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల కార్యక్రమాలను మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ సంధ్య,మున్సిపాలిటీ కమీషనర్ షేక్ మహమూద్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని మహాత్మా జ్యోతిరావు బాలికల కళాశాలలో కల్వకుర్తి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ సంధ్య పాల్గొని మొక్కలు నాటారు.అనంతరం ఆమె కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ జాయిన్ డైరెక్టర్ సంధ్య కల్వకుర్తి మున్సిపాలిటీ కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని బకాయి ఆస్తి పన్నులను 100% వసులు చేయాలని పేర్కొన్నారు.మున్సిపాలిటీలోని వ్యాపార సముదాయలకు అధికారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ లను ఇవ్వాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.అనంతరం మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మాణాలు చేపట్టిన మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. అదేవిధంగా డిఆర్ సిసి కేంద్రాన్ని సందర్శించి తడి చెత్త పొడి చెత్తలను వేరు చేసే విధానంతో పాటు తడి చెత్తతో కంపోస్టింగ్ చేసే విధానంపై మున్సిపాలిటీ సిబ్బందికి ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎఈ షబ్బీర్ అహ్మద్,మేనేజర్ రాజకుమారి నోరి,సానిటరీ ఇన్స్పెక్టర్ రంగన్న,మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ యామిని,వార్డు ఆఫీసర్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు.

## అధికారులు హుషారు..

# ఇసుక కరువు..

### మండలంలో శరవేగంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు

### పైలట్ ప్రాజెక్ట్ గ్రామం కొత్తతండాలో పలు ఇండ్లు పూర్తి

### ఇసుక కొరతతో కాస్త నెమ్మదిస్తున్న నిర్మాణ పనులు



**కారేపల్లి, ఆగస్టు 01(మనంన్యూస్):** ప్రభుత్వం అందిస్తున్న ఐదు లక్షల రూపాయల ఆర్థిక ప్రోత్సాహంతో పేదవాడి సొంతింటి కల నెరవేరుతున్నది. గత ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన డబల్ బెడ్రూమ్ ఇండ్లు ఆశించిన స్థాయిలో పేదవాళ్ళను సంతృప్తి పర్చకపోగా,ఈ ప్రభుత్వంపై ఇళ్ల భారం పెంచింది. ఇప్పటికే ప్రభుత్వం విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పేదవాళ్లకు పంపిణీ చేస్తూ వస్తున్నది. ఈ క్రమంలో సింగరేణి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ కోటాలో రెండు విడతల్లో అధికారులు 690 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారు. వీటిలో 509 ఇండ్లు ఇప్పటికే నిర్మాణంలో ఉండగా మిగతా ఇండ్లకు త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకున్న గ్రామం కొత్తతండాలో 13 ఇండ్లు మంజూరు చేయగా ఈ ఇండ్ల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.ఐదు ఇండ్ల వరకు గృహప్రవేశానికి సిద్ధమయ్యాయి. మిగతా ఇండ్లు కూడా త్వరలోనే ప్రవేశానికి సిద్ధం కానున్నాయి. అదేవిధంగా మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. త్వరలోనే ఐటిడిఏ ద్వారా 390 ఇండ్లు,మినిస్టర్ కోటాలో మరో 250 ఇండ్లు మంజూరు కానున్నాయి.

**విడతల వారీగా డబ్బులు జమ**

ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం విడుదలవారీగా నిధులు మంజూరు చేస్తూ వస్తున్నది. బేస్మెంట్ లెవెల్ లో రూ.లక్ష రూపాయలు, సన్ సైడ్ లెవెల్ లో రూ.లక్ష రూపాయలు,స్లాబ్ స్థాయిలో రూ.రెండు లక్షల రూపాయలు, ఇంటికి రంగులు వేసిన అనంతరం చివరగా లక్ష రూపాయలు మంజూరు చేస్తున్నారు. ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో శాశ్వతమైన గూడులేని ఎంతోమంది నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం పట్ల పేదలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

**వేధిస్తున్న ఇసుక కొరత**

ఓవైపు సింగరేణి మండల అధికారుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నా,మరోవైపు ఉన్న ఇసుక లభ్యత కొరత కారణంగా నిర్మాణ పనులు కాస్త నెమ్మదిగా సాగుతున్నాయి.వైరా పరిధిలో కేటాయించిన ఇసుక రీచ్ ద్వారా నాణ్యమైన ఇసుక లభించడం లేదని పలువురు లబ్ధిదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా ప్రత్యామ్నాయ ఇసుక రీచ్ లు అయిన ఆళ్లపల్లి,అనిశెట్టిపల్లి నుంచి ఇసుకను అందజేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలను శిరసావహించి సింగరేణి ఎమ్మార్వో రమేష్, ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్ ఇసుక లభ్యత గురించి అనిశెట్టిపల్లి వెళ్ళి తెలుసుకోగా ఇసుక నిల్వలు లభించడం లేదు.మరోవైపు వాగు ప్రవాహం ఉండడంతో ఇసుక లభ్యమయ్యే పరిస్థితి లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా ఉన్న ముదిగొండ మండలం పెద్దమడవ ఇసుక రీచ్ ద్వారా ఇసుకను తెప్పించేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నారు.మరోవైపు ఇండ్ల నిర్మాణానికి అవసరమయ్యే నిధులు కూడా సకాలంలో మంజూరు కావడంలేదని పలువురు లబ్ధిదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్యం పెట్టుకొని పనిచేస్తున్నాం, ధారావత్ నాగేందర్, హౌసింగ్ ఏఈ ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రతి ఇంటి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నాం.లక్ష్యం పెట్టుకుని పనిచేస్తున్నాం.విడతల వారీగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నాం.నిధులు కూడా విడతల వారీగా విడుదల అవుతున్నాయి.

ఎంపిడిఓ



**ఇసుక కొరతను అధిగమిస్తాం: మల్లెల రవీంద్రప్రసాద్, ఎంపీడీవో(ఎఫ్ఏసి)**

సరిపడ ఇసుక నిల్వలు లేకపోవడంతో లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కాస్త ఆలస్యం అవుతున్నది.సమస్యపై ఇప్పటికే ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగింది.ఇసుక సమస్యను అధిగమించి త్వరలోనే ఇంటి నిర్మాణాలు పూర్తి చేస్తాం

# నవీపేట్ మండలంలో కలెక్టర్ పర్యటన

**నిజామాబాద్, ఆగస్టు 01 (మనం బ్యూరో) :** నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి దరఖాస్తుల వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. నవీపేట తహశీల్దార్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆశించిన రీతిలో దరఖాస్తుల పరిష్కారం జరగడం లేదన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పదేపదే చెబుతున్నా జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. వేగవంతంగా పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. సమస్యలను పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. సీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలను పెంచాలని కలెక్టర్ సూచించారు. ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్, ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సినేషన్ రూం, ఆయుష్ విభాగం, ఆపరేషన్ థియేటర్



తదితర విభాగాలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యాక్సినేషన్, గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు నూరు శాతం జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, కేంద్రాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. అలాగే నవీపేట, దర్యాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు ఉండాలని, పరిశుభ్రతను పాటించాలని ఆదేశించారు. దర్యాపూర్ పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చి వేయించాలని, ప్రహరీ, టాయిలెట్ మరమ్మతుల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ప్రతిపాదనలు సమర్పించాలని పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోడౌన్, ప్రైవేటు విక్రయ కేంద్రాలను సందర్శించి నిల్వలను పరిశీలించారు. అవసరాలకు సరిపడా ఎరువులు అందిస్తున్నారా.. అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ వెంకటరమణ, ఏవో నవీన్, వెటర్నరీ డాక్టర్ నరేందర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులున్నారు.

# నేడు ఆర్మూర్‌కు జనహిత పాదయాత్ర





- **కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాక**

**నిజామాబాద్, ఆగస్టు 01(మనం బ్యూరో) :** కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత పాదయాత్ర నేడు ఆర్మూర్ కు చేరుకోనుంది. నియోజకవర్గంలోని ఆలూరు మండల కేంద్రం నుంచి ఈ పాదయాత్ర ప్రారంభమై గగ్గుపల్లి, ఇస్సాపల్లి గ్రామాల మీదుగా ఆర్మూర్ పట్టణానికి చేరుకుంటుంది. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగనుంది. ఈ పాదయాత్రలో ప్రజల సమస్యలపై వినతులను ఆమె స్వీకరించనున్నారు. పాదయాత్ర అనంతరం పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలోని సీ కన్వెన్షన్ హాల్‌లో మీనాక్షి నటరాజన్ బస చేయనున్నారు. ఆదివారం ఉదయం పట్టణంలో హౌసింగ్ బోర్డు కాలనీలో గల గురుకుల కళాశాలలో శ్రమదానం నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఆర్మూర్ పట్టణ శివారులోని యమునా ఫంక్షన్ హాల్‌లో జరిగే ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె పాల్గొంటారు. ఆర్మూర్‌లో జరిగే పాదయాత్రకు కాంగ్రెస్ ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, కార్పొరేషన్ల ఛైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి, ఆర్మూర్, బాల్కొండ నియోజవర్గ ఇన్‌ఛార్జీలు వినయ్ రెడ్డి, సునీల్ రెడ్డితో పాటు పార్టీ ముఖ్య నేతలు నాయకులు పాల్గొననున్నారు. పట్టణంలోని పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో శ్రమదాన స్థలాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా ఆదివారం రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ మొక్కలు నాటనున్నందున పరిసరాలను పరిశీలించినట్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, కాంగ్రెస్ నేతలతో కలిసి పరిశీలించారు.

# సిద్ధ రామేశ్వర స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు

**బిక్కనూరు, ఆగస్ట్ 01(మనం న్యూస్):** బిక్కనూరు మండల కేంద్రంలోని దక్షిణ కాశీగా పేరుగాంచిన, భక్తులకు కొంగు బంగారమైన శ్రీ సిద్ధరామేశ్వర స్వామి స్వయంభూ లింగ మహాక్షేత్రంలో శుక్రవారం హుండీ లెక్కింపు కొనసాగింది. ఉండి లెక్కింపులో 4,20,700 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., 70 రోజుల వ్యవధిలో భక్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. శ్రావణమాసం ప్రారంభమైన నేపథ్యంలో ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతున్నదని తెలిపారు. ప్రతి సోమవారం భక్తులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని, మిగతా రోజులలో దేవాదాయ శాఖ ద్వారా అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో ఇప్పటివరకు అభిషేకాలు, అర్చనలు, స్వామివారి ప్రత్యేక దర్శనాలు, భక్తులచే కోడెదూడలను కట్టేయడం, స్వామివారికి అన్న పూజలు, అమ్మవారికి కుంకుమార్చన, ఒడిబియ్యం, గండ దీపాలు, భక్తాదుల పుట్టు వెంట్రుకలు, దీక్షలు వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. శ్రావణమాసం సందర్భంగా ఇప్పటివరకు సుమారు 10వేల



మంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నట్లు వివరించారు. రానున్న రోజుల్లో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలిపారు. స్వామివారిని దర్శించుకునే భక్తులకు అన్ని రకాల వసతులు ఆలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు కొడగండ్ల రామగిరి శర్మ, న్యాలకంటి రాజేశ్వర శర్మ, కైలాస్ సిద్దేశ్వర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ మాజీ చైర్మన్ అందే మహేందర్ రెడ్డి, పరిశీలకురాలు కమల, గ్రామ పెద్దలు లింబాద్రి, ఆంజనేయులు, చికోటి నాగభూషణం, పెద్ద ఎత్తున మహిళలు, తదితరులు పాల్గొన్నట్లు ఈ సందర్భంగా ఈవో శ్రీధర్ తెలిపారు.



# 77వ సారి డాక్టర్ బాలు రక్తదానం

- **రక్తదానం చేసే వారికి క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువ**
- **డాక్టర్ బాలు**

**కామారెడ్డి టౌన్, ఆగస్టు 01 (మనం న్యూస్) :** రక్తదానం చేసే వారికి క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ కామారెడ్డి జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ వైద్యశాలలో ఆయన 77వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ., రక్తదానం చేయడం అంటే తోటి వారి ప్రాణాలను కాపాడడం మాత్రమే కాకుండా రక్తదానం చేసిన వారికి ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం గుండె సంబంధిత, కొలెస్ట్రాల్, క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని రక్తదానం చేయడానికి ఇప్పటికీ సమాజంలో కొంతమంది వెనకడుగు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్తదానం పట్ల ఉన్న అపోహలను విడనాడి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్, ఉపాధ్యక్షులు పర్ష వెంకటరమణ, టెక్నీషియన్ ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

# నెల రోజుల్లో 68 మంది బాల బాలికల గుర్తింపు

- **ఎస్పీ రాజేష్ చంద్ర**



**కామారెడ్డి, ఆగస్టు 01(మనం జిల్లా ప్రతినిధి) :** ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా జిల్లాలో 68 మంది బాల బాలికలను గుర్తించడం జరిగిందని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 68 మందిలో 30 మంది బాల కార్మికులు ఉండగా 38 మంది బడిబయటి పిల్లలు ఉన్నారని, ఇందులో 59 మంది బాలురు, 9 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం ఏడాదిలో రెండుసార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించిందని ఎస్పీ పేర్కొన్నారు. దీంట్లో భాగంగా తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఈ ఏడాది జులై 1 నుండి 31 వరకు పోలీస్ శాఖ, చైల్ వెల్ఫేర్, లేబర్, ఎడ్యుకేషన్, చైల్ ప్రొటెక్షన్, రెవెన్యూ, హెల్త్, వివిధ శాఖల అధికారులతో జిల్లాలో టీంలుగా ఏర్పాడ్డామన్నారు. ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా 68 మంది బాలబాలికలను గుర్తించి సీడబ్ల్యూసీ ముందు వారిని హాజరుపర్చామని వివరించారు. తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి పిల్లలను అప్పగించినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 8 కేసులు నమోదు చేశామన్నారు. తరుచూ బాలల చేత పనులు చేయిస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. వీధి బాలలను చూసినప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేయడానికి సహకరించిన అన్ని శాఖల అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## జాతీయం- అంతర్జాతీయం

# అసెంబ్లీలో రమ్మీ ఆడిన మంత్రికి క్రీడల శాఖ

### విమర్శలకు పదునుపెట్టిన విపక్షాలు

**ముంబయి, ఆగస్టు 1 :** మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి దుమారం చెలరేగింది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా మహారాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న మాణిక్‌రావ్ కోకాటెకు క్రీడల శాఖ కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. 'అసెంబ్లీలో రమ్మీ ఆడినందుకేనా ఆయనకు క్రీడల శాఖ' అప్పగించారంటూ విపక్షాలు విమర్శలకు పదునుపెడుతున్నాయి. గత నెలలో అసెంబ్లీ వర్షాకాల



సమావేశాలు జరుగుతున్న సమయంలో మాణిక్ రావ్ కౌన్సిల్లో కూర్చొని మొబైల్లో రమ్మీ ఆడటం వైరల్గా మారిన సంగతి తెలిసిందే.

అలాంటి వ్యక్తిపై చర్యలు తీసుకోవడం మానేసి క్రీడల శాఖ అప్పగించడం రివార్డు ఇచ్చినట్లుగా ఉందని విపక్షాలు మండిపడుతున్నాయి. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కీలుబొమ్మగా మారిపోయారని, అంతా అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీయే ఆడిస్తోందని ఎద్దేవా చేశాయి. మరోవైపు మాణిక్‌రావ్ మార్పుతో ఖాళీ అయిన వ్యవసాయ శాఖను దత్తాత్రేయకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఇద్దరు నేతలూ ఎన్సీపీకి చెందిన వారే కావడం విపక్షాల విమర్శలకు మరింత తావిచ్చినట్లయింది. క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకొనే డిప్యూటీ సీఎం అజిత్ పవార్.. మాణిక్‌రావ్ కొకాటేను రాజీనామా చేయాలని అడగాల్సింది పోయి.. ప్రమోషన్‌లా క్రీడాశాఖ కేటాయించారంటూ ఎన్సీపీ (ఎస్పీ) అధికార ప్రతినిధి క్లైడ్ క్రాస్టో విమర్శించారు.

"మాణిక్‌రావును మంత్రిగా కొనసాగించడం ఎంత సిగ్గుచేటు. ఆయన్ని మంత్రి వర్గం నుంచి తొలగించాల్సింది పోయి.. మరో ఫోర్ట్‌పోలియో అప్పగించారు. అసెంబ్లీలో బాగా రమ్మీ ఆడినందుకేనేమో ఆయనకు క్రీడల శాఖ కేటాయించారు. ఆయన రమ్మీని ఒలింపిక్ క్రీడల్లో చేర్చాలని సిఫార్సు చేస్తారేమో? బాగా ఆడినవారికి అవార్డు కూడా ఇస్తారేమో?" అంటూ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ ఎద్దేవా చేశారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేసినంత మాత్రాన ప్రభుత్వంపై ఏర్పడిన మచ్చ తొలగిపోదని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ విమర్శించారు. శివసేన, ఎన్సీపీ నుంచి మంత్రి పదవులు చేపట్టిన వారంతా సీఎం ఫడ్నవీస్‌కు భారంగా మారారని, వారిని ఎప్పుడు తొలగించుకుందామా? అని ఆయన ఎదురు చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాణిక్‌రావ్‌పై వ్యతిరేకత వ్యక్తమవుతోందని.. కానీ డిప్యూటీ సీఎం అజిత్‌పవార్ ఆయన్ని వెనకేసుకొస్తున్నారని రౌత్ తెలిపారు. మంత్రి మాణిక్‌రావ్ ఆ పదవి నుంచి వైదొలగక తప్పదన్నారు.

# ఫేక్ పెండ్లిపిల్ల అరెస్టు

### ఎనిమిది మందిని పెళ్లాడి.. తొమ్మిదో పెళ్లి కోసం ప్రయత్నించి..!

**నాగపూర్, ఆగస్టు, 1 :** పెళ్లికాని డబ్బున్న వ్యక్తులే ఆమె లక్ష్యం. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో వారి వివరాలు సేకరిస్తుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడుతుంది. ఆ తర్వాత తనకు విడాకులయ్యాయని, ఓ బిడ్డ కూడా ఉన్నట్లు అవతలి వాళ్లకు ఎమోషనల్‌గా దగ్గరవుతుంది. చివరికి వివాహం చేసుకుంటుంది. ఇలా ఒకటి, రెండు కాదు.. ఏకంగా 8 పెళ్లిళ్లు చేసుకుంది. తొమ్మిదో పెళ్లి కోసం పావులు కదుపుతూ పోలీసులకు చిక్కింది. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన ఆమె బాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది.



పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సమీరా ఫాతిమా ఉపాధ్యాయిని. ఎక్కువగా డబ్బు సంపాదించేందుకు ఆమె తప్పుడు మార్గాన్ని ఎంచుకుంది. వయస్సు మీదపడుతున్నా పెళ్లికాని ధనవంతులను లక్ష్యంగా చేసుకుంది. సామాజిక మాధ్యమాల్లో వారికి దగ్గరై.. విధిలేని పరిస్థితుల్లో విడాకులు తీసుకోవాల్సి వచ్చిందని, ఓ బిడ్డతో కలిసి ఒంటరిగా ఉంటున్నట్లు చెబుతుంది. చివరికి ముగ్గులో దించి పెళ్లి చేసుకుంటుంది. కొన్ని రోజులు గడిచాక.. పథకం ప్రకారం వారి నుంచి డబ్బు డిమాండ్ చేస్తుంది. అవసరమైతే బెదిరించి బలవంతంగా వసూలు చేసేందుకు ఆమెకు ప్రత్యేక గ్యాంగ్ కూడా ఉంది. ఇలా గత 15 ఏళ్లల్లో 8 పెళ్లిళ్లు చేసుకొని వారి నుంచి భారీ మొత్తంలో డబ్బు గుంజుకుంది.

సమీర తన నుంచి రూ.50 లక్షలు బలవంతంగా వసూలు చేసిందని ఆమె భర్తల్లో ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఆమె బాధితుల్లో రిజర్వ్‌బ్యాంక్ సీనియర్ అధికారులు కూడా ఉండటం గమనార్హం. అయితే, 8 మంది భర్తల నుంచి డబ్బులు వసూలు చేసిన నిందితురాలు.. మరో పెళ్లి చేసుకునేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో జులై 29న నాగపూర్‌లోని ఓ టీ దుకాణం వద్ద ఆ వ్యక్తిని కలిసేందుకు వచ్చిన ఆమెను.. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# బీహార్ ఓటరు ముసాయిదా జాబితా విడుదల

**ఢిల్లీ ఆగస్టు, 1 :** బీహార్లో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న కేంద్ర ఎన్నికల సంఘం.. ఇటీవల రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ ప్రక్రియ అనంతరం ఓటరు ముసాయిదా జాబితాను ఈసీ శుక్రవారం విడుదల చేసింది. దీన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు అందజేసింది. అయితే, ప్రస్తుతానికి ఈ ముసాయిదా జాబితాలో చేర్చిన వివరాలు ఇంకా వెబ్‌సైట్‌లో పూర్తిగా అందుబాటులోకి రాలేదు. కానీ, ఓటర్లు ఈసీ వెబ్‌సైట్‌లో తమ పేర్లను చెక్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాధారణ ఓటర్లు ఈ జాబితాను చూడొచ్చని ఈసీ తెలిపింది.




ఈ జాబితాలో సవరణలకు నెల రోజుల (సెప్టెంబరు 1 వరకు) గడువు కల్పించారు. అర్హులైన వ్యక్తుల పేర్లను జాబితాలో చేర్చడానికి, అనర్హులుగా భావించినవారి పేర్లను తొలగించడానికి పౌరులు, రాజకీయ పార్టీలు ఈలోగా ప్రతిపాదనలు చేయొచ్చని అధికారులు స్పష్టంచేశారు. ముసాయిదా జాబితాను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో.. గుర్తింపు పొందిన పార్టీలకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణకు ముందు రాష్ట్రంలో 7.93 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ సవరణ చేపట్టగా.. కీలక విషయాలు బయటపడిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో 52 లక్షల మంది ఓటర్లు సంబంధిత చిరునామాల్లో లేరని వెల్లడైంది. 18 లక్షల మంది ఓటర్లు చనిపోగా, 26 లక్షల మంది ఇతర నియోజకవర్గాలకు మారినట్లు ఈసీ తెలిపింది. మరో ఏడు లక్షల మంది ఓటర్లు రెండుచోట్ల ఓటు నమోదు చేసుకున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. అయితే, ఈ సమగ్ర సవరణను కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఓటర్లను తొలగిస్తున్నారని దుయ్యబట్టాయి. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం అత్యున్నత న్యాయస్థానం వద్ద పెండింగ్‌లో ఉంది.

### పహల్గాం తర్వాత కశ్మీర్ అడవుల్లో జల్లెడ

# 100 రోజుల్లో 12 మంది ఉగ్రవాదులు హతం

**జమ్ము, ఆగస్టు 1 :** పహల్గాం దాడి తర్వాత భద్రతా బలగాలు ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నాయి. వరుస ఆపరేషన్లలో ఉగ్రవాదులను మట్టుపెడుతున్నాయి. ఆ దాడి జరిగి 100 రోజులు కాగా.. ఇప్పటివరకు 12 మంది ఉగ్రవాదులను భద్రతా బలగాలు హతమార్చాయి. వారిలో ఆరుగురు పాకిస్థానీ ఉగ్రవాదులు ఉన్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మిగిలిన ఆరుగురికి కూడా



జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడులతో సంబంధం ఉందని పేర్కొన్నాయి. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి జరిగింది. దానికి భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో దీటుగా బదులిచ్చింది. అది మే7న ప్రారంభమైంది. ఉగ్రవాదులను జల్లెడ పట్టేందుకు పలు ఆపరేషన్లను నిర్వహించింది. వాటిలో మహాదేవ్ ఎంత కీలకమైందో తెలిసిందే. ఆ ఆపరేషన్‌లోనే పహల్గాం ఘటన బాధ్యులు హతమయ్యారని కేంద్రం ప్రకటించింది. మరోవైపు జరిగిన శివశక్తి ఆపరేషన్లో మరో ఇద్దరు హతమయ్యారు. "ఎన్ని ఆపరేషన్లు జరుగుతున్నాయో చెప్పడం కష్టం. జమ్మూకశ్మీర్‌లోని అన్ని యూనిట్లు ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నాయి" అని ఆ వర్గాలు మీడియాకు వెల్లడించాయి. మే 15న షోపియాన్‌లోని కెల్లర్ అడవుల్లో మరో ముగ్గురు, నాదెర్ ప్రాంతంలో ఇంకో ముగ్గురు ఉగ్రవాదులను మట్టుపెట్టారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పహల్గాం కుట్రదారులను, ఆపరేషన్ మహాదేవ్ ద్వారా నాటి ఊచకోతలో పాల్గొన్న ముష్కరులను హతమార్చామని ఇటీవల పార్లమెంట్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ సిందూర్‌లో భారత దళాలు.. సరిహద్దు నుంచి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాక్ లక్ష్యాలపై దాడి చేశాయని చెప్పారు. మన బలగాలు విసిరిన పంజా దెబ్బకు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. పహల్గాం ఘటనకు ముందు పీఓకేలోని 42 లాంచ్ ప్యాడ్లలో 110 నుంచి 130 మంది వరకు ఉగ్రవాదులు ఉన్నారని నిఘా వర్గాలు వెల్లడించాయి. కశ్మీర్లో 70 నుంచి 75 మంది చురుగ్గా ఉన్నారని, జమ్ము, రాజౌరీ, పూంచ్‌లలో 60 నుంచి 65 మంది ఉగ్రవాదుల కదలికలను గుర్తించినట్లు పేర్కొన్నాయి.

# ప్రభుత్వ పథకాల్లో బతికున్న వాళ్ల పేర్లు, ఫొటోలు వాడొద్దు: మద్రాస్ హైకోర్టు



**చెన్నై, ఆగస్టు 1 :** సంక్షేమ పథకాల్లో వాడే పేర్ల విషయంలో తమిళనాడు ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా తీసుకువచ్చే ప్రజా సంక్షేమ పథకాల్లో జీవించి ఉన్న నేతల పేర్లు వాడొద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే వాటి గురించి ప్రచారం చేసేటప్పుడు మాజీ ముఖ్యమంత్రుల చిహ్నాలు, డీఎంకే పార్టీ గుర్తులు, జెండాను ఉపయోగించకుండా నిషేధించింది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అన్నాడీఎంకే పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై మద్రాస్ హైకోర్టులో తాజాగా విచారణ జరిగింది. 'ఉంగలుదాన్ స్టాలిన్' పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న ప్రచార కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పేరును ఉపయోగించడాన్ని షణ్ముగం సవాల్ చేశారు. ఈ అంశంపై తాము ఇచ్చిన ఉత్తర్వులు ఏ ప్రభుత్వ పథకం ఆవిష్కరణ, అమలుకు అడ్డంకి కాబోదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అలాగే ఈ వ్యాజ్యంపై రాష్ట్ర ప్రభుత్వం, డీఎంకే పార్టీ తమ స్పందనలు తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చింది.

# డిసెంబర్ చివరినాటికి థర్మల్ పవర్ స్టేషన్ లోని అన్ని యూనిట్లు పూర్తి చేస్తాం

**2026 జనవరి నుండి పూర్తిస్థాయి విద్యుత్ అందిస్తాం**

**పవర్ ప్లాంట్ ఆవరణలో డిపివి పాఠశాలలు ఏర్పాటు చేయాలి**

**800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన ఒకటవ యూనిట్ ను జాతికి అంకితం చేసిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క**

**వైటీపీఎస్ లో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్షిప్ పనులకు శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి**










**మిర్యాలగూడ, ఆగస్టు 1(మనం న్యూస్):** ఈ డిసెంబర్ చివరి నాటికి యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లోని అన్ని యూనిట్లను పూర్తిచేసి 2026 జనవరి నుండి పూర్తిస్థాయిలో విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి బట్టి విక్రమార్కమల్లు తెలిపారు. ఇందుకుగాను నిర్దేశించిన క్యాలెండర్ ప్రకారం పని చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇదివరకే రూపొందించిన క్యాలెండర్ ను తూ.చా తప్పకుండా పాటించాలన్నారు.

శుక్రవారం ఆయన రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అట్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి లతో కలిసి నల్గొండ జిల్లా, దామరచర్ల మండలం, వీర్లపాలెం వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్లో 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన స్టేజ్ -1 లోని ఒకటవ యూనిట్ జాతికి అంకితం చేశారు. అంతేకాక 970 కోట్ల రూపాయలతో వై టి పి ఎస్ ఆవరణలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్షిప్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే వనమెత్సవం కింద మొక్కలు నాటారు.

అనంతరం వైటిపిఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలో గా అన్ని యూనిట్ల ద్వారా విద్యుత్ అందించేందుకు వైటిపిఎస్ అధికారులు పనులను ప్రాధాన్యత క్రమంలో విభజించుకోవాలన్నారు .సంవత్సర కాలంలోనే స్టేజ్ వన్ లోని రెండు యూనిట్లను పూర్తి చేసి విద్యుత్ అందించడం పట్ల ఆయన వైటిపిఎస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు . డిసెంబర్లో గా అన్ని యూనిట్లను పూర్తి చేసి జనవరి 1 ,2026 నుండి. పూర్తి స్థాయిలో విద్యుత్ అందించేలా సమయాన్ని, అన్ని జాగ్రత్తలు పాటిస్తూ పని చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి ప్రోటోకాల్ ను పాటించాలని ,అంతేకాక యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్లో అన్ని సౌకర్యాలు బాగున్నాయనే విధంగా అభివృద్ధి చేయాలని ,అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల ,ఆస్పత్రులు నిర్మించి పరిసర ప్రాంతాల ప్రజలకు మేలు జరిగేలా చూడాలని చెప్పారు. పవర్ ప్లాంట్ ఆవరణలోని డిఏవి పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల ను పవర్ ప్లాంట్ లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు .అదేవిధంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా పనికొచ్చే విధంగా ఆసుపత్రి నిర్మాణం, అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. బొగ్గు లారీలు ,బూడిద లారీలతో రోడ్లు దెబ్బతిన్న కారణంగా సిసి రోడ్లను మంజూరు చేయడం జరిగిందని ,యుద్ధ ప్రాతిపదికన సిసి రోడ్ల నిర్మాణాన్ని పూర్తిచేయాలని, ఇందుకు సంబంధించి నష్టపరిహారం ,భూసేకరణకు సంబంధించిన పనులు సైతం వెంటనే పూర్తి చేయాలని తెలిపారు.

రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ తాను పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలోనే విష్ణుపురం డబుల్ రైల్వే లైన్ మంజూరు కావడం జరిగిందని, అయితే ఇప్పటివరకు పనులు పూర్తికాలేదని,త్వరితగతిన పనులు పూర్తి చేయాలని చెప్పారు. 93 కిలోమీటర్ల డబుల్ లైన్ రైల్వే పనులకు సరైన నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి రానందున ఆలస్యం అవుతున్నట్లు తెలిపారు .

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రహదారుల పూర్తికి 280 కోట్ల రూపాయలు మంజూరు చేయడమే కాక క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు.మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసినప్పటికీ సామాజిక బాధ్యతగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ప్రాజెక్టు నుండి ఎలాంటి సహకారం అందించడం లేదని తెలిపారు. రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సిఎస్ఆర్ కింద నిధులు విడుదల చేశామని, ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాత 10 కోట్ల రూపాయలు ఇచ్చినట్లు తెలిపారు. వై టి పి ఎస్ లోని అన్ని విభాగాలలో లాగ్ బుక్ ఆన్లైన్లో నమోదు తప్పనిసరిగా చేయాలని, ప్రతి ఉద్యోగి కార్డుతోనే యాక్సెస్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని, అన్ని యూనిట్ల లో పాటించే ప్రోటోకాల్ ను పై చార్ట్ లు ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు ప్రోటోకాల్ అప్డేట్ చేయాలని, పాఠశాల ఆస్పత్రుల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని యూనిట్లను నిర్దేశించిన ప్రకారం డిసెంబర్లో గా పూర్తి చేసి వచ్చే సంవత్సరం జనవరి ,ఫిబ్రవరి నాటికి అనుకున్న స్థాయిలో విద్యుత్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర జెన్కో సిఎండి డాక్టర్ హరీష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వైటీపీఎస్ ప్రస్తుత పరిస్థితిని వివరించారు.వైటీ పీఎస్ కు సంబంధించి రెండు యూనిట్లను పూర్తి చేయడం జరిగిందని, స్టేజి -2లో ఉన్న మూడు యూనిట్లు ఇదివరకే నిర్దేశించిన క్యాలెండర్ ప్రకారం పూర్తి చేయడం జరుగుతుందని, కంట్రోల్ యూనిట్లు, రైల్వే లైన్, ఇతర పనులపై ఆయన వివరాలు తెలియజేశారు.

అనంతరం ఉప ముఖ్యమంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ వై టి పి ఎస్ లోని యూనిట్ వన్ ద్వారా 800 మెగావాట్ల విద్యుత్తు అందించే యూనిట్ ను జాతికి అంకితం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జనవరి 21 2025 న రెండవ యూనిట్ ను జాతికి అంకితం చేశామని, స్టేజ్ వన్ లోని అన్ని యూనిట్లు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా ,స్టేజి- 2 కు సంబంధించిన యూనిట్లలో టార్గెట్ ఏర్పాటు చేసుకొని, డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు జనవరి 26 నుండి పూర్తిగా అంకితం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.గత ప్రభుత్వం రెండు సంవత్సరాలు వైటిపిఎస్ కు సంబంధించిన పర్యావరణ అనుమతులను క్లియరెన్స్ తీసుకురాక పోవడం వల్ల రెండు సంవత్సరాలు ప్రాజెక్టు పనులు ఆలస్యం అయ్యాయని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక సమయాన్ని నిర్దేశించుకొని అనుకున్న కార్యాచరణ ప్రకారం సంవత్సరం, నెల, వారానికి చేయాల్సిన పనులపై క్యాలెండర్ ప్రకారం ముందుకు వెళ్లి సంవత్సర కాలంలోని రెండు యూనిట్లు పూర్తి చేయడమే కాక, ఈ డిసెంబర్ నాటికి తక్కిన యూనిట్లు పూర్తి చేసేందుకు ముందుకు వెళుతున్నట్లు తెలిపారు .విద్యుత్ యూనిట్ పనులు ఆలస్యం కావడం వల్ల ప్రజలపై పడే భారాన్ని తగ్గించాలని క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. విద్యుత్ ఉత్పదనతో పాటు, వైటిపిఎస్ లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల ఏర్పాటు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రి, అంబులెన్స్ సేవలు ఏర్పాటు చేస్తున్నామని, సిబ్బందికి క్వార్టర్స్ కట్టిస్తున్నామని, ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. రహదారులు దెబ్బ తినకుండా సిసి రోడ్డు పనులు మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు. భూములు కోల్పోయిన వారికి గత ప్రభుత్వం పరిహారాన్ని గాలికి వదిలేస్తే తాము ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి ఉద్యోగాలు, పునరావాస కల్పన చేస్తున్నమని, పులిచింతల కింద చిట్యాల మండలంలో నష్టపోయిన రైతులకు కూడా ఉద్యోగాలు ,పరిహారం అందజేస్తున్నట్లు వెల్లడించారు. శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్ ,నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, హైడల్ డైరెక్టర్ బాలరాజు, కోల్ డైరెక్టర్ నాగయ్య, థర్మల్ డైరెక్టర్ వై. రాజశేఖర్ రెడ్డి ,జెన్కో సివిల్ డైరెక్టర్ అజయ్, జెన్కో హెచ్ఆర్ డైరెక్టర్ వి. కుమార్ రాజు తోపాటు, వైటీపీఎస్ పర్యవేక్షక ఇంజనీర్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పనుల పరిశీలించిన కాంగ్రేస్ నాయకులు



**మర్రిగూడ, ఆగస్ట్ 01(మనం న్యూస్):** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మర్రిగూడ కస్తూర్బా గాంధీ పాఠశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ క్లాస్ రూమ్, బాత్రూమ్స్ ప్రహరీ గోడ నిర్మాణం పురోగతి పనులను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రాజెక్టు ఏఈ శివాజీ 46 బాత్రూమ్స్, 9 క్లాస్ రూమ్స్, 2 రోజుల్లోనే కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి చేయడం జరిగింది.అదేవిధంగా విద్యార్థులకు ఆడుకునే%శీ%దుకు క్రీడా స్థలాని సిద్ధం చేస్తున్నామని అని నాయకులకు వివరించారు. అదేవిధంగా మిషన్ భగీరథ నీటిని కిచెన్ లోకి విద్యార్థులు త్రాగడానికి ఫిల్టర్ కు అందించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులకు వివరించడం జరిగింది.అతి తొందరగా 9 క్లాస్ రూమ్స్ ని వీటిని కంప్లీట్ చేసి చదువుకునేలా, సెపరేట్ డార్మెంటరీ, అందించి విద్యార్థుల సమస్యలకు మార్గం సుగుమం చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ రావు, మాజీ జెడ్పిటిసి మేతరి యాదయ్య,మాల్ మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్ యాదవ్,మాజీ సర్పంచ్ మాస నీలిమ చంద్రశేఖర్,జంగిలి రవి, మారనేని లుర్దయ్య,ఐతపాక జంగయ్య, మాజీ ఎంపీటీసీ ఎర్పుల శ్రీశైలం,వెంకటంపేట బాలయ్య,మాల్ మార్కెట్ డైరెక్టర్ గంట మల్లేష్, మునుగోడు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బనబోయిన రాము యాదవ్,యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఉడతల కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకులవరం నరేందర్ రెడ్డి, ఎలిమినేటి సతీరెడ్డి,మేతరీ శంకర్, వడ్డే వెంకటేష్,ఎస్సి సెల్ కన్వీనర్ సిర్పంగి శ్రీనివాస్,గ్రామశాఖ అధ్యక్షులు సలవోజు బిక్షమాచారి, తదితరులు పాల్గొన్నారు.

## మూటకొండూర్ పిహెచ్సిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

- **యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు**



**మోటకొండూర్, ఆగస్టు 1 (మనం న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్ లకు నాణ్యమైన వైద్యం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. మోటకొండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది అందరూ రెగ్యులర్ విధులకు హాజరవుతున్నారా లేదా అని ఆరా తీశారు. రోజు కి ఓపికి గా ఎంత మంది వస్తున్నారు అని, ఇప్పటివరకు ఎంతమంది నమోదు అయ్యారని మెడికల్ ఆఫీసర్ ని అడిగి తెలుసుకున్నారు. అన్ని మందులు అందుబాటులో ఉన్నాయా అని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా అంటువ్యాధులకుఅవసరమైన మందులు నిల్వ ఉంచాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన పేషెంట్స్ వద్దకు వెళ్లి మెడిసిన్ బయటికి నుండి తెచ్చుకోమని వైద్య సిబ్బంది ఏమైనా చెప్పారా అని ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గదులు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గత నెల, ఈ నెలలో ఎన్ని ఈ డిడి లు ఎన్ని అని అడిగారు. ఈ ఆసుపత్రి లో ఎన్ని ప్రసవాలు జరిగాయని అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇక్కడ నుండి మన జిల్లా ఆసుపత్రి కి ఎన్ని కేసులు డెలివరీ కి పంపించారు అని అడిగి అక్కడ ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ అయినా గర్భిణి కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడుతూ ఆసుపత్రి లో డాక్టర్స్, సిబ్బంది ఎలా రిసీవ్ చేసుకున్నారు , వైద్య సదుపాయాలు ఎలా ఉన్నాయి అని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్స్ చాలా బాగా చూసుకున్నారు సర్ అని ఎలాంటి ఇబ్బంది జరగలేదని, ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా డెలివరీ చేశారని, వాక్సిన్ కూడా వెంటనే వేశారని తెలిపారు. ఆసుపత్రి కి మళ్లీ ఒకసారి వచ్చి చెకప్ చేయించుకోమని కాల్ కూడా చేశారని కుటుంబ సభ్యులు కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూటకొండూర్ ఎస్సై డి అశోక్, మండల వైద్యాధికారి డాక్టర్ విజయ్, డాక్టర్ మోజేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు త్వరగా జీతాలు జమ చేయాలి

**మినీ అంగన్వాడి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆడెపు వరలక్ష్మీ**



**నల్లగొండు, ఆగస్టు 1(మనం న్యూస్):** అంగన్వాడీలకు ఈ నెల జీతాలు త్వరగా జమ చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర (మినీ) అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత కొన్ని నెలలుగా అంగన్వాడీలకు జీతాలు సకాలంలో అందక తాము ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.జూన్ నెల జీతాలు జులై 22 నాడు నుంచి జమ చేసారని సమయానికి జీతాలు రాక అంగన్వాడీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణ వంటి కీలకమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్న తమకు జీతాలు ఆలస్యం కావడం వల్ల కుటుంబ అవసరాలు తీర్చడం కష్టంగా మారిందని, మహిళలకు సంబంధించి అనేక పండుగలు ఈ నెల మొదటి వారంలోనే ఉందని,ప్రభుత్వం జులై నెల జీతాలు ఈ వారంలో చెల్లించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

## మహిళలను కఠిన చర్యలు



**సూర్యాపేట, ఆగస్టు 01 (మనం ప్రతినిధి):** పని ప్రదేశంలో ఉద్యోగం చేసే చోట మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారు హెచ్చరించారు, పని చేసే చోట మహిళలకు భద్రత, భరోసా కల్పించడం అందరి బాధ్యత, మహిళలను గౌరవించడం మన సంప్రదాయం, వారి ఎదుగుదలగు తోడ్పాటు ఇవ్వాలి, మహిళా సాధికారిత సమాజానికి మంచిది అని ఎస్పీ గారు ఒక ప్రకటనలో తెలిపినారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారు, కాలం, సమయం లెక్కచేయక పని చేస్తున్నారు అన్నారు. కుటుంబాన్ని పిల్లలను సరిదిద్దవంలో తల్లిగా మహిళా తన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తున్నది, అలాంటి మహిళా సమాజంలో ఏదోరకంగా వేధింపులకు గురవుతూనే ఉన్నది అన్నారు. పోలీసు శాఖ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నది అన్నారు. ప్రభుత్వ, ప్రవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, బ్యాంక్ లు, మార్కెట్ లు, ప్రభుత్వ ప్రవేటు సంస్థలు, ఫ్యాక్టరీలు, కూలీ ప్రదేశాలు ఇలా ఎక్కడైనా మహిళా పని చేసేచోట మహిళలను వేధించిన, ఇబ్బందులకు గురి చేసిన, అపహస్యం చేసినా, కించపరిచినా చట్టపరంగా చర్యలు ఉంటాయి అన్నారు. వేధింపులకు సంభందించి డయల్ 100 కు, జిల్లా షిటీమ్ పోలీస్ 8712686056 నంబర్ కు ఫిర్యాదు చేయాలి అన్నారు.



## నీలి నాలుక వ్యాధి టీకాలు

**గుండాల, ఆగస్టు1(మనం న్యూస్):** పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున మండలంలోని అంబాల గ్రామంలో గొర్రెలకు, మేకలకు ఉచితంగా నీలి నాలుక వ్యాధి టీకాలు సుమారు 827 జీవాలకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ యాకూబ్, వి ఏ రాజు, గోపాలమిత్రలు గోవిందు, కష్ణ, శ్రీను, నరేష్, గొర్ల కాపర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏకపక్ష రోస్టర్ విధానం మాలలకు అన్యాయం

**తిరుమలగిరి ఆగస్టు 01 (మనం న్యూస్):** ఏకపక్ష రోస్టర్ విధానంతో మాలలకు అన్యాయం జరుగుతుందని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు పిల్లి సుధాకర్ అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలకు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 99 ద్వారా మాల సామాజిక వర్గానికి తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు, నీట్ ఉద్యోగాలు,మెడికల్ ఇంజనీరింగ్, సీట్లలో రోస్టర్ విధానం రద్దు చేయాలని ఎస్సీ కేటగిరీలో మాలలకు అన్యాయం చేసే పాయింట్లు తగ్గించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశంపై పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ గంట యాకోబ్, తుంగతుర్తి నియోజకవర్గ కన్వీనర్ చింతపల్లి శేఖర్, తిరుమలగిరి మండల అధ్యక్షుడు గంట సందీప్, నాగారం మండల అధ్యక్షులు పెరుమల్ల జాన్ వెస్లీ, ఉపాధ్యక్షులు వంపు అమతి, గుండె పూరి అధ్యక్షుడు బలిక నాగేష్, గంట సాల్మోన్ ,మధ్యల ఇస్తారు,గంట రవి,దాసరి ప్రకాష్,వేరుపుల వెంకన్న,మద్దెల లారెన్స్, బోను పోతుల సురేష్, చింటూ,పెరుమల్ల రేణుక తదితరులు పాల్గొన్నారు.



## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



**సూర్యాపేట, ఆగస్టు 01 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు అన్ని రంగాల్లో 42% రిజర్వేషన్ను తక్షణమే అమలు చేయాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి రామ్ కోటి ప్రజాపతి, రాచమల్ల బాలకష్ణ లు డిమాండ్ చేశారు. బిసిలకు 42% రిజర్వేషన్ బిల్లు సాధనకై తెలంగాణ జాగతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈనెల 4, 5, 6, 7 తేదీల్లో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే తెలంగాణ జాగతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 72 గంటల నిరవధిక నిరాహార దీక్ష వాల్ పోస్టర్లను శుక్రవారం స్థానిక జే ఫంక్షన్ హాల్లో ఆవిష్కరించి మాట్లాడారు. కాబోయే ముఖ్యమంత్రులమని చెప్పుకునే నల్లగొండ కాంగ్రెస్ రెడ్లు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డిలు బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. అడుగున ఉన్న బీసీ బిల్లును పార్లమెంటులో, అసెంబ్లీలకు పంపి 9వ షెడ్యూల్లో చేర్చిన ఘనత కల్వకుంట్ల కవితదే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత కుట్రలతో బీసీ రిజర్వేషన్ బిల్లును ఆపాలని చూస్తుందన్నారు. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించిన గవర్నర్ ఆమోదించకుండా న్యాయ సలహా కోసం పంపించడం ఏమిటని ప్రశ్నించారు. తమిళనాడులో ఇదేవిధంగా జరిగితే వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారని రాష్ట్ర ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించి బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. బిసి రిజర్వేషన్ బిల్లు సాధనకై నిర్వహించే 72 గంటల నిరవధిక నిరాహారదీక్షకు 30 కుల సంఘాలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని ఈనెల 4 5 6 7 తేదీల్లో నిర్వహించే కల్వకుంట్ల కవిత నిరవధిక 72 గంటల నిరాహార దీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పగిళ్ల సైదులు, రెడ్డబోయిన నరేష్, కె వీరబాబు, సట్టు మురళి, వేముల వీరమల్లు, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు గొట్టిపర్తి లింగయ్య, ఎలకపల్లి సైదులు, ప్రవీణ్, రాసమల్ల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం



**గుండాల, ఆగస్టు 1(మనం న్యూస్):** తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరంగా ఉపయోగపడతాయని ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ హేమలత ఐసిడిఎస్ సూపర్వైజర్ షమీం యాకుపాషా బేగం తెలిపారు. శుక్రవారం రోజున మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రపాలు పట్టించాలని తల్లిపాలు బిడ్డకు అమతంతో సమానమని ముర్రపాలలో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. బిడ్డకు డబ్బా పాలు అందించకుండా ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలని ఆరు నెలలు నిండిన తర్వాత అనుబంధ ఆహారం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, ఆశలు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన కల్పించాలి
- క్షేత్రస్థాయిలో వైద్య క్యాంపులు నిర్వహించాలి
- నిత్యం ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండాలి
- స్పెషల్ ఆఫీసర్ తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి ఐఏఎస్



**ములుగు, ఆగస్టు 1, మనం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యుల ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధుల నియంత్రణ, పర్యవేక్షణ ప్రత్యేక అధికారి గా నియమాకం అయిన (ఉమ్మడి వరంగల్ జిల్లాలకు)తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఅఖి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీజనల్ వ్యాధుల నియంత్రణ పర్యవేక్షణ ప్రత్యేక అధికారి (ఉమ్మడి వరంగల్ జిల్లాలకు) తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

రాష్ట్రంలో సీజనల్ వ్యాధులను నియంత్రించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు, సెక్రటరీ, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ లు ప్రత్యేక అధికారి గా నియమించిన సందర్భంగా.. శుక్రవారం ప్రత్యేక అధికారి ములుగు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిని సందర్శించారు.

ఈ సందర్భంగా హాస్పటల్ యందు ఫీవర్ వార్డును పరిశీలించి జ్వరంతో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకుని వారికి వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయి అని, వైద్యులు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారా అని ఆరా తీశారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖతో సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై జరిగిన సమీక్ష సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సీజనల్ వ్యాధుల పై ప్రభుత్వము నియమించిన స్పెషల్ ఆఫీసర్ తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి ఐఏఎస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, మారుమూల గ్రామాలలో దోమల నియంత్రణకు యాంటీ లార్వా స్ప్రే చేయాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాలు వేసి దోమల నియంత్రణ గావించి మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా లాంటి వ్యాధులను నియంత్రించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు.

పంచాయతీరాజ్ శాఖ జిల్లా అధికారులు, మండలాధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులతో వైద్య ఆరోగ్యశాఖ సమన్వయ పరచుకొని , గ్రామాలలో పరిశుభ్రతను ఏర్పరచాలని మురికి కాలువలో నీటి నిల్వలు ఉండకుండా చూడాలని కాలువలపై ఆంటీ లార్వా స్ప్రే చేయాలని దానితోపాటు క్లోరినేషన్ చేసిన నీటిని గ్రామస్తులకు సరఫరా చేయాలని,ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు గ్రామాలలో ఇంటింటి సందర్శన గావించినపుడు, ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఇంటి యజమానులకు అవగాహన కల్పించాలని తెలిపారు అప్పుడే కీటకజనిత మలేరియా డెంగు వ్యాధులను నియంత్రించవచ్చునని వైద్య ఆరోగ్య శాఖకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లో రాపిడ్ రెస్పాన్స్ టీమ్లను ఉప కేంద్రాలలో మానిటరింగ్ సూపర్వైజర్ లను నియమించి ఈ వర్షాకాలంలో వచ్చే మలేరియా డెంగ్యూ వ్యాధులను నియంత్రించడానికి పటిష్టమైన ప్రణాళికలను తయారు చేశామని, ఆరోగ్య కేంద్రాలలో పరీక్షల కొరకు రి ఏజెంట్లను కొనుగోలు చేయుటకు మరియు ఎమర్జెన్సీ మందుల నిమిత్తము నిధులను మంజూరు చేశామని గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు తోపాటు ఆర్బీఎస్కే ఎం సి హెచ్ ఎప్పుడేమిక్ టీం లతో పాటు ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్లో పనిచేసే పల్లె దవకాన వైద్యాధికారులను నియమించామని వివరించారు. గుత్తి కోయ గ్రామాలలో మరియు ఇతర హైరిస్క్ గ్రామాలలో ఇప్పటికే యాంటీ లార్వా స్ప్రేలు నిర్వహించామని ట్రైబల్ వెల్ఫేర్ సోషల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో రెండు దఫాలుగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పోషకార ప్రాముఖ్యతను వ్యక్తిగత పరిశుభ్రతను పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు, డి పి ఓ దేవ్ రాజ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, సామాజిక ఆరోగ్య కేంద్రం ఏటూరు నాగారం సూపరిండెంట్ డాక్టర్ సురేష్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పవన్ కుమార్, డెమో సంపత్ ఏ ఎం ఓ దుర్గారావు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపత్ రావు వెంకట్ రెడ్డి, భూపాల్ రెడ్డి, సాంబయ్య మానిటరింగ్ సూపర్వైజర్ సురేష్ బాబు ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల మిడ్లేవల్ హెల్త్ ప్రొవైడర్స్, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- మండల ప్రత్యేక అధికారి లక్ష్మణ్

**కమలాపూర్ 01 మనం న్యూస్:** వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీడీవో గుండె బాబుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పలు రికార్డు లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ముగిసేంతవరకు ప్రతి మంగళవారం, శుక్రవారం రోజు లలో ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. డ్రై డే రోజులలో ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని పాత కూలర్లు, కొబ్బరి బోండాలు వంటి వాటిలో నీరు ఉంటే పారబోసి దోమలు రాకుండా చూసుకునే బాధ్యత ఇంటి కుటుంబ సభ్యుల పై ఉంటుందని వారికి గ్రామ స్థాయిలో ఉండే ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రతను పాటించాలని, డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు వ్యాపించకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# తొర్రూరులో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

## నకిలీ మద్యం, నెంబర్ లేని వాహనాల సీజ్

**తొర్రూరు, ఆగస్ట్ 1(మనం న్యూస్):** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్ ఆదేశానుసారం, తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్ పర్యవేక్షణలో సీఐ తవటం గణేష్ నేతత్వంలో శుక్రవారం తొర్రూరు పట్టణంలోని సాయి నగర్ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా నెంబర్ లేని 20 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. అదేవిధంగా దాదాపు రూ. 7000 విలువైన మద్యం, 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 40 లీటర్ల బెల్లం పానకాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ ఆపరేషన్లో నెల్లికుదురు ఎస్ఐ రమేష్ బాబు, పెద్దవంగర ఎస్ఐ క్రాంతికుమార్, తొర్రూరు అదనపు ఎస్ఐలు శివకుమార్, అంజమ్మలతోపాటు సర్కిల్ పరిధిలోని మొత్తం 60 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ, నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని, అక్రమ కార్యకలాపాలలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి, ఆగస్టు 01(మనం న్యూస్):** ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే కాంగ్రెస్ పార్టీ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించిందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్లోని గాంధీ భవన్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా విని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పౌరులు ప్రజలు తమకు ఉన్న భూ సమస్యలు, పెండింగ్ పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య సమస్యలు వంటి అంశాలపై వినతులను స్వీకరించారు. కొన్ని విషయంలో అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపారు.ఈ సందర్భంగా





ఎమ్మెల్యే మాట్లాడారు. ఎవరు భయపడకుండా, నేరుగా ప్రజాప్రతినిధులకు తమ సమస్యలు తెలియజేసే అవకాశం ప్రజావాణి కార్యక్రమం ద్వారా లభిస్తోందని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరి సమస్యను స్వీకరిస్తామని అధికార యంత్రాంగం స్పందించకపోతే, ప్రజలు తమ హక్కుల కోసం ఎక్కడైనా అడగవచ్చు. ప్రజలతో కలసి ఉండటం, వారి అవసరాలకు సహకరించడం నా బాధ్యత ప్రజల నుంచి వచ్చిన ప్రతీ వినతిని నిర్లక్ష్యం చేయకుండా పరిష్కారం కోసం అనుసంధానం జరగాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఎమ్మెల్యే తెలిపారు.

# పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



- ఏసిడిపిఓ విజయలక్ష్మి

**తొర్రూరు, ఆగస్టు 01(మనం న్యూస్):** అంగన్వాడి కేంద్రాలలో ప్రభుత్వం అందించే పౌష్టిక ఆహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఏసిడిపిఓ విజయలక్ష్మి కోరారు. ఈనెల 1 నుండి 7 వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలు భాగంగా శుక్రవారం మండలంలోని మడిపల్లి, ఖానాపురం, గుర్తురు, సోమారం, జీకే తండా, పెద్ద మంగ్య తండాలతో పలు గ్రామ పంచాయతీల పరిధిలోని అంగన్వాడి సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలను ఆయా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ బిడ్డ పుట్టగానే మురుపాలు పట్టించాలని,ఆరు నెలలు తల్లిపాలు సజీవ పౌష్టిక ఆహారంగా పరిగణించబడతాయని అన్నారు. గర్భిణీలు, బాలింతలు ఆకుకూర పాలు గుడ్లు మాంసం ఎక్కువ తీసుకోవాలని దీనివల్ల తల్లి శిశువు ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. అంగన్వాడి సెంటర్ లలో ప్రభుత్వం పంపిణీ చేసే పౌష్టికాహారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎస్.కె గౌసియా, అంగన్వాడి టీచర్లు సోమ విజయ, ఎం. పద్మ, రజిత,అరుణమ్మ, ఉదయశ్రీ,సుజాత, శాంతి, టి.సరస్వతి, బి. వసంత, సంధ్యారాణి, రమాదేవి, మహేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

- మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్ కుమార్

**పరకాల, ఆగస్టు 1(మనం న్యూస్):** నడి కూడ మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుధ్య ఎప్పటికప్పుడు నిర్వహించాలి అని సీజనల్ వ్యాధుల పట్ల పంచాయతీ అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీరు నిల్వ లేకుండా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని నడికుడ మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్ కుమార్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో విమల. ఏపీవో విద్యావతి. ఆరోగ్యశాఖ అధికారుల బృందంతో కలిసి మండలంలోని వరి కోల్ పులిగిల్ల ప్రభుత్వ పాఠశాల ను సందర్శించారు. అనంతరం శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమంలో పాల్గొని పరిశీలించారు . గ్రామంలో ఇంటి ఇంటికి వెళ్లి,





ప్రజలకు వర్షాకాలంలో తీసుకోవలసిన ఆరోగ్యపరమైన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించాలనీ, చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలనీ, దోమల బారిన పడకుండా రక్షణ తీసుకోవాలని వివరించారు. ఆరోగ్యవంతమైన జీవనశైలి పాటించాలనీ వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఏఎన్ఎం ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



- అందించిన బిల్లా సుధీర్ రెడ్డి

**రాయపర్తి, ఆగస్టు 1(మనం న్యూస్):** రాయపర్తి మండల కేంద్రానికి చెందిన కంతుల సోమక్క గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి బాధితురాలి స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మచ్చ రమేష్ ,మాజీ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి మహమ్మద్, మండల నాయకులు ఎండి నయీమ్, రాయపర్తి పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పిరని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు ఆర్డీఎఫ్ విద్యార్థి



**పర్వతగిరి, ఆగస్టు 01(మనం న్యూస్):** రాష్ట్ర స్థాయి100 మీటర్లు పరుగు పందెం మరియు లాంగ్ జంప్ లో వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని కల్లెడ గ్రామంలో ఆర్ డి ఎఫ్ కల్లెడ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న గుగులోత్ సందీప్ జిల్లా స్థాయి అండర్ 18 అథ్లెటిక్స్ పోటీలో 100 మీటర్ల పరుగులో మరియు లాంగ్ జంప్ లో మొదటి స్థానంలో నిలిచి ఆగష్టు 3వ మరియు 4వ తేదీలలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ పాఠశాల నుండి పదవ తరగతి విద్యార్థి సందిప్ రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడం అభినందనీయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ సంతోష్, రమేష్,ఏఓఎస్ సల్ల రాజు పిఈటిలు వేణు రవితేజ మరియు ఉపాధ్యాయ బృందం ,తల్లి తండ్రులు మరియు పాఠశాల విద్యార్థిని విద్యర్థులు పాల్గొని అభినందిచారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ములుగు, ఆగస్టు 1(మనం ప్రతినిధి):** ఇందిరమ్మ పథకం ద్వారా మంజూరైన ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. శుక్రవారం ములుగు మండలం జగ్గన్నపేట గ్రామంలోని చిన్న గుంటూరు పల్లి లో, అన్నంపల్లి లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని, ప్రతి ఇంటి నిర్మాణాన్ని నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు నిర్మాణ పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, అవసరమైన మౌలిక సదుపాయాలు (విద్యుత్, నీరు, రోడ్లు) అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేస్తూ, తగిన మార్గదర్శకాలను పాటిస్తేనే లక్ష్యాన్ని సకాలంలో చేరగలమని తెలిపారు. నిర్మాణాలు పూర్తయిన వెంటనే లబ్ధిదారులు గృహ ప్రవేశం చేయగల పరిస్థితులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం పి డి ఓ రామకృష్ణ, హౌసింగ్ ఏ ఈ, పంచాయితి కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



- పుట్టిన రోజున, నోట్ బుక్స్ ఐడి కార్డ్, బెల్టు పంపిణీ.
- విద్యార్థులకు సామగ్రిని అందించడం అభినందనీయం: ఎంఈఓ లక్ష్మణ్
- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**చేవెళ్ల ఆగస్టు 01(మనం న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంఈఓ లక్ష్మణ్. శుక్రవారం రిపోటర్ నరేందర్ కుమారుడు అయాన్ సిద్ధార్థ్ పుట్టినరోజు సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల పరిధి నాగర్ గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు పైగా నోటు బుక్స్, పెన్నులు, ఐడి కార్డు, ప్రభుత్వ పాఠశాల లోగో బెల్టులు ఎంఈఓ లక్ష్మణ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ... డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనల విధానంలో భాగంగా పే బ్యాక్ సొసైటీ నినాదంతో ముందుకు సాగుతూ విద్యార్థుల విద్యకై ఈ కార్యక్రమం చేశామన్నారు. తమ కుమారుడు అయాన్ సిద్ధార్థ్ ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించానని, తోటి విద్యార్థుల మధ్య పుట్టినరోజు జరపడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. అనంతరం ఎంఈఓ లక్ష్మణ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టినందుకు నరేందర్ ను అభినందించారు. అంతరం వారిని శాలువతో సత్కరించి అభినందలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలోకాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణ, ఉపాధ్యాయురాలు కవిత నాగర్ గూడ మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్, విలేజ్ సెక్రటరీ అజీమ్ వెంకటేష్, ముక్తార్ విటల్ గౌడ్ మహమ్మద్ ఆబేద్ సలీం మనీషా, తదితరులు పాల్గొన్నారు.

# జన వికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**తొర్రూరు, ఆగస్టు 01(మనం న్యూస్):** మండలంలోని మాటేడు గ్రామంలో జన వికాస ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహ హాస్పిటల్ సహకారంతో శుక్రవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ మద్దెల రమ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మహిళలకు చాలా రకాల అనారోగ్య సమస్యలు, క్యాన్సర్లు వస్తున్నాయని జాగ్రత్త పడాలన్నారు. ఆరోగ్యాన్ని అప్పుడప్పుడు పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. సుమారు 15 మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సరిత, డాక్టర్ భార్గవి, సుభాష్, క్రిష్ణ వేణి, రాజేష్, పాల్గొన్నారు.



## బాత్రూమ్‌లో విరాట్ ఏడవటం చూశా: యుజ్వేంద్ర చాహల్

జట్టు విజయం కోసం చివరి వరకూ పోరాడటం అతడి నైజం. కానీ, కీలక సమయంలో తన టీమ్ ఓడిపోతే తట్టుకోలేడు. అతడి నాయకత్వంలో ఒక్క ఐసీసీ ట్రోఫీని భారత్ కు అందించలేకపోయినా సరే అద్భుత సారథుల్లో ముందువరుసలో ఉంటాడు. అతడే విరాట్ కోహ్లీ. 2019 వన్డే ప్రపంచకప్ లో టీమ్‌ఇండియాకు నాయకత్వం వహించిన సంగతి తెలిసిందే.



సెమీస్ లో న్యూజిలాండ్ చేతిలో భారత్ ఓడిపోయింది. ఎంఎస్ ధోనీ, రవీంద్ర జడేజా పోరాడినా టీమ్‌ఇండియాకు ఓటమి తప్పలేదు. ఆ పరాభవాన్ని తట్టుకోలేక భారత అభిమాని మాత్రమే కాకుండా జట్టులోని ప్రతి ఒక్కరూ బాధపడ్డారు. విరాట్ అయితే బాత్రూమ్లోకి వెళ్లి మరీ ఏడ్చినట్లు సీనియర్ క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టాడు. గత ఐపీఎల్ టైటిల్ ను బెంగళూరు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అప్పుడూ కోహ్లీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. దానిని గుర్తు చేసుకుంటూ.. ''2019 వరల్ కప్ సమయంలోనూ కోహ్లీ ఏడవడం చూశా. అతడు మాత్రమే కాదు జట్టులోని ప్రతి ఒక్కరిదే అదే పరిస్థితి. నేనే చివరిగా క్రీజ్ లో నుంచి వచ్చా. కోహ్లీను దాటి ముందుకెళ్తుంటే అప్పటికే అతడి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ధోనీకిదే చివరి మ్యాచ్. మరో 15 పరుగులు తక్కువగా ఇవ్వాల్సింది. నేను ఇంకొంచెం ఉత్తమంగా బౌలింగ్ చేసి ఉంటే బాగుండేదనిపించింది'' అని చాహల్ వెల్లడించాడు. ఆ మ్యాచ్ లో అతడు 10 ఓవర్లలో 63 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ మాత్రమే తీశాడు.

## ఆటపైనే దృష్టి పెట్టా..



హంపీతో మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్లో తాను ఎలాంటి ఒత్తిడికి గురికాలేదని దివ్య దేశ్ ముఖ్ చెప్పింది. తాను కోల్పోయేదేమీ లేకపోవడమే అందుకు కారణమని తెలిపింది. ''ఫైనల్ సందర్భంగా నాకెప్పుడూ ప్రమాదంలో ఉన్నట్లు అనిపించలేదు. హంపి చేసిన ఆఖరి తప్పిదం నాకు విజయాన్నిచ్చింది'' అని దివ్య వ్యాఖ్యానించింది. ఫైనల్లో ఎప్పుడైనా ఒత్తిడికి గురయ్యారా అన్న ప్రశ్నకు ఆమె ఇలా స్పందించింది. 19 ఏళ్ల దివ్య ఫైనల్లో టైబ్రేక్ లో హంపిపై గెలిచిన సంగతి తెలిసిందే. ఆమె బుధవారం బాటుమి (జార్జియా) నుంచి భారత్ చేరుకుంది. ''ఫలితం నా చేతుల్లో లేదు కాబట్టి నా ఆటపైనే దృష్టిపెట్టడానికి ప్రయత్నించా. దేని గురించీ ఆలోచించలేదు'' అని దివ్య చెప్పింది. ''నా ఈ విజయం తర్వాత అమ్మాయిలు పెద్ద ఎత్తున చెస్ లోకి వస్తారని ఆశిస్తున్నా. యువ తరానికి నా వద్ద ఎలాంటి సందేశం లేదు. తల్లిదండ్రులకు మాత్రం.. వైఫల్యాల్లో పిల్లలకు మనస్ఫూర్తిగా మద్దతివ్వమని చెబుతా. విజయాల్లో మద్దతు పెద్దగా అవసరం లేదు'' అని ఆమె పేర్కొంది. తన విజయానికి తన తల్లిదండ్రులే కారణమని దివ్య తెలిపింది. తన తొలి కోచ్ రాహుల్ జోషి తాను గ్రాండ్ మాస్టర్ కావాలని కోరుకున్నారని చెప్పింది. జోషి 40 ఏళ్ల వయసులో 2020లో మరణించారు.



## టీమ్ ఇండియా 224 పరుగులకు ఆలౌట్

తెండూల్కర్-అండర్సన్ ట్రోఫీలో భాగంగా ఓవల్ వేదికగా ఇంగ్లాండ్, టీమ్‌ఇండియా అయిదో టెస్ట్ మ్యాచ్ ఆడుతున్నాయి. భారత జట్టు తొలి ఇన్నింగ్స్ లో 224 పరుగులకు ఆలౌటైంది. తొలి రోజు 204/6 పరుగులు చేసిన భారత జట్టు రెండో రోజు కేవలం 20 పరుగులకే మరో నాలుగు వికెట్లు కోల్పోయింది. టీమ్‌ఇండియా బ్యాటర్లలో కరుణ్ నాయర్ (57) టాప్ స్కోరర్. మిగతా బ్యాటర్లంతా తక్కువ పరుగులకే వెనుదిరిగారు. యశస్వి జైస్వాల్



(2), కేఎల్ రాహుల్ (14), రవీంద్ర జడేజా (9), ధ్రువ్ జురేల్ (19) బ్యాటింగ్ లో విఫలమయ్యారు. సాయిసుదర్శన్ (38), శుభ్ మన్ గిల్ (21), వాషింగ్టన్ సుందర్ (26) ఫర్వాలేదనిపించారు. ఇంగ్లాండ్ బౌలర్లలో గస్ అట్కిన్సన్ 5 వికెట్లు పడగొట్టాడు. జోష్ టంగ్ 3, క్రిస్ వోక్స్ 1 వికెట్ తీసుకున్నారు.





## జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రకటన..

**సినిమా ఇండస్ట్రీలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే జాతీయ చలనచిత్ర అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతల జాబితాను శుక్రవారం (ఆగస్టు 1న) సాయంత్రం వెల్లడించింది. 2023లో దేశవ్యాప్తంగా విడుదలైన వందలాది సినిమాల నుంచి అందిన నామినేషన్లను జ్యూరీ పరిశీలించి విజేతలను ఎంపిక చేసింది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సదరు విజేతల వివరాలను వెల్లడించారు. ఉత్తమ తెలుగు చిత్రంగా భగవంత్ కేసరిని ప్రకటించారు.**



**ఉత్తమ నటుడు**
షారూఖ్ ఖాన్ - జవాన్
విక్రాంత్ మాస్సే - 12th ఫెయిల్

**ఉత్తమ నటి**
రాణీ ముఖర్జీ - మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే హిందీ చిత్రం

**ఉత్తమ సహాయ నటుడు**
విజయరాఘవన్ - పోక్కాలమ్ మలయాళ చిత్రం
ముధుపెట్టయి సోము భాస్కర్ - పార్కింగ్ తమిళ చిత్రం

**ఉత్తమ సహాయ నటి**
ఊర్వశి - ఉళ్లోళుక్కు మలయాళ చిత్రం
జంకీ బోడివాల - వశ్ గుజరాతీ చిత్రం

**బెస్ట్ చైల్ ఆర్టిస్ట్**
సుకృతి వేణి బండ్రెడ్డి - గాంధీ తాత చెట్టు
కబీర్ ఖాండరి - జిప్సీ మరాఠీ మూవీ
త్రిష తోసార్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ జగ్తాప్ - నాల్ 2 మరాఠీ మూవీ

**బెస్ట్ మేల్ ప్లేబ్యాక్ సింగర్**
ప్రేమిస్తున్నా.. (పీవీఎన్ ఎస్ రోహిత్) - బేబీ మూవీ

**బెస్ట్ ఫీమేల్ ప్లేబ్యాక్ సింగర్**
చెలియా.. (శిల్పారావు సింగర్) - జవాన్

**బెస్ట్ సినిమాటోగ్రఫీ**
ప్రసంతను మొహపాత్ర - ద కేరళ స్టోరీ

**బెస్ట్ స్క్రీన్ ప్లే**
**ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత**
బేబీ: సాయిరాజేశ్ నీలం
పార్కింగ్: రాంకుమార్ బాలకృష్ణన్

**డైలాగ్ రచయిత**
దీపక్ కింగ్రాని: సిర్ఫ్ ఏక్ బండా కాఫీ హై

**ఉత్తమ తమిళ చిత్రం** - పార్కింగ్
**ఉత్తమ పంజాబీ చిత్రం** - గొడ్డే గొడ్డే చా
**ఉత్తమ ఒడియా చిత్రం**- పుష్కర
**ఉత్తమ మరాఠీ చిత్రం** - శ్యాంచీ ఆయ్
**ఉత్తమ మలయాళ చిత్రం** - ఉల్లొళు
**ఉత్తమ కన్నడ చిత్రం** - కందిలు
**ఉత్తమ హిందీ చిత్రం** - కాథల్
**ఉత్తమ గుజరాతీ చిత్రం** - వశ్
**ఉత్తమ బెంగాలీ చిత్రం** - డీప్ ఫ్రిడ్జ్
**ఉత్తమ అస్సామీస్ చిత్రం** - రొంగటపు 1982
**బెస్ట్ యాక్షన్ డైరెక్షన్ (స్టంట్ కొరియోగ్రఫీ)** - హనుమాన్, స్టంట్ కొరియోగ్రాఫర్: నందు, పృథ్వీ

**స్పెషల్ మెన్షన్**
యానిమల్ (రీరికార్డింగ్ మిక్సర్) - ఎమ్ఆర్ రాజకృష్ణన్

**నాన్ ఫీచర్ ఫిలిం విజేతల జాబితా**

**బెస్ట్ డైరెక్షన్**
పీయూశ్ ఠాకూర్ (ద ఫస్ట్ ఫిలిం)

**బెస్ట్ స్క్రిప్ట్**
సన్ ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ వన్స్ టు నో (కన్నడ) - కథారచయిత- చిదానంద నాయక్

**బెస్ట్ వాయిస్ ఓవర్**
ద సేక్రడ్ జాక్: ఎక్స్ప్లోరింగ్ ద ట్రీ ఆఫ్ విషెస్ (ఇంగ్లీష్) - (వాయిస్ ఓవర్: హరికృష్ణన్ ఎస్)

**బెస్ట్ మ్యూజిక్ డైరెక్షన్**
ప్రణీల్ దేశాయ్ (ద ఫస్ట్ ఫిలిం - హిందీ)

**బెస్ట్ ఎడిటింగ్**
నీలాద్రి రాయ్ (మూవింగ్ ఫోకస్)

**బెస్ట్ సౌండ్ డిజైన్**
శుభరుణ్ సేన్ గుప్తా (దుండగిరి కె ఫూల్)

**బెస్ట్ సినిమాటోగ్రఫీ**
లిటిల్ వింగ్స్ (తమిళ చిత్రం) - శరవణముత్తు సౌందరపండి, మీనాక్షి సోమన్

**బెస్ట్ ఫిలిం క్రిటిక్ :** ఉత్పల్ దత్తా (అస్సామీస్)

**బెస్ట్ డైరెక్షన్**
**ద ఫస్ట్ ఫిలిం** - పీయూశ్ ఠాకూర్

**ఉత్తమ షార్ట్ ఫిలిం**
గిద్ ద స్కావెంజర్

**బెస్ట్ నాన్ ఫీచర్ ఫిలిం (సోషల్ అండ్ ఎన్విరాన్ మెంట్ వాల్యూస్)**
ద సైలెంట్ ఎపిడమిక్ (హిందీ)

**బెస్ట్ డాక్యుమెంటరీ**
గాడ్ వల్చర్ అండ్ హ్యూమన్ (ఇంగ్లీష్, హిందీ, తెలుగు)

**బెస్ట్ ఆర్ట్స్/కల్చర్ ఫిలిం**
టైమ్ లెస్ తమిళనాడు (ఇంగ్లీష్)

**బెస్ట్ బయోగ్రఫికల్/హిస్టారికల్ రికన్ స్ట్రక్షన్ ఫిలిం**
మా బో, మా గాన్ (ఒడియా చిత్రం), లెంటినా ఓ: ఎ లైట్ ఆన్ ద ఈస్టర్న్ హారిజన్ (ఇంగ్లీష్ చిత్రం)

**బెస్ట్ డెబ్యూ డైరెక్టర్**
శిల్పిక బోర్డొలాయ్ (మావ్: ద స్పిరిట్ డ్రీమ్స్ ఆఫ్ చెరియూ- మిజోరాం చిత్రం)

**బెస్ట్ నాన్ ఫీచర్ ఫిలిం**
ఫ్లవరింగ్ మ్యాన్ (హిందీ)

## ఆ పాటకు ఓకే చెప్పడం కష్టమైన నిర్ణయం - ప్రియాంక చోప్రా

సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కిన 'రామ్-లీలా' అప్పట్లో ట్రెండ్ సృష్టించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో 'రామ్ చాహే లీలా' అనే ప్రత్యేక పాటలో బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా ఆడి పాడారు. వైట్ డ్రెస్ లో తన డ్యాన్స్ తో యూత్ లో జోష్ నింపారు. తాజాగా ఈ పాట జ్ఞాపకాలను ఆమె గుర్తుచేసుకున్నారు. దీన్ని ఓకే చెప్పడం ఆమె తీసుకున్న కఠినమైన నిర్ణయమని అన్నారు.

''సంజయ్ ఈ పాట కోసం నన్ను సంప్రదించినప్పుడు నేను చేయగలనా అనుకున్నాను. కష్టంగానే ఓకే చెప్పా. కానీ, దర్శకుడు నాకు ధైర్యాన్నిచ్చారు. హావభావాల దగ్గర నుంచి డ్యాన్స్ మూమెంట్స్ వరకూ ఆయన సలహాలిచ్చారు. పాటలోని ప్రతి పదం అర్థాన్ని వివరించారు. కొరియోగ్రాఫర్ అద్భుతంగా కంపోజ్ చేశారు. భోజన విరామ సమయంలోనూ నాకు డ్యాన్స్ మూమెంట్స్ గురించే వివరించేవారు. ఈ జ్ఞాపకాలన్నీ ఎప్పటికీ గుర్తుంటాయి'' అని ప్రియాంక రాసుకొచ్చారు.

రొమాంటిక్ డ్రామాగా వచ్చిన రామ్-లీలాలో రణ్ వీర్ - దీపికా ప్రధాన పాత్రల్లో నటించారు. 2013లో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా అప్పట్లోనే రూ.200 కోట్లకు పైగా వసూలు చేసింది. గ్యాంగ్ స్టర్ కుటుంబాలకు చెందిన ఇద్దరు ప్రేమికుల చుట్టూ దీని కథ తిరుగుతుంది. ఇక ఈ సినిమాకు సంజయ్ లీలా భన్సాలీనే స్వరాలు అందించడం విశేషం.
## అందుకే హిందీ సినిమాలకు రిజెక్ట్ అయ్యానేమో: సుమంత్

'అనగనగా' తో ఇటీవల మంచి విజయం అందుకున్నారు నటుడు సుమంత్. ఆ మూవీ డైరెక్టర్ సన్నీ సంజయ్ తో కలిసి ఓ చిట్ చాట్ లో పాల్గొన్నారాయన. అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాధానమివ్వడంతోపాటు పలువురు సినీ ప్రముఖులపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆ సంగతులివీ..

'సినీ నేపథ్యం ఉన్న వారిని ఆడిషన్ చేస్తారా?' అని ఓ అభిమాని అడగ్గా సుమంత్ స్పందించారు. ''ఫిల్మ్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న వారికి ఇండస్ట్రీలోకి ప్రవేశించడం తేలికేగానీ అది కొంత వరకే హెల్ప్ అవుతుంది. ఓ స్థాయి దాటాక ఎవరైనా ఆడిషన్ ఇవ్వాల్సిందే. కొన్నాళ్ల క్రితం నేను నాలుగైదు హిందీ ప్రాజెక్టులకు ఆడిషన్స్ ఇచ్చా. రిజెక్ట్ అయ్యా. హిందీ భాషపై పట్టులేకపోవడం వల్లే తిరస్కరించి ఉంటారని అనుకుంటున్నా'' అని వివరించారు. తనకు సినిమాలే ప్రపంచమని, ఒకవేళ నటుడు కాకపోయి ఉంటే ఆ రంగానికి సంబంధించి ఏదో పని చేసేవాడినని మరో ప్రశ్నకు సమాధానం చెప్పారు. టాలీవుడ్ ప్రముఖుల గురించి ఏమన్నారంటే?

**బాలకృష్ణ:** 'అఖండ 2' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా
**మహేశ్బాబు:** కొన్ని రోజుల క్రితమే మహేశ్ని కలిశా. 'ఎస్ఎస్ఎంబీ 29' మూవీ కోసం వెయిటింగ్
**నాగార్జున:** ఆయన 100వ సినిమా కోసం ఎదురుచూస్తున్నా
**వెంకటేశ్:** నా రోల్ మోడల్
**ఎన్టీఆర్:** 'దేవర' చూశాక ఫోన్ చేసి మాట్లాడా
**రానా:** స్వీట్ పర్సన్. తరచూ మాట్లాడుకుంటుంటాం
**విజయ్ దేవరకొండ:** 'అర్జున్ రెడ్డి' విషయంలో ఈర్ష్యగా ఉంటుంది (నవ్వుతూ). నా ఫేవరెట్ చిత్రాల్లో అదొకటి
**దుల్కర్ సల్మాన్:** మంచి మనిషి. మా ఇద్దరికీ కార్లంటే ఇష్టం
**రాజమౌళి:** హాలీవుడ్ ని మించి సినిమాలు చేయగలరు
పూరి జగన్నాథ్: ఆయన పాడ్ కాస్ట్ చాలా ఇష్టం.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.